RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

శనివారం 21.12.2024 | సంపుటి : 11 సంచిక : 158 | పేజీలు : 12 వెల: రూ. 4/-

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

భూముల సమాచారాన్ని

దేశం దాటించారు

'ధరణి' అక్రమాలపై విచారణకు ప్రభుత్వం ఆదేశం

- లక్షన్నర కోట్ల విలువైన భూముల గోల్ మాల్
- బీఆర్ఎస్ అస్మదీయులకు విచ్చలవిడిగా రిజిస్ట్రేషన్లు
- నలుగురు వ్యక్తుల పేర్ల మీద భూముల బదలాయింపు
- ధరణి పేరుతో నిరుపేదల ఆస్తులు కొల్లగొట్టారు
- అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటన
- ప్రత్యేక సిట్ నియమించే అవకాశముందని వెల్లడి



హైదరాబాద్,డిసెంబర్20(జనంసాక్షి): తెలంగాణలో ధరణి పోర్టల్ తీసుకొచ్చి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే ఈ చట్టాన్ని రద్దు చేసి భూ భారతీ తీసుకొచ్చిన ప్రభుత్వం ఇప్పుడు ధరణి అక్రమాలపై దృష్టి పెట్టింది. ఈ చట్టం పేరుతో చేసిన కబ్జాలను వెలుగులోకి తీసుకొచ్చేందుకు ఫోరెన్సిక్ విచారణ చేస్తున్నట్టు సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. 'ధరణి'పై పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో 1 లక్షా 50 వేల కోట్ల విలువ చేసే భూములు చేతులు మారాయని మంత్రి పొంగులేటి ఆరోపించారు. లిటిగేషన్‌లో ఉన్న భూములను పార్టీ-బీ లో పెట్టి ఆ

మిగతా 2లో..

వాడి వేడి చర్చ అనంతరం సభ తీర్మానం

- ప్రతి సమస్యా భూమితో ముడిపడి ఉంది
- భూమికోసం ఎన్నో పోరాటాలు
- ధరణి పోర్టల్‌తో విదేశీ కంపెనీల చేతికి వివరాలు: సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి
- బిఆర్ఎస్ సభ్యుల తీరుపై ఆగ్రహం
- ధరణిపై సిబిఐ విచారణకు బిజెపి డిమాండ్
- ఈ కార్ రేసింగ్‌పై చర్చకు బిఆర్ఎస్ పట్టు
- శాసనసభలో తీవ్ర గందరగోళం
- భూభారతిపై చర్చను అడ్డుకునే యత్నం
- స్పీకర్‌పై పేపర్లు చించి విసిరిన సభ్యులు
- నిరసన తెలుపుతూ సభ నుంచి వాకౌట

2లో

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ అసెంబ్లీలో భూభారతి బిల్లు - 2024 ఆమోదం పొందింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బిల్లును ప్రవేశపెట్టారు. భూ భారతి బిల్లు ప్రవేశ పెట్టే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. బిల్లు ఆమోదం పొందుతుండటంతో ఆనంద భాష్పాలు వస్తున్నాయన్నారు. సభలో భూ భారతి బిల్లు ప్రవేశ పెట్టిన మంత్రి..బిల్లును పాస్ చేయాల్సిందిగా స్పీకర్ ను కోరారు. సభ్యులు ఆమోదిస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. అనంతరం అసెంబ్లీని స్పీకర్ శనివారానికి వాయిదా వేశారు. భూభారతిపై చర్చ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రతి సమస్య భూమితోనే ముడిపడి ఉందని అన్నారు. తెలంగాణలో ప్రజల ఆత్మగౌరవం నిలబెట్టేది భూమి. భూమిని కాపాడుకునే ప్రయత్నంలో దొడ్డి కొమరయ్య వంటి వారు ప్రాణాలు కోల్పోయారు. రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మల్లు స్వరాజ్యం లాంటి అనేక మంది

మిగతా 2లో..

రూ.600 కోట్ల దోపిడీకే

ఫార్ములా ఈ-రేస్: సీఎం రేవంత్

- సంస్థతో కేటీఆర్ లోపాయికారీ ఒప్పందం
- దీనిపై ఎప్పుడైనా ఎక్కడైనా చర్చకు సిద్ధం
- విచారణలో ఉన్నందున వివరాలు వెల్లడించలేను.. సభలో సీఎం వివరణ

హైదరాబాద్,డిసెంబర్20(జనంసాక్షి): ఈఫార్ములా సంస్థతో జరిగిన కేటీఆర్ లోపాయికారీ ఒప్పందం అంతా ప్రజల ముందు పెడతానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అసెంబ్లీలో కేటీఆర్ ఈ-ఫార్ములా కేసుపై సీఎం మాట్లాడుతూ.. బీఆర్ఎస్ బీఏసీ మీటింగ్‌లో

మిగతా 2లో..

హైకోర్టులో కేటీఆర్‌కు

స్వల్ప ఊరట

- 30 వరకు అరెస్ట్ చేయొద్దన్న ధర్మాసనం
- క్వాష్ పిటీషన్‌పై విచారణ
- కేసులో ఏసీబీ దర్యాప్తు కొనసాగించుకోవచ్చు
- పది రోజుల్లో కౌంటరు దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశం.. విచారణ 27కి వాయిదా

హైదరాబాద్(జనంసాక్షి): భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌కు హైకోర్టులో స్వల్ప ఊరట లభించింది. ఫార్ములా-ఈ కార్ రేస్ వ్యవహారంలో తెలంగాణ ఏసీబీ తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని కేటీఆర్ దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై విచారణ జరిగింది.ప్రాథమిక దర్యాప్తు ఇప్పటికే పూర్తయినందున మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వొద్దని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. కేటీఆర్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సుందరం, ప్రభాకర్‌రావు, గంధ్ర మోహన్‌రావు వాదనలు వినిపించారు. అవినీతి నిరోధక చట్టం కింద పెట్టిన సెక్షన్లు

మిగతా 2లో..

ఫార్ములా-ఈ రేసు కేసు..

రంగంలోకి ఈడీ

హైదరాబాద్(జనంసాక్షి): ఫార్ములా ఈ-రేసు వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్ట రేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఇప్పటికే ఏసీబీ కేసు నమోదు చేసిన నేపథ్యంలో ఎఫ్ఐఆర్, డాక్యుమెంట్లు

మిగతా 2లో..

అణాపైసా అవినీతి జరగలేదు

ఫార్ములా-ఈరేస్ కేసును న్యాయపరంగానే అన్నీ ఎదుర్కొంటాం

అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో కేటీఆర్ వెల్లడి

హైదరాబాద్, డిసెంబర్ 20 (జనంసాక్షి): ఫార్ములా-ఈ రేస్ కేసులో అణాపైసా అవినీతి లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాటలతో ఈ కేసులో అవినీతి లేదని తేలిందన్నారు. ప్రొసీజర్ కరెక్ట్‌గా లేదని మాత్రమే అన్నారని చెప్పారు. ప్రభుత్వం కేసుపై ముందుకు వెళ్తే న్యాయపరంగా ఎదుర్కొంటామని చెప్పారు. హెచ్ఎండీఏ ఒక కార్పొరేషన్ అని, హైదరాబాద్ నగర ప్రగతికి పనికి వచ్చే ఏ కార్యక్రమానికైన డబ్బులు ఖర్చు చేయవచ్చని తెలిపారు. హెచ్ఎండీఏ చేసే ప్రతి పనికి ప్రభుత్వ అనుమతి అవసరం లేదని చట్టంలోనే ఉందన్నారు. దానికి ఆ మేరకు స్వతంత్రత ఉందని చెప్పారు. అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో కేటీఆర్ చిట్‌చాట్ చేశారు. ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో కొందరు తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. సీఎంను ఎవరో తప్పుదోవ పట్టిస్తున్నారా లేదా ముఖ్యమంత్రే అందరినీ తప్పుదోవ పట్టిస్తున్నారో అర్థం కావడంలేదని చెప్పారు. తనపై కేసు నిలవదని స్పష్టం చేశారు. లీగల్‌గా ముందుకు వెళ్తామని, లంచ్ మోషన్ పిటిషన్‌పై కోర్టు తేలుస్తుందన్నారు.ఓఆర్ఆర్ లీజు అంశంలో సిట్ ఏర్పాటుపై కూడా కేటీఆర్ స్పందించారు. టీఓటీ పద్ధతి దేశంలో ఇప్పటికే అమలులో ఉందన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు లీజు డబ్బును రైతు రుణమాఫీకి ఉపయోగించామని చెప్పారు. ఆర్థిక వనరుల సమీకరణపై అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ అనేక సూచనలు ఇచ్చింది. ఓఆర్ఆర్ నుంచి డబ్బులు

మిగతా 2లో..

కేటీఆర్‌పై కేసు సక్రమమే

రేసింగ్ స్కాంలో అక్రమాలు జరిగినట్టు ఆధారాలున్నాయి

నిర్దోషినంటూ తనకు తానే సర్టిఫికేట్ ఇచ్చుకోవడం హాస్యాస్పదం

బీఆర్ఎస్ నేతల దోపిడీతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింది

:టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

హైదరాబాద్(జనంసాక్షి): కేటిఆర్‌లో అహంకారం పరాకాష్టకు చేరిందని..ఆయనపై నమోదైన కేసు సక్రమేనని టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. అక్రమాలు జరిగినట్టు పలు ఆధారాలున్నా..

మిగతా 2లో..

జేపీసీకి జమిలి బిల్లు...

లోక్‌సభలో తీర్మానం ఆమోదం

పార్లమెంటరీ స్థాయి సంఘం చైర్‌పర్సన్‌గా భాజపా ఎంపీ పీపీ చౌదరి నియామకం

న్యూఢిల్లీ, డిసెంబర్ 20 (జనంసాక్షి): ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీలకు ఎన్నికలు నిర్వహించే అంశంపై రూపొందిన జమిలి బిల్లును పార్లమెంటరీ స్థాయి సంఘానికి పంపాలని శుక్రవారం లోక్‌సభ తీర్మానం పాస్ చేసింది. సభను నిరవధికంగా వాయిదా వేయడానికి ముందు రెండు బిల్లులను జేపీసీకి పంపేందుకు తీర్మానాన్ని లోక్‌సభ ఆమోదించింది. న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అయితే రెండు రోజుల క్రితం జమిలి ఎన్నికల బిల్లుకు లోక్‌సభలో ఆమోదం దక్కిన విషయం తెలిసిందే. అయితే పార్లమెంటరీ స్థాయి సంఘంలో ఉండే సభ్యుల వివరాలను పంపించాలని రాజ్యసభను మంత్రి కోరారు. సంయుక్త పార్లమెంటరీ స్థాయి సంఘం కమిటీలో మొత్తం 39 మంది ఎంపీలు ఉంటారు. దాంట్లో 27 మంది లోక్‌సభ, 12 మంది రాజ్యసభ సభ్యులు ఉండనున్నారు. మాజీ కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్, పీపీ చౌదరీ, ప్రియాంకా గాంధీలు లోక్‌సభ నుంచి ఆ కమిటీలో ఉన్నారు. జమిలి ఎన్నికలకు సంబంధించిన రెండు బిల్లులపై జేపీసీలో చర్చిస్తారు. ఓ బిల్లు కోసం మాత్రం రాజ్యాంగ సవరణ అవసరమని నిపుణులు చెబుతున్నారు.

లోకసభ నిరవధిక వాయిదా

లోక్‌సభ శుక్రవారం నిరవధిక వాయిదా ఎ ✓ డింది. విపక్ష సభ్యుల ఆందోళన నేపథ్యంలో స్పీకర్ ఓం బిర్లా సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఆ సమయంలో ప్రధాని మోదీ సభలో ఉన్నారు. మరో వైపు ఇవాళ ఉదయం పార్లమెంట్ ఆవరణలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద .. ఇండియా కూటమి ఎంపీలు నిరసన చేపట్టారు. అంబేద్కర్‌పై

మిగతా 2లో..

రాజస్థాన్‌లో ఘోర ప్రమాదం

8 మంది మృతి.. 40 మంది గాయాలు

ఎల్పీజీ ట్యాంకర్‌ను ఢీ కొన్న ట్రక్కు

సమీపంలోని పెట్రోల్ బంకుకు వ్యాపించిన మంటలు

పలు వాహనాలు దగ్ధం

జైపూర్(జనంసాక్షి): రాజస్థాన్ లోని జైపుర్‌లో ఓ పెట్రోల్ బంకులో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో 8 మంది మృతి చెందినట్లు తెలుస్తోంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..

మిగతా 2లో..

పార్శిల్‌లో మృతదేహం

పశ్చిమగోదావరి జిల్లాలో కలకలం

ఉండి(జనంసాక్షి): పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం యండగండిలో విసుగొలిపే ఘటన చోటుచేసుకుంది. పార్శిల్‌లో గుర్తుతెలియని మృతదేహం రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.జిల్లా ఎస్పీ నయీం అస్మి ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు.సాగి తులసి అనే మహిళకు యండగండి గ్రామంలో ప్రభుత్వం నుంచి స్థలం మంజూరు కాగా ఇల్లు నిర్మిస్తోంది.. ప్రస్తుతం ఆ ఇల్లు ప్లాస్టింగ్ స్టేజ్‌లో ఉంది. ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం

మిగతా 2లో..

ధన్‌ఖడ్‌పై అభిశంసన తీర్మానం..

ట్రైలర్ మాత్రమే

వచ్చే బడ్జెట్ సమావేశాల్లో ఆయనపై అవిశ్వాసం నోటీసులు ఇచ్చేఅవకాశం: కాంగ్రెస్

న్యూఢిల్లీ(జనంసాక్షి): రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ పై విపక్షాలు ప్రవేశపెట్టిన అభిశంసన తీర్మానం నోటీసులు కేవలం ట్రైలర్ మాత్రమేనని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో ఆయనపై అవిశ్వాసం కోసం విపక్షాలు మళ్లీ నోటీసులు ఇచ్చే అవకాశం ఉందన్నారు. ఉపరాష్ట్రపతిని తొలగించేందుకు ఇచ్చిన నోటీసు అనాలోచిత చర్యగా పేర్కొంటూ డిప్యూటీ ఛైర్మన్ దానిని తిరస్కరించిన విషయం తెలిసిందే."ఛైర్మన్‌పై అభిశంసన తీర్మానం కోసం మేం ఇచ్చిన నోటీసులు తిరస్కరించారు. అవిశ్వాస తీర్మానం ఎన్నిసార్లు ఇవ్వాలనే అంశంపై రాజ్యాంగంలో ఎలాంటి పరిమితి లేదు. అందుకే, జనవరి 30 నుంచి ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాల్లో దీనిని మళ్లీ పరిశీలిస్తాం" అని కాంగ్రెస్ నేత జైరాం

మిగతా 2లో..

బహిరంగ వ్యాఖ్యలు చేసేముందు ఒక్కసారి ఆలోచించుకోవాలి

బంగ్లా నేత పోస్టుపై భారత్ ఆగ్రహం

2లో

షట్‌డౌన్ దిశగా అమెరికా..!

న్యూయార్క్(జనంసాక్షి): ప్రభుత్వ కార్యకలాపాలు, జీతాలకు సంబంధించిన కీలకమైన బిల్లు ఆమోదం పొందకపోవడతో అమెరికా స్తంభించిపోయే ముప్పును ఎదుర్కొంటోంది.వాస్తవానికి తొలుత బైడెన్ ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లును ట్రంప్ తిరస్కరించారు. దీంతో ప్రతినిధుల సభ స్పీకర్ మైక్ జాన్సన్ మార్చి 14వ తేదీ వరకు ప్రభుత్వానికి నిధులు సమకూర్చేలా సరికొత్త బిల్లును ప్రవేశపెట్టారు. రెండేళ్లపాటు రుణాలపై సీలింగ్‌ను సస్పెండ్ చేయడం వంటి ట్రంప్ డిమాండ్లను ఇందులో చేర్చారు. దీంతో కాబోయే అధ్యక్షుడు కూడా బిల్లుకు మద్దతు తెలుపుతూ.. మిగిలినవారు కూడా సానుకూలంగా ఓటేయాలని పిలుపునిచ్చారు. దీనిని డెమోక్రాట్లు తీవ్రంగా వ్యతిరేకించారు. కానీ, ప్రతినిధుల సభ దీనిని కూడా 235-174తో తిరస్కరించింది.

మిగతా 12లో..

ఉక్రెయిన్ ఉక్కిరిబిక్కిరి

- రష్యా క్షిపణి దాడులతో దద్దరిల్లిన కీవ్‌నగరం
- మరోవైపు సైబర్ దాడులతోనూ అతలాకుతలం

కీవ్(జనంసాక్షి): రష్యా అధ్యక్షుడు పుతిన్ వార్షిక విలేకర్ల సమావేశం ముగిసిన 24 గంటల్లోనే ఉక్రెయిన్ పై భారీగా క్షిపణి, సైబర్ దాడులు జరిగాయి. ముఖ్యంగా కీవ్ ఆధీనంలోని ప్రభుత్వ రిజిస్ట్రీలనే హ్యాకర్లు లక్ష్యంగా చేసుకున్నారు. ఈ విషయాన్ని ఉక్రెయిన్ డిప్యూటీ ప్రధాని ఓలాహ్ స్టెఫలిష్నా వెల్లడించారు. ఈ దాడుల కారణంగా చాలా సేవలను నిలిపివేయాల్సి వచ్చిందన్నారు. ఈ రిజిస్ట్రీల్లో ప్రజల జనన మరణాలు, పెళ్లిళ్లు, ఆస్తులకు సంబంధించిన కీలక వివరాలు ఉన్నట్లు పేర్కొన్నారు. "ఇటీవల కాలంలో ఎన్నడూ చూడని స్థాయిలో బయటి నుంచి సైబర్ దాడి జరిగింది. దీంతో జస్టిస్ శాఖ ఆధీనంలోని ఏకీకృత రిజిస్ట్రీలను మూసివేసి.. సేవలను సస్పెండ్ చేశాం. వీటిని పునరుద్ధరించడానికి కనీసం రెండు వారాల సమయం పడుతుంది.. ఆయా కార్యాలయాల్లో మాత్రం ఈ సేవలు అందుతాయి. దేశాన్ని ఇబ్బంది పెట్టడానికే రష్యా ఇలా చేసింది" అని స్టెఫలిష్నా పేర్కొన్నారు.జెలెన్‌స్కీ సొంత ఊరు క్రైవీ రిహ్‌పై మాస్కో గురిపెట్టింది. ఇక్కడి రెండంతస్తుల భవనంపై క్షిపణి దాడి చేసింది. అదే సమయంలో రాజధాని కీవ్‌పై మరోదాడి జరిగింది. ఈ ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోగా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. దీనికి రష్యా రక్షణ మంత్రిత్వశాఖ స్పందిస్తూ బుధవారం కీవ్ దళాలు చేసిన దాడికి ఇది ప్రతిస్పందన అని పేర్కొంది. అమెరికా తయారీ

మిగతా 2లో..

యూజీసీ నెట్ పరీక్షల తేదీలు మార్పు

- రోజుకు రెండు సెషన్లలో జనవరి 3నుండి నిర్వహణ
- 85 సబ్జెక్టుల్లో ఆన్‌లైన్ విధానంలో..
- కొత్త షెడ్యూల్ విడుదల

న్యూఢిల్లీ,డిసెంబర్ 20(జనంసాక్షి): జూనియర్ రిసెర్చి ఫెలోషిప్ అవార్డు, పీహెచ్‌డీ ప్రవేశాలకు, యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు పోటీ పడేందుకు అర్హత సాధించే యూజీసీ నెట్ పరీక్షకు దేశ వ్యాప్తంగా యమ డిమాండ్ ఇంటుంది. అందుకే ప్రతీయేట ఈ పరీక్షను రెండు సార్లు యూజీసీ నిర్వహిస్తుంది. ఈ ఏడాది డిసెంబర్ సెషన్ కు సంబంధించి పరీక్షల తేదీలను ఇప్పటికే యూజీసీ

మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
21.12.2024

భూముల సమాచారాన్ని
దేశం దాటించారు

భూములను సక్రమం చేసుకున్నారని దోచిన భూములను బీఆర్ఎస్ నేతలు తమ అస్మదీయులకు విచ్చలవిడిగా రిజిస్ట్రేషన్లు చేశారన్నారు. కొన్నిచోట్ల భూములకు యజమానులు ఇక్కడ లేరని .. దేశ విభజన సమయంలో పాకిస్తాన్ వెళ్లిపోయారని, అధికారులు నో అబ్జెక్షన్ అని చెప్పారంటూ ఆ భూములను కూడా కాజేశారని పేర్కొన్నారు. ధరణి వల్ల అక్రమంగా రిజిస్ట్రేషన్ అయిన భూమి ముగ్గురు, నలుగురు వ్యక్తులు మీద మాత్రమే బదలాయింపు అయిందని ఆరోపించారు. ధరణి పేరుతో నిరుపేదల ఆస్తులను కూడా కొల్లగొట్టారన్నారు. అలాగే ధరణి వల్ల సుమారు 25 వేల ఎకరాల అసైన్డ్ భూములు అన్యాక్రాంతమయ్యాని ప్రభుత్వం భావిస్తోంది. ఒక్క ఇబ్రహీంపట్నం పరిధిలోనే 10 వేల ఎకరాలు అన్యాక్రాంతం చేశారని ప్రభుత్వ వర్గాలంటున్నాయి. అక్కడ ఎకరా రూ.10 కోట్ల విలువ ఉంటుందని న్యాక్రాంతమైన 25 వేల ఎకరాల భూముల మొత్తం విలువ రూ.2.50 లక్షల కోట్లుగా అంచనా వేస్తున్నారు. ధరణి మసుగులో జరిగిన భూ ఆక్రమనలన్నీ బయట పెడతామని, దీని వెనకాల ఎంత పెద్దవారున్నా వదిలే ప్రసక్తేలేదని ఇప్పటికే పలు సందర్భాలలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. గత పదేళ్లలో చోటు చేసుకున్న భూ ఆక్రమణల మీద సమగ్ర విచారణ చేయడానికి సిట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అసెంబ్లీలో దీనిపై ప్రకటన చేయలేదు కానీ రేపో మాపో ఉత్తర్వులు జారీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతంలో చేసిన తప్పులను సరిదిద్దుకోకుండా భారాస సభ్యులు వక్రబుద్ధితో వ్యవహరిస్తున్నారని తెలంగాణ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. 'భారాస సభ్యులు భూ భారతి బిల్లును ఆమోదించకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. వారి తీరు సభ్యసమాజం సిగ్గుపడేలా ఉంది. సభలో గూండాగిరి, దౌర్జన్యం, రౌడీయిజం లేకుండా స్పీకర్ చర్యలు చేపట్టాలి. భారాస హయాంలో తీసుకొచ్చిన 'ధరణి' పోర్టల్ తప్పులతడకగా ఉందని కేసీఆర్‌కు తెలుసు. ఆయన 80వేల పుస్తకాలు చదివారు. పుస్తకాలను క్షుణ్ణంగా పరిశీలించి ధరణి పోర్టల్ రూపొందించారని అనుకునేవాళ్లం. ఆ చట్టానికి మూడేళ్లకే వందేళ్లు నిండాయి. ఇందిరమ్మ రాజ్యంలో 1971లో చేసిన చట్టం.. 49 ఏళ్లుగా ప్రజల్లో ఉంది. భూ భారతి బిల్లుకు సంబంధించి భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అనేక సూచనలు ఇచ్చారు. ఈ బిల్లు సభలో ప్రవేశపెట్టినప్పుడు ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ కూడా సూచనలు చేస్తారని ఆశించాం. అవి చట్టంలో పొందుపరచాలని భావించాం. కేసీఆర్ రాలేదు.. సభలో ఉన్నవాళు ఈరకంగా గొడవ చేస్తున్నారు. భారాస చిల్లర వేషాలను ప్రజలు హర్షించరు' అని పొంగులేటి వ్యాఖ్యానించారు. అంతకుముందు హరీశ్‌రావు తీరుపై స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భారాస సభ్యుల ఆందోళన సందర్భంగా స్పీకర్ మాట్లాడారు. 'హరీశ్‌రావు తీరు రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం చేసేలా ఉంది. సభను తప్పుదోవ పట్టించడం సరికాదు. భూ భారతి ముఖ్యమైన బిల్లు. ప్రజలకు సంబంధించిన బిల్లులపై చర్చల సమయంలో ఇలా ప్రవర్తించడం సరికాదు. ఈ బిల్లు ఇష్టం లేదా? రైతులకు సాయం చేయడం ఇష్టం లేదా?'అని స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

జేపీసీకి జమిలి బిల్లు... లోక్‌సభలో తీర్మానం ఆమోదం

కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఇండియా కూటమి నేతలు తప్పుపట్టారు. షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్‌ను అవమానించిన షా రాజీనామా చేయాలని ఇవాళ విజయ్ చౌక్ వద్ద విపక్ష ఎంపీలు ఆందోళన చేపట్టారు. జమిలి ఎన్నికల బిల్లును జేపీసీకి లోక్‌సభ రిఫర్ చేసింది. మరో వైపు విపక్ష సభ్యుల ఆందోళన నేపథ్యంలో రాజ్యసభను 12 గంటల వరకు వాయిదా వేశారు. జమిలి ఎన్నికల ముసాయిదాను జేపీసీకి పంపాలన్న తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని స్పీకర్ బిర్లా.. న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌ను కోరారు. మరో వైపు సభలో విపక్షాలు జైభీం అంటూ కేకలు పెట్టారు. పార్లమెంట్ గేటు వద్ద ఆందోళనలు, నిరసనలు చేపట్టరాదు అని స్పీకర్ బిర్లా ఆదేశించారు. విపక్ష సభ్యుల ఆందోళనల నేపథ్యంలో స్పీకర్ సభను నిరవధిక వాయిదా వేశారు.

జేపీసీకి ఛైర్‌పర్సన్‌గా భాజపా ఎంపీ పీపీ చౌదరి నియామకం

జమిలి ఎన్నికలపై అధ్యయనానికి ఏర్పాటైన జాయింట్ పార్లమెంటరీ కమిటీ (ఏఖఅ)కి ఛైర్మన్‌గా భాజపా ఎంపీ పీపీ చౌదరి నియమితులయ్యారు. ఈ విషయాన్ని లోక్‌సభ సెక్రటేరియట్ శుక్రవారం ప్రకటించింది. దేశ వ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి నిర్వహించేందుకు ఉద్దేశించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లుపై అధ్యయనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం జేపీసీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ కమిటీలో సభ్యుల సంఖ్యను గురువారం 31 నుంచి 39కి పెంచారు. దీని ప్రకారం లోక్‌సభ నుంచి 27 మంది ఎంపీలు, రాజ్యసభ నుంచి 12 మంది చొప్పున ఉంటారు.

యూజీసీ నెట్ పరీక్షల తేదీలు మార్పు

ప్రకటించింది. అయితే ఈ తేదీల్లో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి.. ఈ మేరకు మారిన పరీక్ష తేదీలతోపాటు పరీక్షల షెడ్యూల్‌ను యూజీసీ ప్రకటించింది. దేశ వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు, జూనియర్ రిసెర్చి ఫెలోషిప్ అవార్డు, పీహెచ్‌డీ ప్రవేశాలకు ఈ పరీక్షలో అర్హత సాధించడం తప్పనిసరి. అందుకే యేటా రెండు సార్లు యూజీసీ నెట్ పరీక్షలు నిర్వహిస్తుంది. తాజా షెడ్యూల్ ప్రకారం జనవరి 3, 6, 7, 8, 9, 10, 15, 16 తేదీల్లో రోజుకు రెండు సెషన్ల చొప్పున పరీక్షలు నిర్వహించనున్నట్లు యూజీసీ వెల్లడించింది. మొత్తం 85 సబ్జెక్టుల్లో ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించనుంది. కాగా యూజీసీ నెట్ డిసెంబర్ 2024 ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ నవంబర్ 19 నుంచి డిసెంబర్ 10 వరకు కొనసాగిన విషయం తెలిసిందే. త్వరలోనే అడ్మిట్ కార్డులను యూజీసీ విడుదల చేయనుంది. కాగా యూజీసీ- నెట్ పరీక్ష కంప్యూటర్ ఆధారిత విధానంలో జరుగుతుంది. ఈ పరీక్ష మొత్తం రెండు పేపర్లకు ఉంటుంది. రెండు పేపర్లలో ఆబ్జెక్టివ్ టైప్, మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు మాత్రమే ఉంటాయి. పేపర్ 1లో 50 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు కేటాయిస్తారు. మొత్తం 100 మార్కులకు ఈ పరీక్ష ఉంటుంది. పేపర్ 2లో 100 ప్రశ్నలు 200 మార్కులకు ఉంటుంది. పరీక్ష 3 గంటల వ్యవధిలో ఉంటుంది. పేపర్-1లో రీజనింగ్ ఎబిలిటీ, రీడింగ్ కాంప్రహెన్షన్, డైరెక్షంట్ థింకింగ్, జనరల్ అవేర్‌ననెస్ వంటి అంశాలపై ప్రశ్నలు వస్తాయి. ఇక పేపర్ 2లో అభ్యర్థి ఎంచుకున్న సబ్జెక్ట్ ఆధారంగా ప్రశ్నలు వస్తాయి. లాంగ్వేజెస్ సబ్జెక్టులు మినహా మిగతా అన్ని సబ్జెక్టుల ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీ మీడియంలలో మాత్రమే ఉంటుంది.

షట్‌డౌన్ దిశగా అమెరికా..!

ఏకంగా 38 మంది రిపబ్లికన్ సభ్యులే డెమోక్రాట్లతో కలిసి బిల్లుకు వ్యతిరేకంగా ఓటేశారు. మరోవైపు ప్రస్తుతానికి సెనెట్‌లో డెమోక్రాట్ల పట్టు కొనసాగుతోంది. దీంతో శుక్రవారం రాత్రిలోగా ప్రభుత్వానికి నిధులు సమకూర్చడంలో కాంగ్రెస్ విఫలమైతే అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్ ఎదుర్కోక తప్పని పరిస్థితి నెలకొంది.

అమెరికాలో లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. దాదాపు 8,75,000 మంది పనులు నిలిచిపోయే అవకాశం ఉంది. వీరిలో చాలామందిని పని ప్రదేశంలో రిపోర్టు చేయవద్దట్టారని బైపార్టీసన్ పాలసీ సెంటర్ డైరెక్టర్ అక్బాస్ వెల్లడించారు. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వంటి విభాగాల్లోని మరో 14 లక్షల మంది మాత్రం అత్యవసర సేవలు కొనసాగించాల్సి ఉంటుంది. వీరితో సెలవుల్లో కూడా పని చేయించుకొని చెక్ ఇవ్వరని ది అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ సంఘం పేర్కొంది. షట్‌డౌన్ ముగిశాకే.. వారికి పాత వేతనాలు చెల్లింపులు జరుగుతాయని పేర్కొంది. కొన్ని కాంట్రాక్టుల్లో ఈ చెల్లింపులకు ఎలాంటి హామీలు ఉండవని తెలిపింది. అమెరికా శత్రువులకు ఈ షట్‌డౌన్ ఓ క్రిస్మస్ గిఫ్ట్ అని అభివర్ణించింది. ఇక ముఖ్యంగా రవాణశాఖ, ఇతర రంగాలపై ఈ షట్‌డౌన్ ముప్పు కొనసాగుతుంది.సోషల్ సెక్యూరిటీ, మెడికేర్ లబ్ధిదారులపై దీని ప్రభావం ఉండదు. వీరికి సంబంధించిన ప్రయోజనాలను కాంగ్రెస్ ప్రత్యేక చట్టం రూపంలో ఆమోదం తెలుపుతుంది.

భూభారతి బిల్లుకు శాసనసభ ఆమోదం

భూ పోరాటాలు చేశారు. పేదల భూములు కాపాడేందుకు పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేశారు. భూమిలేని పేదలకు ఇందిరాగాంధీ ప్రభుత్వ భూమి ఇచ్చి ఆత్మగౌరవం నిలబెట్టింది. ఆక్రమణలు తొలగించి రైతుల హక్కులు కాపాడేందుకు గత ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు తెచ్చాయని అన్నారు. భూభారతిపై వాడీవేడిగా చర్చ సాగింది. బిల్లుపై విపక్ష బిఆర్ఎస్ సభ్యులు చర్చించకుండా ఆందోళనకు దిగారు. బిల్లుపై చర్చించాలని, ఇది రైతులకు సంబంధించినదని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పదేపదే సూచించారు. భూముల అన్యాక్రాంతం, లక్షల కోట్ల అవినీతి జరిందని డిప్యూటి సిఎం భట్టి, మంత్రి పొంగులేటి ప్రకటించినా ఎందుకు సిబిఐ విచారణకు ఆదేశించలేదని బిజెపి నేతమహేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. ఈ క్రమంలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలు సహనం కోల్పోయి స్పీకర్ గడ్డం ప్రసాద్ పట్ల దారుణంగా వ్యవహరించారని అన్నారు. అమర్యాదగా ప్రవర్తించి సభాపతిపైనే పేపర్లు విసిరారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శాసనసభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ప్రతిపక్షం వ్యవహార శైలి, ధరణి పోర్టల్, కేసీఆర్, ఫార్ములా-ఈ కార్ రేసుపై సీఎం రేవంత్ రెడ్డి సంచలన విషయాలు బయటపెట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తనపై దారుణంగా ప్రవర్తించినా స్పీకర్ గడ్డం ప్రసాద్ మాత్రం సహనాన్ని ప్రదర్శించారని ఆయన అన్నారు. ప్రతిపక్షం అహంభావంతో వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం తెచ్చిన 'ధరణి' మాత్రం రైతులను తమ భూములకు దూరం చేసింది. 2010లో ఒడిశా కూడా ఇదే ధరణి విధానాన్ని తీసుకొస్తే.. ఒడిశా ప్రభుత్వం తప్పు చేసిందని ఎన్ఐసీ, కాగ్ సూచించాయి. అనుభవం లేని ఐ అండ్ ఎల్ఎఫ్ఎస్ సంస్థకు అప్పగించొద్దని హెచ్చరించింది. తెలంగాణ ప్రభుత్వం మాత్రం యువరాజుకు అత్యంత సన్నిహితుడైన గాదె శ్రీధర్‌రాజు కంపెనీకి ధరణి పోర్టల్ నిర్వహణను అప్పగించారు. క్రిమినల్ కేసుల్లో ఇరుక్కున్న సంస్థలను ఐఎల్ అండ్ ఎల్ఎఫ్ఎస్ సంస్థ టేకోవర్ చేసుకుంది. అవకతవకలకు పాల్పడిన సంస్థకు ధరణి పోర్టల్ బాధ్యతను అప్పగించారు. ధరణి టెండర్ దక్కగానే ఈ సంస్థ పేరు, యాజమాన్యం మారింది. ఫాల్కన్ హెచ్‌బీ అనే ఫిలిప్పీన్ కంపెనీ, తర్వాత సింగపూర్ కంపెనీ ఇందులోకి వచ్చాయి. 50 లక్షల మంది రైతులు, వారి భూముల వివరాలను ఈ సంస్థ చేతిలో పెట్టారు. ట్యాక్స్ హెవెన్ దేశాల కంపెనీల చేతిలో మన ధరణి పోర్టల్ పెట్టారు. ఫిలిప్పీన్స్, సింగపూర్, కెమెన్ హైలాండ్స్, వర్జిన్ ఐలాండ్ మీదుగా ధరణి పోర్టల్ తిరిగింది. పోర్టల్ నిర్వహణ ఏ కంపెనీ చేతిలోకి వెళ్లినా.. సీఈవోగా గాదె శ్రీధర్‌రాజే ఉన్నారు' అని సీఎం వివరించారు. సీఎం ప్రసంగం తర్వాత భూ భారతి బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. విపక్ష పార్టీ అహంభావంతో అహంకారంతో వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సభా మర్యాదలను ఉల్లంఘించి సభాపతిపైనే దాడి చేస్తామన్న ధోరణిలో చర్చను అడ్డుకోవాలని ప్రయత్నించిందన్నారు. 'రెచ్చగొట్టడం ద్వారా భూ భారతి బిల్లుపై చర్చను పక్కదోవ పట్టించాలని ప్రయత్నించినా.. చాలా ఓర్పుతో సభాపతి వ్యవహ రించారు. ఏ మాత్రం సహనం కోల్పోకుండా.. వాళ్లంతట వాళ్లే సహనం చచ్చిపోయి సహకరించాల్సిన పరిస్థితి కల్పించి సభను ముందుకు నడిపించారు. తెలంగాణ రైతాంగానికి ఉపయోగపడే కీలకమైన, ముఖ్యమైన బిల్లుపై చర్చ జరిగే విధంగా కృషి చేసిన సభాపతిని అభినంది స్తున్నా' అని సీఎం తెలిపారు. అద్భుతమంటూ ధరణి పోర్టల్ తీసుకొచ్చారని, ధరణి గురించి గత ప్రభుత్వం ఎన్నో గొప్పలు చెప్పిందని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరణి పోర్టల్ ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయన్నారని, కానీ వాస్తవాలు మరోలా ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఆ పోర్టల్‌ను కేసీఆర్ కనిపెట్టలేదని, 2010లోనే ఒడిశా ప్రభుత్వం ఈ-ధరణిని తీసుకొచ్చిందని సీఎం వెల్లడించారు. ఒడిశా తెచ్చిన ధరణిలో లోపాలు ఉన్నాయని కాగ్ చెప్పిందని, కాగ్ తప్పుబట్టిన ధరణిని తెలంగాణలో ఎందుకు పెట్టారని అసెంబ్లీ వేదికగా కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కేసీఆర్ తనకంటే గొప్పోళ్లు లేరని అనుకుంటారని, అందుకే ఆయన అలా ప్రవర్తిస్తారని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కేటీఆర్‌కు అత్యంత సన్నిహితులకే ధరణి టెండర్లు కేటాయించారు. సత్యం రామలింగరాజు సంస్థలతో ఉన్న బంధంతోనే ధరణి పోర్టల్ తీసుకొచ్చారు. ధరణి నిర్వహణలో మన రాష్ట్ర పౌరులు ఎవరూ లేరు. కనీసం పక్క రాష్ట్రాలకు చెందిన వారూ లేరు. టీఎస్‌టీఎస్ ఆధ్వర్యంలోనే ధరణి టెండర్లు వేశారు. ఐటీ శాఖ పరిధిలోనే టీఎస్‌టీఎస్ ఉంటుంది. ఆర్థిక నేరాలు చేసిన కంపెనీల ద్వారా డేటాను దేశం దాటించారు. ప్రజలను మోసం చేసి సమాచారాన్ని క్రిమినల్స్‌కు అందించారు. ఈ నేరాలకు ఏం శిక్ష విధించాలో తెలియాలంటే చట్టాలన్నీ చదవాలి. ధరణిలోకి డజన్ల కొద్దీ కంపెనీలు ఎందుకు వచ్చాయి?. మన భూముల సమాచారం మొత్తం విదేశాల్లో ఉంది. రెవెన్యూ శాఖ, సీఎం దగ్గర ఉండాల్సిన సమాచారం విదేశాలకు వెళ్లింది. ఇన్ని అవకతవకలు ఉన్నా అద్భుతమంటూ ఎన్నికల్లో మాట్లాడారు. ఇవన్నీ మేము గత ఎన్నికల ముందే చెప్పాం. ధరణిలో మార్పులు చేయాలంటే ప్రభుత్వ అనుమతి ఉండాలి. నిబంధనలు ఉల్లంఘించి కంపెనీలు ఒప్పందం చేసుకున్నాయి. ధరణి పేరుతో వాళ్ల అరాచం, దుర్మార్గం చెప్పలేని స్థాయికి చేరింది. అనుమతి లేకుండా వ్యక్తిగత సమాచార సేకరణ నేరం. గాదె శ్రీధర్‌రావు ద్వారా విదేశాలకు సమాచారం పంపించారు. వాళ్లు ఒక్క క్లిక్ కొడితే సమాచారం మొత్తం నాశనమవుతుంది. మన దగ్గర ఉన్న సర్వర్లూ క్రాష్ అవుతాయి. అందుకే విచారణకు ఇవ్వడంపై ఇంతకాలం ఆలోచన చేశాం. విదేశాలకు వెళ్లి వివరాలు ఇవ్వాలని కోరినా సహకరించలేదన్నారు.

ఈ కార్ రేసింగ్‌పై చర్చకు బిఆర్ఎస్ పట్టు

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ శాసనసభలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఫార్ములా ఈ-రేసుపై ఏసీబీ కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ భారాస ఎమ్మెల్యేలు చర్చకు పట్టుబట్టారు. ఈ క్రమంలో అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం, తదితర పరిణామాలతో సభలో గందరగోళం ఏర్పడింది. దీంతో స్పీకర్ ప్రసాద్‌కుమార్ సభను 15 నిమిషాల పాటు వాయిదా వేశారు. ఫార్ములా ఈ-రేసుపై ఏసీబీ కేసు నమోదు చేయడం.. దీనిలో ఏ-1గా భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేరును చేర్చడంపై ఆ పార్టీ ఎమ్మెల్యేలు శాసనసభలో నిరసన వ్యక్తం చేశారు. ఫార్ములా ఈ-రేసు అంశంపై చర్చకు పట్టుబట్టారు. దీంతో స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ భూ భారతి బిల్లుపై ప్రభుత్వం చర్చకు సిద్ధమైన నేపథ్యంలో తర్వాత నిర్ణయం తీసుకుందామని భారాస సభ్యులను ఉద్దేశించి చెప్పారు. ఫార్ములా ఈ-రేసు అంశం ఒక వ్యక్తికి సంబంధించినదని.. భూ భారతి బిల్లు రాష్ట్ర ప్రజలకు చెందినదని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో స్పీకర్ పోడియం వైపు దూసుకెళ్లేందుకు భారాస సభ్యులు యత్నించారు. వారిని మార్షల్స్ అడ్డుకున్నారు. దీంతో పలువురు భారాస ఎమ్మెల్యేలు పేపర్లు చించి సభాపతి వైపు విసిరారు. అదే సమయంలో కొందరు కాంగ్రెస్ సభ్యులు పేపర్లు చించి భారాస వైపు విసరడంతో సభలో తీవ్ర గందరగోళం ఏర్పడింది.

హైకోర్టులో కేటీఆర్‌కు
స్వల్ప ఊరట

ఈ కేసుకు వర్తించవని, ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని కోరారు.ఇరు వైపులా వాదనలు విన్న ధర్మాసనం.. ఈనెల 30 వరకు కేటీఆర్‌ను అరెస్టు చేయొద్దని ఆదేశించింది. కేటీఆర్‌పై ఏసీబీ నమోదు చేసిన కేసులో దర్యాప్తు కొనసాగించవచ్చని స్పష్టం చేసింది. పది రోజుల్లో కౌంటరు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను ధర్మాసనం ఈనెల 27కి వాయిదా వేసింది."అవినీతి నిరోధక చట్టం కింద పెట్టిన సెక్షన్లు ఈ కేసుకు వర్తించవు. ముఖ్యంగా 13(1)(జీ) సెక్షన్ ఈ కేసుకు వర్తించదు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని అనేందుకు ఆధారాలు లేవు. ప్రొసీజర్ పాటించలేదనడం సరైంది కాదు. 14 నెలల తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రాథమిక విచారణ కూడా లేకుండా కేసు పెట్టారు. కేవలం రాజకీయ కక్షసాధింపు కోసమే కేటీఆర్‌పై కేసు పెట్టారు. ఈ కేసులో ఎన్నో తప్పులు కనిపిస్తున్నాయి. కార్ రేస్ నిర్వహణకు 2022 అక్టోబరు 25న ఒప్పందం జరిగింది. సీజన్ 10 నిర్వహణకు స్పాన్సర్ వెనక్కి తగ్గారు. రేస్ నిర్వహణలో ఇబ్బందులు నివారణకే ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఇబ్బందులు రాకూడదనే హెచ్ఎండీఏ చెల్లింపులు చేసింది.సీజన్-9 వల్ల దాదాపు రూ.700 కోట్ల లాభం వచ్చింది. ఆర్థికశాఖ అనుమతి లేదని ఏసీబీ అధికారులు అంటున్నారు. కార్ రేసింగ్ ఒప్పందాన్ని కొత్త ప్రభుత్వం ఉల్లంఘించింది. కొత్త ప్రభుత్వం డబ్బు చెల్లించకపోవడంతో ఒప్పందం రద్దయింది. ఎఫ్ఐఆర్ నమోదులో ఆలస్యానికి కారణాలు చెప్పలేదు. సుప్రీం తీర్పుల ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదులో ఆలస్యం తగదు. ఎఫ్ఐఆర్ నమోదుకు ముందు ప్రాథమిక విచారణ అవసరమని సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయి. సుప్రీంకోర్టు తీర్పులను ఏసీబీ అధికారులు పట్టించుకోలేదు. ప్రజాప్రతినిధిపై కేసుకు ముందు ప్రాథమిక విచారణ చేయాలి. 18న ఫిర్యాదు అందగానే.. 19న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేటీఆర్ స్పెక్యులేషన్ చేసినట్టు ఎక్కడా పేర్కొనలేదు. అవినీతి ఎక్కడ జరిగిందో చెప్పలేదు. కానీ, అవినీతి నిరోధక చట్టం కింద కేసు పెట్టారు" అని కేటీఆర్ తరఫు న్యాయవాది సుందరం వాదనలు వినిపించారు.

కేటీఆర్ పాత్ర ఏంటో దర్యాప్తులో తేలుతుంది: ఏజీ

రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ''ఎఫ్ఐఆర్ నమోదు ప్రాథమిక అంశం మాత్రమే. అందులో పేర్కొన్న అంశాలే అంతిమం కాదు. దర్యాప్తులో తేలే విషయాల ఆధారంగా సెక్షన్లు చేరుస్తారు. రెండు నెలల క్రితమే కేసు నమోదుకు నిర్ణయించారు. కేసు నమోదు కోసం గవర్నర్ నిర్ణయానికి పంపారు. గవర్నర్ ఆమోదించాకే కేసు నమోదు చేశారు. ఫార్ములా సంస్థకు డబ్బు విదేశీ కరెన్సీలో చెల్లించారు. దీంతో హెచ్ఎండీఏపై అధిక భారం పడింది. విదేశీ కరెన్సీలో చెల్లింపు కోసం ఆర్‌బీఐ అనుమతి తీసుకోలేదు. ఆర్థికశాఖ అనుమతి కూడా లేదు" అని ఏజీ వివరించారు.గవర్నర్ అనుమతి కాపీని కోర్టు అడగడంతో ఏజీ అందజేశారు. చెల్లింపుల్లో కేటీఆర్ పాత్ర ఏంటని ఈ సందర్భంగా హైకోర్టు ప్రశ్నించింది. కేటీఆర్ పాత్ర ఏంటో దర్యాప్తులో తేలుతుందని ఏజీ తెలిపారు. ఎఫ్ఐఆర్ నమోదు అనేది దర్యాప్తు కోసమేనని వివరించారు.

ఫార్ములా ఈ-రేసు కేసు..
రంగంలోకి ఈడీ

ఇవ్వాలని ఈడీ అధికారులు కోరారు. ఈ మేరకు ఏసీబీకి లేఖ రాశారు. వివరాలు అందగానే ఈడీ మనీలాండరింగ్ కేసును నమోదు చేయనుంది.

రాజస్థాన్‌లో ఘోర ప్రమాదం

శుక్రవారం తెల్లవారుజామున 5:30 గంటలకు జైపుర్-అజ్మీర్ హైవేపై ఎల్పీజీ ట్యాంకర్ ను, ఓ ట్రక్కు ఢీకొట్టింది. దీంతో మంటలు చెలరేగి దగ్గర ఉన్న పెట్రోల్ బంకుకు వ్యాపించాయి. ఆ సమయంలో బంకు వద్ద ఉన్న పలు వాహనాలు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో 8 మంది మృతి చెందగా.. దాదాపు 40 మంది గాయపడ్డారు.ఈ సమచారం అందుకున్న వెంటనే 20 అగ్నిమాపక యంత్రాలతో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలార్పే ప్రయత్నం చేశారు. ఈక్రమంలో బంకు నుంచి పెద్దఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. ట్యాంకర్ ను ఢీకొట్టిన ట్రక్కులో మండే రసాయనాలు ఉన్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. బాధితులను దగ్గరలోని ఆసుపత్రికి తరలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. అనంతరం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఎంతో ఫోన్లో ప్రమాదానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఉక్రెయిన్‌ఉక్కిరిబిక్కిరి

ఏటీఏసీఎం క్షిపణులు ఆరు, బ్రిటన్ తయారీ స్ట్రామ్ షాడో మిసైల్స్ నాలుగు రోస్టోవ్ ప్రాంతంపై ప్రయోగించినట్లు వెల్లడించింది. దీనికి ప్రతిగానే తాము ఈ దాడి చేసినట్లు వెల్లడించింది. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టగానే తమ దౌత్య భవనాలను తిరిగి ఇచ్చేలా ఒత్తిడి తెచ్చేందుకు రష్యా సిద్ధమవుతోందని ఆ దేశ డిప్యూటీ విదేశాంగ మంత్రి పేర్కొన్నారు. గత దశాబ్ద కాలంలో పలు ఆస్తులను వాషింగ్టన్ స్వాధీనం చేసుకుంది. .

బహిరంగ వ్యాఖ్యలు చేసేముందు ఆలోచించుకోవాలి

రమేశ్ పేర్కొన్నారు. విపక్షాలు మరోసారి నోటీసులు ఇస్తాయా? అన్న ప్రశ్నకు అవునని బదులిచ్చారు. ఇది తొలి అడుగు మాత్రమేనని, అవిశ్వాస తీర్మానానికి సంబంధించినంత వరకు ఇదొక ట్రైలర్ మాత్రమేనని చెప్పారు.రాజ్యసభ ఛైర్మన్ ధన్‌ఖడ్‌ను తొలగించాలని కోరుతూ 60 మంది విపక్ష సభ్యులు సంతకాలు చేసి ఈ నెల 10వ తేదీన అభిశంసన తీర్మానం కోసం నోటీసు ఇచ్చారు. ఆయన పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని, ఆయనపై నమ్మకం లేదని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 67(బీ) కింద వారు ఈ నోటీసు ఇచ్చారు. తనపై ఇచ్చిన నోటీసుపై తాను నిర్ణయం తీసుకోలేనంటూ గురువారం ధన్‌ఖడ్ సభకు అధ్యక్షత వహించలేదు. డిప్యూటీ ఛైర్మన్‌కు బాధ్యతలు అప్పగించారు. దీంతో హరివంశ్ సభాధ్యక్ష స్థానంలో కూర్చుని ప్రతిపక్షాల నోటీసును తిరస్కరిస్తూ రూలింగ్ ఇచ్చారు. ఉప రాష్ట్రపతిని తొలగించేందుకు 14 రోజుల ముందు నోటీసు ఇవ్వాల్సి ఉంటుందని.. ప్రస్తుతం ప్రతిపక్షాలు ఇచ్చిన నోటీసు 24వ తేదీ తర్వాతే చెల్లుతుందని అన్నారు.

రూ. 600 కోట్ల దోపిడీకే ఫార్ములా ఈ-రేస్

9 అంశాలు ఇచ్చారు.. దీంట్లో ఈ ఫార్ములా గురించి ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. ఈ ఫార్ములా ప్రతినిధి తనను కలిశారని.. ఎవరు వచ్చినా అందరినీ కలుస్తానని చెప్పారు. ఈ ఫార్ములా ప్రతినిధిని తన ఇంట్లో కలిశానని అన్నారు. తనకేం సంబంధం అని అడిగానన్నారు. కేటీఆర్‌తో అంత సెటిల్ చేసుకున్నానని ఫార్ములా ప్రతినిధి అన్నారు.. అధికారులతో మాట్లాడి చెప్తా అన్నానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ-కార్ రేస్ ప్రతినిధి తనను కలవడంతోనే ఈ బండారం బయటపడిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఏసీబీ విచారణలో ఉన్నందున ఇప్పుడు పూర్తి వివరాలు చెప్పలేనని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఇక్కడ తానేం చెప్పినా కోర్టుకు వెళ్లి సీఎం త

లోన్ కావాలంటే.. ముడుపులు ఇవ్వాల్సిందే..

- రాత్రి సమయంలో మీటింగ్ లు ఏర్పాటు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నాడు..
- విచక్షణ కోల్పోయి మహిళల పట్ల దుర్భాషలాడుతున్నాడు
- విఓఏ ను విధుల నుంచి తొలగించాలి
- అనంతగిరి మహిళా సంఘం సభ్యులు

కోదాడ (జనంసాక్షి) : విఓఏగా చలామణి అవుతు సంఘం బంధం -1 సభ్యులను ఇబ్బందులకు గురి చేస్తున్న వివోఏ పై చర్యలు తీసుకోవాలని అనంతగిరి మండల కేంద్రం సంఘం సభ్యులు కోరారు. శుక్రవారం అనంతగిరి కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ...అనంతగిరి గ్రామంలో గతంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఉపాధి హామీ గా పనిచేస్తున్న గరిడేపల్లి నీరజ మొదట విఓఏ గా పనిచేశారని రెండు ఉద్యోగాలు ఉండడంతో ఆమె ఎవరికీ తెలియకుండా తీర్మానం చేసి తన భర్త శ్రీనివాస్ ను విఓఏ గా నియమించుకున్నారని వారు పేర్కొన్నారు.దీంతో విఓఏ గా గరిడేపల్లి శ్రీనివాస్ చాలమణి అవుతూ ఇష్టను సారంగా రాత్రి సమయంలో మీటింగ్ లు ఏర్పాటు చేసి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.సమభావన సంఘంలో ఒక మహిళ చనిపోతే ఇన్సూరెన్స్ క్లెయిమ్ అడిగితే 6 నెలల నుండి తన చుట్టూ తిప్పించుకుంటున్నారని,సంబంధిత అధికారులకు చెప్పిన ఫలితం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.వారి జీతం సైతం అతనే తీర్మానం చేసుకొని ఇస్తానుసారంగా డ్రా చేసుకుంటున్నారని వారు ఆరోపించారు.జిల్లా కలెక్టర్, అధికారులు స్పందించి మహిళలను ఇబ్బందులకు వ్యక్తి నీ తొలగించి మహిళ ను విఓఏ గా నియమించాలని డిమాండ్ చేశారు.

పైసల్ ఇస్తేనే ఫైల్ ముందుకు..లేకుంటే తిప్పలు తప్పవు...

అనంతగిరి గ్రామంలోని సమభవన సంఘం -1 లో అనంతగిరి గ్రామానికి చెందిన గరిడేపల్లి.శ్రీనివాస్ రావు విఓఏ గా విధులు నిర్వహిస్తున్నారు.ప్రభుత్వం అతనికి నెల వారీగా జీతాన్ని సైతం చెల్లిస్తుంది. కానీ సంఘ సభ్యులు లోన్ తీసుకునే క్రమంలో ఒక్కో సంఘం నుంచి 2 నుంచి 3 వేల రూపాయలు వసూలు చేస్తున్నారని అన్నారు.ఒకవేళ సంఘం సభ్యులు డబ్బులు ఇవ్వకపోతే ఫైల్ ముందుకు కదలనివ్వకుండ సంఘం లోని మహిళలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని అంటున్నారు.స్త్రీ నిధి పొదుపు తీసుకునే సమయంలోనూ ఒక్కొక్క సభ్యురాలు నుంచి కనీసం 3 నుంచి 5 వేల రూపాయలు వసూలు చేస్తున్నారని అన్నారు. పైసా లేనిదే ఫైల్ ముందుకు కదలనివ్వకుండ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉదయం వేళలో సొంత పనులు...రాత్రి సమయంలో మీటింగ్ లు...

అనంతగిరి గ్రామంలోని సమభవన సంఘం - 1 విఓఏ గా విధులు నిర్వహిస్తున్న గరిడేపల్లి.శ్రీనివాస రావు సంఘ బంధం నెలవారీ మీటింగ్ లను సైతం సరైన సమయంలో ఏర్పాటు చేయకుండా రాత్రి సమయంలో మీటింగ్ ను ఏర్పాటు చేసి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాడు అని సంఘ బంధం మహిళలు ఆరోపిస్తున్నారు.రాత్రి సమయంలో మీటింగ్ ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని అడిగితే మహిళలు అని చూడకుండా దుర్భాషలదులుతున్నారు అని అన్నారు. ఈ విషయంపై సంబంధిత జిల్లా అధికారానికి సైతం పిర్యాదు చేశామని తెలిపారు.

రేవంత్ రెడ్డి డైవర్షన్ రాజకీయం

- ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమకేసులా?
- కక్షసాధింపులపై కాదు ప్రజాపాలనపై దృష్టి పెట్టండి
- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

పరకాల, డిసెంబర్ 20 (జనం సాక్షి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలన పక్కకు పెట్టి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నాడని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే కాళేశ్వరం ప్రాజెక్ట్ లక్ష కోట్ల అవినీతి అని,ఫోన్ టాంపరింగ్ డ్రగ్స్ అని ఆర్భాటం చేశాడని, ఒక్కటి కూడా రుజువు చేయలేక పోయి ఇప్పుడు కొత్తగా ఈ కార్ రేస్ లో అవినీతి అని కొత్త డ్రామా మొదలు పెట్టాడన్నారు. శుక్రవారం వస్తె కొత్త డ్రామా మొదలు పెట్టి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నాడని, ఎవరైనా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమకేసులు పెట్టి అరెస్టులు చేయడం తప్ప ప్రజాపాలనపై దృష్టి పెట్టింది లేదని విమర్శించారు.ఈ కార్ రేస్ లో అవినీతి జరిగితే అసెంబ్లీలో చర్చపెట్టమని ఈ రోజు కూడా అసెంబ్లీ అడిగితే దానికి సమాధానం చెప్పకపోగా, అసెంబ్లీ సాక్షిగా పేపర్లతో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలపై దాడి చేశారన్నారు.ప్రపంచ దేశాలలో జరిగే ఈ కార్ రేసింగ్ ని ఇండియాలో మన హైదరాబాద్ లో జరిగేలా కృషి చేసిన ఘనత కేటీఆర్ గారిదని, ప్రపంచపటంలో తెలంగాణలోని హైదరాబాద్ ని నిలబెట్టిన ఘనత కేటీఆర్ దన్నారు.కేటీఆర్ నాయకత్వంలో ఐటి, ఇండస్ట్రియల్, ఫార్మా రంగాలు ఎంతో అభివృద్ధి చెందాయని,వేములవాడ రాజన్న సన్నిధిలో మీటింగ్ పెట్టి నీ ఒక్కని ప్లేట్ భోజనానికి రూ.32000/- బిల్లు పెట్టినవు.100 మందికి రూ.32 లక్షల బిల్లు పెట్టారట దానిపైన ఎంక్వైరీ లేదన్నారు. ఆరునెలల నుండి ఏదో అక్రమ కేసు పెట్టి కేటీఆర్ ని అక్రమ అరెస్ట్ చేయాలని చూస్తున్న రేవంత్ రెడ్డి కేటీఆర్ ని అరెస్ట్ చేసి గ్రామాలలో పర్యటించండి అప్పుడు తెలుస్తది మీ పరిస్థితి,మీ పార్టీ పరిస్థితి అని హెచ్చరించారు.ఇప్పటికి గురుకుల పాఠశాలల్లో జరుగుతున్న సంఘటనలపై చర్చించే సమయం ప్రభుత్వానికి లేదని, ఓవర్సీస్ స్కాలర్ షిప్ లో 20 లక్షల సాంక్షన్ చేయడానికి 5 లక్షలు అడుగుతున్నారనట దానిమీద ఎంక్వైరీ చేయాలని తెలిపారు.గ్రామాలలో అభివృద్ధి పనులు చేసిన సర్పంచులకు బిల్లులు రాక వారి కుటుంబాలు రోడ్డుపైన పడుతున్నాయి.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే రైతుబంధు పైసలు 7 వేలు ఇవ్వలేదని,పొంగులేటిపై జరిగిన ఈడిదాడులు సంగతి ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రశ్నించిన వారిపై కక్ష సాధింపులు ఆపి ప్రజాపాలనపై,రాష్ర అభివృద్ధికై దృష్టి సారించితే మంచిదనీ సూచించారు.

మహిళల ఇండోర్ ఆట పోటీలు ప్రారంభం

హైదరాబాద్, డిసెంబర్ 20 (జనంసాక్షి) : టీఎన్జీఎస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డా.ఎస్.ఎం.హుస్సేని (ముజీబ్) ఆదేశాల మేరకు హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎస్.విక్రమ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆట పోటీల భాగంగా మహిళల ఇండోర్ ఆట పోటీలను కేంద్ర సంఘ ప్రధాన కార్యదర్శి డా.ముజీబ్ ప్రారంభించారు. కార్యక్రమానికి అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ కోశాధికారి సయ్యద్ అసదుద్దీన్, కేంద్ర సంఘ క్రీడా కార్యదర్శి బోలిగిద్ద శంకర్, హైదరాబాద్ జిల్లా మాజీ కార్యదర్శి జి.ప్రభాకర్, మాజీ సభ్యురాలు జానకి, ప్రత్యేక ఆహ్వానితులు సీమ ముజీబ్, కుమారి.బి.రెచల్ పాల్గొన్నారు. శుక్రవారం నిర్వహించిన మహిళల ఆట పోటీలలో టగ్ అఫ్ వార్, మ్యూజికల్ చైర్స్, లెమన్ స్పూన్ మరియు రంగోలి పోటీలు జరిగాయి. స్వామినాథన్ క్రికెట్ మెమోరియల్ టోర్నమెంట్ భాగంగా నాల్గవ రోజు కమర్షియల్ టాక్స్ జట్టు పై చీఫ్ రేషన్ ఆఫీస్ జట్టు,డీఈఓ జట్టు పై యూత్ ఫోర్స్ జట్టు విజయాలు సాధించాయి, కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు సభ్యులు కే.ఆర్.రాజ్ కుమార్, ఉపాధ్యక్షులు ఉమర్ ఖాన్, కుర్రాడి శ్రీనివాస్, ఖాలిద్ అహ్మద్, వైదిక్ శాస్త్ర,ముఖీమ్ ఖురేషి, శ్రీధర్ నాయుడు, గీతా సింగ్, సుజాత, మొహమ్మద్ వహీద్, ముహమ్మద్ ముస్తఫా షరీఫ్ పాల్గొన్నారు. ఆట పోటీల కార్యక్రమం విచ్చేసిన ఉద్యోగులందరికీ భోజన సదుపాయాలు కల్పించారు.

పట్టు పరిశ్రమ అభివృద్ధికి చర్యలు చేపట్టాలి

- జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ..

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): టస్సార్ పట్టు పరిశ్రమ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో సెరికల్చర్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కొనసాగుతున్న టస్సార్ పట్టు పరిశ్రమ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని, టస్సార్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై నివేదిక అందించాలని ఆదేశించారు. టస్సార్ పట్టుకు మార్కెట్ లో మంచి డిమాండ్ ఉన్నప్పటికీ అనుకున్న మేరకు మార్కెటింగ్ జరగడం లేదని అన్నారు. మార్కెటింగ్ పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టస్సార్ చేనేత వస్త్ర కార్మికులకు ఇచ్చే రాయితీలు అందే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. టస్సార్ పట్టు కాయలు ఎండబెట్టుటకు కావాల్సిన ఫ్లాట్ ఫారాల నిర్మాణానికి కావలసిన పాలనాపరమైన అనుమతులకు నివేదిక ఇవ్వాలని, మహిళా స్వయం సహాయక మహిళా బృందాలకు టస్సార్ పట్టు దారం తీయుటలో అవసరమైన మెళకువల కొరకు శిక్షణా అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళలకు దారం తీయడానికి కావల్సిన అధునాతన మిషన్లను అందించి ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెరికల్చర్ జాయింట్ డైరెక్టర్ అనసూయ, హార్టికల్చర్ అధికారి సునీల్, సూపరిండెంట్ రాజు, టెక్నికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎన్‌జీ ట్యాంకర్‌ను ఢీకొట్టిన ట్రక్కు

- భారీ అగ్ని ప్రమాదం

జైపూర్, డిసెంబర్ 20 (జనంసాక్షి) : రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఓ పెట్రోల్ బంక్ వద్ద ఘోర అగ్నిప్రమాదం జరిగింది. శుక్రవారం ఉదయం జైపూర్‌లోని అజ్మీర్ రోడ్డులో ఉన్న పెట్రోల్ బంక్ వద్ద ఆగి ఉన్న సీఎన్‌జీ ట్యాంకర్‌ను మరో ట్రక్ ఢీకొట్టింది. దీంతో ట్యాంకర్‌లో మంటలు చెలరేగడంతో అది ఒక్కసారిగా పేలిపోయింది. పక్కనే ఉన్న వాహనాలకు మంటలు వ్యాపించడంతో వాహనాలు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో ఐదుగురు సజీవ దహనమయ్యారు. మరో మందికిపైగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. 22 ఫైర్ ఇంజిన్ల సాయంతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. గాయపడిన వారిని సవాయ్ మాన్‌సింగ్ హాస్పిటల్‌కు తరలించారు. వారికి ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. భారీగా అగ్నికీలలు ఎగసిపడటంతో ఆకాశంలో నల్లటి పొగలు కమ్ముకున్నాయి. దీంతో పక్కనే ఉన్న రహదారిపై పెద్దసంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. కాగా, దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది.

అమిత్‌షాకు కేంద్ర హోంశాఖ మంత్రిగా కొనసాగే అర్హతలేదు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్

స్టేషన్ ఘన్పూర్, డిసెంబర్ 20 (జనంసాక్షి) : పార్లమెంట్ సాక్షి గా కేంద్ర హెూం మంత్రి అమిత్ షా అంబేద్కర్ ను అవమాన పరిచే విధంగా మాట్లాడటం సరైన పద్ధతి కాదని అమిత్ షా ను కేంద్ర హెూంమంత్రి పదవిలో కొనసాగే అర్హత లేదని సీపీఎం రాష్ట్ర కార్యద ర్శి వర్గ సభ్యుడు ఎండి అబ్బాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మత్స్య సంఘం భవనంలో ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశానికి మండల కార్యదర్శి మునిగెల రమేష్ అధ్యక్షతవహించగా అబ్బాస్ మాట్లా డుతూ భారత పార్లమెంట్ చరిత్రలో బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగ నిర్మాత పై వ్యంగ్యంగా మాట్లాడటం హేయమైన చర్య అని బీజేపీ తన మనువాద ధోరణి మరోసారి పార్లమెంట్ సాక్షిగా బయట పడిందన్నారు. ఈ దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడటం పార్లమెంటు ప్రతిష్టను అగౌరవపరచడం రాజ్యాంగ విలువలను అగౌరవపరచడం అంబేద్కర్ రాసిన రాజ్యాంగం పైన ప్రమాణం చేసి పదవి అనుభ వించడం అలాంటి గొప్ప మహానుభావుని అవమానిం చడం అవహేళనచేయడం బిజెపిరాజనీతికి నిదర్శనం అన్నారు. అలాగే ఆదోని కుంభకోణాలను బయటపడ కుండా ఉంచడం కోసం జమిలి ఎన్నికల కొత్త ఏజెండా ను దేశ ప్రజల ముందుకుతీసుకురావడం అవినీతిపరు లను కాపాడడం కోసం దేశ ప్రజలను మరింత దారిద్రం లోకి దిగజార్చే ప్రయత్నంలో భాగమే జెమిలి ఎన్నికల న్నారు. ప్రజా సమస్యల ఎజెండాను పక్కదారి పట్టించే విధంగా పార్లమెంట్ సమావేశాల సమయాన్ని వృధా చేయడం సరైనది కాదని వారుహితో పలికారు.ఈ నెల 27,28 తేదీలలో మండల కేంద్రంలో జరుగుతున్న సిపిఎం జిల్లా మహాసభలు జరుగుతాయని స్టేషన్గన్పూర్ వేదిక కాబోతుందని మొదటి రోజు 27న మండల కేంద్రంలో బహిరంగ సభ జరుగుతుందని బహిరంగ సభకు ముఖ్య అతిథిగా సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ తమ్మినేని వీరభద్రం వస్తున్నారని తెలిపారు.ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి,రాపర్తి రాజు,ఇర్రి అహల్య, రాపర్తి సోమయ్య, సాంబరాజు, యాదగిరి, సింగారపు రమేష్,బొట్ల శేఖర్, బూడిద గోపి,కోడేపాక యాకయ్య, విజేందర్, ప్రకాష్, ఉపేందర్, వెంకటేష్, సోమన్న, నాగ రాజు,శభానా తదితరులు పాల్గొన్నారు.

ములుగు టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా కార్యాలయం ప్రారంభం

ములుగు ప్రతినిధి, డిసెంబర్ 20(జనంసాక్షి) : టీఎన్జీవోస్ యూనియన్ ములుగు జిల్లా నూతన కార్యాలయాన్ని కలెక్టర్ దివాకర్ టి.ఎస్ ప్రారంభించారు. జిల్లా టిఎన్జిఓఎస్ యూనియన్ అధ్యక్షులు పోలు రాజు అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగస్తులు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని సంక్షేమ పథకాలను అమలు పరచుటలో ముందంజలో ఉంచి మన జిల్లాను ప్రథమ స్థానంలో ఉండే విధంగా కృషి చేయాలని కోరారు. ఉద్యోగులకు ఏ సమస్య వచ్చినా నేను మీ వెంట ఉంటానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోలు రాజు అధ్యక్షులు మాట్లాడుతూ కలెక్టర్ కలెక్టర్ యూనియన్ కి ఈ భవనాన్ని కేటాయించి నందుకు తను స్వయంగా వచ్చి ప్రారంభించినందుకు వారికి ఉద్యోగులందరి తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ యూనియన్ కార్యదర్శి మేడి చైతన్య, టిఎన్జిఓఎస్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ షఫీ సర్కార్, కోశాధికారి భూక్యలాల్ నాయక్, కుమారస్వామి, వైస్ ప్రెసిడెంట్, జాయింట్ సెక్రెటరీ శ్రీధర్, జాయింట్ సెక్రెటరీ, రాంగోపాల్, సునీత, శ్రీవాణి, సరిత, జైసింత, ఆర్గనైజ్ సెక్రెటరీ, ప్రదీప్, అనీల్, ప్రశాంత్, ఉదయ్ కుమార్ రెడ్డి, భూపాల్ రెడ్డి, సిహెచ్ రాజు, భాస్కర్, అనిల్ కుమార్, రమాదేవి, రవీందర్ యశ్వంత్, నాగార్జున, రఘు, ప్రసాద్, యుగంధర్ రెడ్డి, శ్రావ్య ఉదయ్ కుమార్ రెడ్డి, ప్రశాంత్, టీఎన్జీవోస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్‌లోనూ చాట్ జీపీటీ

న్యూఢిల్లీ,డిసెంబర్ 20 (జనంసాక్షి) : కృత్రిమ మేధ వేదిక ఓపెన్ ఏఐ మరో కొత్త సదుపాయం అందుబాటులోకి తెచ్చింది. ఇక నుంచి చాట్‌జీపీటీ కోసం ఎలాంటి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోనక్కర్లేదు. దాని సేవలను నేరుగా వాట్సాప్‌లోనూ వినియోగించుకోవచ్చునని ఓపెన్ ఏఐ ప్రకటించింది. వేరే యాప్, అకౌంట్‌తో సంబంధం లేకుండా నేరుగా వాట్సాప్‌లోనే దీనిని వాడవచ్చు. 18002428478 నంబర్‌తో వాట్సాప్‌లో చాట్ చేయవచ్చు. మనం అడిగిన సందేహాలు, ప్రశ్నలకు ఇది సమాధానం చెపుతుంది. ఇంతకాలం కెనడా, అమెరికాలకే పరిమితమైన సేవలు ఇకనుంచి భారత్‌లో కూడా పొందవచ్చు. అయితే దీని రోజువారీ వాడుకపై పరిమితి ఉంటుంది. మెటా ఏఐ చాట్‌బాట్‌కు పోటీగా ఓపెన్‌ఏఐ దీనిని వాట్సాప్‌లో ప్రవేశపెట్టింది.

గర్ల్‌ఫ్రెండ్‌తో వెళ్లిపోయిన భార్య

- హైకోర్టును ఆశ్రయించిన భర్త

అహ్మదాబాద్,డిసెంబర్ 20 (జనంసాక్షి) : గర్ల్‌ఫ్రెండ్‌తో వెళ్లిపోయిన భార్యను వెతికి పెట్టాలంటూ ఒక వ్యక్తి గుజరాత్ హైకోర్టును ఆశ్రయించాడు. స్వలింగ సంపర్కురాలైన తన భార్య అక్టోబర్‌లో తన ప్రియురాలితో కలిసి ఇంట్లోంచి వెళ్లిపోయిందని, ఆ సమయానికి ఆమె ఏడునెలల గర్భవతి అని ఆయన కోర్టుకు విన్నవించాడు. దీనిపై చాంద్‌ఖేడ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా వారు తన భార్య ఆచూకీని కనుగొనలేకపోయారని తెలిపాడు. కాగా, ఆమెను ఈ నెల 23లోగా తమ ముందు హాజరుపర్చాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది.

అక్రమ కలప పట్టివేత

- 3 లక్షల విలువగల టేకు కర్ర సీజ్

నస్పూర్, డిసెంబర్ 20, (జనం సాక్షి): నస్పూర్ మండలంలోని తీగల్ పహాడ్ లో అక్రమంగా నిల్వ చేసిన టేకు దుంగలను శుక్రవారం అటవీశాఖ అధికారుల ప్రత్యేక బృందం స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు అటవీశాఖ అధికారులు పేపర్ ప్లేట్ల తయారీ కేంద్రంలో అక్రమంగా నిల్వ చేసిన టేకు దుంగలను గుర్తించి సీజ్ చేశారు.టేకు దుంగల విలువ సుమారు 3 లక్షల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో రీజినల్ ఎఫ్ఆర్ఓ నరేందర్,మంచిర్యాల ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్ఆర్ఓ రమాదేవి,ఎఫ్ఆర్ఓ రత్నాకర్ లు పాల్గొన్నారు.

కార్మికుల చిరకాల కోరికలను నెరవేర్చాలి

- సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి

నస్పూర్, డిసెంబర్ 30 (జనం సాక్షి): సింగరేణి కార్మికుల చిరకాల కోరికలైన సొంతింటి కల,పెర్క్స్ పై ఐటీ మాఫి లను సిఎండి స్ట్రక్చర్ సమావేశంలో వెంటనే నెరవేర్చాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీరాంపూర్ ఉపరితల గనిలో సిఐటియు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ద్వార సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.గుర్తింపు కార్మిక సంఘం కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందన్నారు.గుర్తింపు సంఘం నాలుగు సంవత్సరాల కాల పరిమితి కోసం ఆశపడి,రెండు సంవత్సరాల కాల పరిమితి గుర్తింపు పత్రం ఆలస్యంగా తీసుకోవడంతో నేటికి కూడా కార్మికుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు.కేంద్ర ప్రభుత్వం కోవిడ్ ను అడ్డుపెట్టుకొని ఆమోదించుకున్న లేబర్ కోడ్ ను ఈ సంవత్సరం ఏప్రిల్ నుండి అమలు చేయడానికి సిద్ధమయ్యారని,అట్టి లేబర్ కోడ్లు అమలైతే కార్మిక వర్గానికి తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు.కేంద్ర ప్రభుత్వానికి సింగరేణి నుండి డివిడెంట్లు తీసుకోవడంలో ఉన్న శ్రద్ధ,సంస్థకు రావాల్సిన బకాయిలను ఇప్పించడంలో ఏ మాత్రం లేదన్నారు. సింగరేణి యాజమాన్యం పై పోరాడడానికి సిద్ధంగా ఉన్న సిఐటియు యూనియన్ చేసే ఆందోళన కార్యక్రమాల్లో కార్మికులందరూ స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు గుల్ల బాలాజీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంగళ శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
21 డిసెంబర్ 2024

బీజేపీ భవిష్యత్తును దెబ్బతీసే అమిత్ షా

రాజ్యసభలో డాక్టర్ బి.ఆర్ .అంబేద్కర్‌ను కించపరుస్తూ కేంద్రీయ హోంమంత్రి అమిత్ షా చేసిన అవమానకర వ్యాఖ్యలు రాజకీయ వర్గాలలోనే కాక, మొత్తం భారత దేశమంతటా అశేష ప్రజానికంలో తీవ్ర కలకలానికి కారణమయ్యాయి. ప్రతిపక్ష పార్టీలు తరచుగా అంబేద్కర్ పేరు ఉపయోగించడంపై అమిత్ షా అసహనంతో ,ఆవేశంతో హేళనగా మాట్లాడుతూ, "అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్ " అని మళ్ళీ మళ్ళీ చెప్పడం ఇప్పుడు ఒక ఫ్యాషన్‌గా మారింది. అంటూ... ఎత్తిపొడిచారు. "వాళ్లు (ప్రతిపక్షాలు) దేవుడి పేరును అన్ని సార్లు ఉచ్చరించి ఉంటే, పరలోకంలో స్థానం సంపాదించి ఉండేవారు," అని హేళనతో కూడిన ఉచిత సలహా కూడా ఇచ్చారు.

ఈ వ్యాఖ్యల వెనుక ఉద్దేశ్యం ప్రతిపక్షాల వ్యూహాలను, తలంపులను ప్రశ్నించడం కావచ్చు. కానీ, అనవసరంగా ఆవేశంలో అదుపుతప్పి డా. అంబేద్కర్‌వైపు మళ్ళిన ఈ వ్యాఖ్యలు ఆయన పాత్రను చిన్నచూపు చూస్తున్నాయనే విమర్శలకు దారితీశాయి. డా.బీ.ఆర్. అంబేద్కర్ రూపొందిచిన రాజ్యాంగం మీద ప్రమాణం చేసి ఎం.పీ.గానూ, హోం మంత్రిగానూ ప్రమాణ స్వీకారం చేసిన అమిషా ఇలా అంబెద్కర్ పై అవమానకరంగా ఆయనను తూలనాడుతూ కామెంట్ చేయటం ఆయన అహంకారినికి దర్పణం పడుతుంది. ఈ హేళనతో కూడిన వ్యాఖ్యలు కేవలం రాజకీయ నాయకులనే కాక దేశంలోని యావత్ ప్రజానికంలో ఆగ్రహావేషాలను రగిల్చింది.ముఖ్యంగా దళితులు, ఆదివాసీలు, బహుజనులు తమ దీన భాంధవుడిగా తలచే డా.అంబేట్కర్ ను నిండు పార్లమెంట్ సభలో అత్యంత కీలకమైన హోం శాఖను నిర్వహిస్తున్న సీనియర్ మంత్రి ఇలా దిగజారుడు భాషతో అవమానకరంగా దూషించటం క్షమించరాని నేరం.కనీసం ఏదో ఆవేశంలో పొరపాటు జరిగింది, నోరు జారినందుకు క్షమార్పణ చెప్పితే పోయేది. కానీ అలా జరగలేదు. పైగా అలాంటి అవమానకర వ్యాఖ్యలను చేసిన అమిత్ షా ను ప్రధానీ మోదీ సమర్ధిస్తూ వెనుకేసుక రావడం మరీ విచిత్రం. ఈ ఇరువురి చర్యలు,వ్యాఖ్యలు యావత్ ప్రజానికానికి బీజేపీ పైనే అసహ్యం కలుగజేసిందని, అది ఆ పార్టీ నైజమని అన్ని వర్గాల ప్రజలు,విపక్షాలు ఉమ్మడిగా పార్లమెంటులోనూ, బయటా ద్వజమెత్తారు. దేశమంతటా తమ అభిమాన, అసమాన నాయకుణ్ణి ఘోరంగా అవమానించినందుకు నిరసనగా ప్రజలు వీధుల్లోకి వచ్చి అమెత్ షా దిష్టిబొమ్మలను ప్రతి చౌరస్తాలలో చెప్పులతో కొడుతూ , ఆదిష్టి బొమ్మలను తగులబెట్టుతున్నారు. ఆరెస్సెస్ అగ్ర నాయకుడు మోహన్ భాగవత్ చెప్పిన హితవు మాటలు,సూచనలు,సలహాలను బీజేపీ నాయకులు పట్టించుకోవటం లేదు.ఏరు దాటాక తెప్ప తగలేసినట్లు ఆరెస్సెస్ కార్యకర్తల సేవలను ఎన్నికలలో ఉపయోగించుకొని మూడోసారికూడా అధికారంలోకి రావటంతో బీజేపీ లో అహంకారం పెరిగింది. ఆరెస్సెస్ అగ్ర నేత మోహన్ భాగవత్ హితవు వ్యాఖ్యలు, సూచనలు బీజేపీ వారికి కర్ణ కఠోరంగా వినపడుతున్నాయి కాబోలు.

అమిత్ షాపై రాజకీయ విమర్శలు

అమిత్ షా అహంతో చేసిన అంహంకారపూరిత వ్యాఖ్యలపై తీవ్రమైన ప్రతిస్పందన ప్రజల నుండి వెల్లువలా వచ్చిపడింది. డాక్టర్ అంబేద్కర్ భారత రాజ్యాంగ రూపకర్తగా,అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన నాయకుడిగా ఉన్నందున, ఆయన పాత్రను తక్కువ చేసి చూపించడమేమిటని విమర్శలు వచ్చాయి. కాంగ్రెస్ సహా ఆప్ (ఆమ్ ఆద్మీ పార్టీ),వామ పక్షాల వంటి ప్రతిపక్ష పార్టీలు అన్నీ ఈ విషయంపై పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు దేశమంతటా చేపట్టాయి. రాహుల్ గాంధీ ఈ వ్యాఖ్యలపై మాట్లాడుతూ, బీజేపీ మరియు ఆర్ఎస్ఎస్ (రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్) ఆలోచనా ధోరణి రాజ్యాంగానికి మరియు అంబేద్కర్ సిద్ధాంతాలకు పూర్తిగా వ్యతిరేకమని ఆరోపించారు. ఢిల్లీలో ఆప్ అధ్వర్యంలో 70 అసెంబ్లీ నియోజకవర్గాల్లలో నిరసనలు జరిగాయి. రాజకీయవర్గాలకు మాత్రమే కాకుండా, పౌర సమాజం మరియు కార్యకర్తల నుండి కూడా ఈ వ్యాఖ్యలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. బెంగళూరులో సామాజిక న్యాయం కోసం పోరాడే సంస్థలు షా వ్యాఖ్యలపై నిరసనలు నిర్వహించాయి. ఇది అంబేద్కర్ స్ఫూర్తి మరియు సామాజిక న్యాయ సూత్రాలపై దాడిగా వారు అభిప్రాయపడ్డారు.

బీజేపీ ప్రతిస్పందన

దేశంలో అమిత్ షా వ్యాఖ్యలపై విమర్శలు రావటంతో ఒక్క సారిగా ఉలిక్కిపడి ఈ వివాదానికి బీజేపీ రక్షణాత్మకంగా స్పందించింది. షా, తన వ్యాఖ్యల వెనుక అసలు ఉద్దేశ్యం డాక్టర్ అంబేద్కర్‌ను అవమానించడం కాదనీ, "బీజేపీ ఎప్పటికీ అంబేద్కర్‌ను అవమానించదనీ," మొక్కుబడిగా అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కూడా షాను సమర్థించుకుంటూ, ప్రతిపక్షాలు ఈ వ్యాఖ్యలను వక్రీకరించాయని ప్రతి ఆరోపణలు చేశారేగానీ... తప్పును-తప్పుగా ఒప్పుకునే నైతిక స్థైర్యాన్ని ప్రదర్శించలేదు. పైగా బుకాయించటానికి ప్రయత్నించారు.

షా ప్రసంగ సారాంశం

షా ప్రసంగంలో ఉద్దేశ్యం ప్రతిపక్ష పార్టీలు అంబేద్కర్ పేరు పదేపదే ఉపయోగించడం అంటే ఆయన సిద్ధాంతాలను అనుసరించడం కాదని విమర్శించడం. అంబేద్కర్ అభివృద్ధి, సమానత్వం, న్యాయసూత్రాలను ఆచరించడంలో ప్రతిపక్షాలు ఏం చేశాయి? అనే ప్రశ్నను షా లేవనెత్తారు. కానీ, ఆయన మాట్లాడిన విధానం అందుకు ఆయన ఉపయోగించిన అసహన,అవహేళనతో కూడిన భాష,ఆ సమయంలో టీవీ పుటేజీల్లో వ్యక్తమైన ఆయన హావభావాలు అంబేద్కర్‌పై చిన్నచూపు చూపించారనే భావనకు బలాన్ని చేకూర్చింది.

బీజేపీ భవిష్యత్తుపై ప్రభావం

ఈ వివాదం బీజేపీకి దీర్ఘకాలికంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బహుజనుల్లో దుష్ప్రభావాలను కలిగించవచ్చు.ఇప్పటికే బీజేపీ అనుసరిస్తున్న సామాజిక,ఆర్థిక ,రాజకీయ విధానాలు వారి మనో భావాలను గాయపర్చాయి. "కాకులను కొట్టి... గద్దలకు వేసినట్లుగా" బీజేపీ దేశ సంపదను మొత్తం అదానీ పాదాల చెంత ఉంచి అదానీ చెప్పుచేతల్లో మోదీ ప్రభుత్వం ఒరిగిపోవడం, అదానీ కి పాదాక్రాంతం కావటం బీజేపీకి సైధాంతిక పునాది అయిన ఆరెస్సెస్ నేత మోహన్ భాగవత్ కే మింగుడు పడటం లేదు.ఇక ఇతరులను గురించి చెప్పేదేముంది.ఆయన బీజేపీ పై బహిరంగంగా అనేక సార్లు వ్యాఖ్యలు చేశారు. పరోక్షంగా,మర్మ గర్భితంగా మోదీని లక్ష్యంగా చేసుకొని విమర్శు చేశారు. డాక్టర్. అంబేద్కర్‌ను గౌరవించే గిరిజన, దళిత, బహుజన,మైనార్టీ నిమ్న వర్గాలు ఈ వ్యాఖ్యలను తమ మనోభావాలకు అవమానంగా భావించే అవకాశం ఉంది. బీజేపీ ఇప్పటికే దళితుల మద్దతు సంపాదించడంలో ప్రయత్నాలు చేస్తోంది. కానీ, ఈ వ్యాఖ్యల వల్ల ఈ వర్గం నుండి బీజేపీకి దూరమవుతుందనే భయం బీజేపీ వర్గాలలో కలుగుతోంది. ముఖ్యంగా ఉత్తర ప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో, ఇది మరింత ప్రభావం చూపవచ్చు. అదనంగా, ఈ వివాదం ప్రతిపక్ష పార్టీలకు బలమైన ఆయుధంగా మారింది. అంబేద్కర్ వారసత్వాన్ని కాపాడుతూ, ప్రతిపక్షాలు బీజేపీని దూషించడానికి ఈ అంశాన్ని వినియోగించుకుంటున్నాయి. ఈ చర్యలు దళితులతో పాటు ఇతర సామాజిక-చైతన్యవంతులైన ఓటర్లను ఆకర్షించవచ్చు.

లోతైన సవాళ్లు

అమిత్ షా వ్యాఖ్యలు బీజేపీ ఎదుర్కొంటున్న మరింత పెద్ద సవాలును తెలియజేస్తాయి. అంబేద్కర్ వారసత్వాన్ని గౌరవిస్తున్నామని చెప్పుకుంటున్నప్పటికీ, పార్టీ అంబేద్కర్ కలల భారత్‌ను ఆచరణలో పెట్టడంలో విఫలమవుతుందని విమర్శలు కూడా ఉన్నాయి.

డాక్టర్ అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలు బీజేపీపై రాజకీయ ప్రతిస్పందనను ప్రేరేపించాయి. ఈ వివాదం దళిత వర్గాల మద్దతును దూరం చేయడం ద్వారా పార్టీకి గట్టి ఎదురు దెబ్బగా మారవచ్చు. బీజేపీ అంబేద్కర్‌పై ప్రజల మనోభావాలను గౌరవిస్తూ, మరింత జాగ్రత్తగా వ్యవహరించకపోతే, దీని ప్రభావం 2024 ఎన్నికల్లో కూడా కనిపించవచ్చు. భారతదేశంలోని ప్రజాస్వామ్య పరిస్థితుల్లో, అంబేద్కర్ వంటి ప్రముఖ వ్యక్తుల వారసత్వాన్ని గౌరవించడం రాజకీయ పార్టీలకు ఒక కీలకమైన పరీక్ష. బీజేపీ ఈ విపత్తును చక్కదిద్దే ప్రయత్నం చేయకపోతే, ఇది దీర్ఘకాలిక రాజకీయ నష్టానికి దారితీయవచ్చు.

డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్
9849328496

చీర కట్టులోని అందం

నేడు ప్రపంచ చీరల దినోత్సవం స్త్రీల వస్త్రధారణ అని అర్థం వచ్చే సత్తికాన్నే ప్రసిద్ధ పదం నుండి ఈ పదం ఉద్భవించింది జైన మరియు బౌద్ధ లిపిలో కూడా దీని ప్రస్తావన ఉంది కొన్ని సంవత్సరాల తర్వాత విదేశీయుల రాకతో ధనవంతులైన వ్యక్తులు ఖరీదైన చీరలు ధరించడం మొదలుపెట్టారు చీరకట్టు అన్నం అతివను మరింత అందంగా తీర్చిదిద్దుతుంది భారతీయ చేనేత కారులు అగ్గిపెట్టెలో పట్టే చీరలు వేయడమే కాకుండా చాలా ప్రాముఖ్యత గల చీరలు తయారు చేశారు కంచి పట్టు సిరిసిల్ల ఉప్పాడ ధర్మవరం మొదలగు పట్టు చీరల తయారీ మనకు తెలుసు ఈరోజు ఒక పెళ్లి జరగాలంటే కచ్చితంగా చీర ఉండాల్సిందే ఎంత ఆధునికమైన డ్రెస్సులు వచ్చిన చీరకట్టు ముందు దిగదుపుడే ఆధునిక కాలంలో చాలామందికి చీర కట్టడం రాదు దానికి చీర కట్టడం కోసం డిజైనర్లు ఉన్నారు దసరా నవరాత్రులు ఇతర ప్రత్యేక బతుకమ్మ పండుగలో చీరలు యుక్త వయసు వాళ్ళు విద్యార్థినిలు కూడా కడతారు అందుచేత భారతీయులకు ప్రత్యేకమైనది చీరకట్టు ముఖ్యంగా పూర్వకాలంలో 9 గజాల చీరలు ఉండేవి ప్రస్తుతం అవి ఆరు గజాల వరకు వచ్చాయి నేరుగా చీర ధరించే వస్త్రాలు కూడా వచ్చాయి ఒక కవి అన్నట్లు చీరకట్టులోని అందం శ్రీ పరిపూర్ణ జీవితాన్ని ఆవిష్కరిస్తుంది కోటి రూపాయల విలువచేసే పట్టుచీరలు కూడా ఉన్నాయి వారి వారి స్తోమతను బట్టి పట్టు చీరలు కొంటారు అందుకే చీర చారిత్రకమైన ప్రస్థానం కలది

ఉమాశేషారావు వైద్య
లింగాపూర్, కామారెడ్డి
9440408080

మెట్రో పరేడ్ గ్రౌండ్ స్టేషన్‌లో లిఫ్ట్ ఎస్కలేటర్ ఏర్పాటు చేయాలి

హైదరాబాద్ మెట్రో రైలు నగర ప్రజలకు ఒక వర ప్రదాయిని. బ్లూ లైన్ పరేడ్ గ్రౌండ్ స్టేషన్లో లిఫ్టులు ఎస్కలేటర్లు ఏర్పాటు చేయకపోవడం వలన వయోధికులు పిల్లలు స్త్రీలు చాలా ఇబ్బంది పడుతున్నారు ప్రక్కనే అనుబంధంగా ఉన్న గ్రీన్ లైన్ జేబీఎస్ పరేడ్ గ్రౌండ్ స్టేషన్లో విస్తృతంగా ఉన్న లిఫ్టులు ఎస్కలేటర్లు ఉపయోగించుకొని ఈ స్టేషన్లో రైలు సౌకర్యం పొందవలసి ఉంటున్నది ప్రస్తుతం పరేడ్ గ్రౌండ్ స్టేషన్లో కేవలం రెండు ప్రదేశాలలో గల మెట్ల మార్గాల ద్వారా రాకపోకలు జరుగుతున్నవి పరేడ్ గ్రౌండ్ పార్కింగ్ స్థలంలో వాహనాలు నిలుపుకొని రోడ్డు దాటి జేబీఎస్ పరేడ్ గ్రౌండ్ స్టేషన్ ద్వారా తిరిగి పరేడ్ గ్రౌండ్ స్టేషన్లోనికి రావాల్సి ఉండటం వలన అధికక్రమ సమయం వృధా అవుతున్నది విపరీతమైన రద్దీతో రోడ్డు దాటడం చాలా గగనంగా ఉంటున్నది పరేడ్ గ్రౌండ్ పార్కింగ్ స్థలంలోకి రాకపోకలు సాగించుటకు మెట్ల దారి ఏర్పాటు చేసినారు కానీ రేలింగ్ పటిష్టంగా ఏర్పాటు చేయకపోవడం వలన క్రింద పడిపోతామన్న భయం కలుగుతున్నది పరిశుభ్రంగా కూడా ఉండడం లేదు ప్రయాణికుల కష్టనష్టాలను దృష్టిలో ఉంచుకొని ప్రారంభంలో లేని సికిందరాబాద్ ఈస్ట్ స్టేషన్ నుండి రైత్ ఫిల్ లోకల్ బస్ స్టేషన్ కు ప్రత్యేక స్కైవే మరియు పారడైజ్ స్టేషన్లో ప్రవేశించుటకు రోడ్డుకు అవతలి వైపు లిఫ్ట ఎస్కులేటర్ ఏర్పాటు చేసినారు ఇదే విధముగ పరేడ్ గ్రౌండ్ స్టేషన్లో పార్కింగ్ స్థలం వైపు లిఫ్ట ఎస్కులేటర్ ఏర్పాటు చేయాలని మెట్రో అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నాను ఈ సౌకర్యం రెండు స్టేషన్లకు రాకపోకలు కొనసాగించుటకు ఉపయోగంగా ఉంటుంది.

దండంరాజు రాంచందర్ రావు
రిటైర్డ్ డిప్యూటీ సూపరింటెండెంట్
సింగరేణిభవన్ హైదరాబాద్
9849592958

ప్రజాస్వామ్య సౌధాన్ని విచ్ఛిన్నం చేసేవే కుళ్లుబోతు రాజకీయాలు

సమాజానికి న్యాయకత్వ పాలన, నిర్వహణ, ధర్మం కర్తవ్యం సమాజానికి అవసరమైన ధర్మాలన్నీ అందించే వేద గ్రంధం రామాయణం. భారతీయులకు రామాయణ భారత భాగవతాలు ప్రధానమైన ప్రామాణిక గ్రంథాలు. రామాయణ కావ్యం మంచి చెడులను వివరిస్తూ ధర్మ ప్రవర్తన కలిగిన మనిషి ఎలా ఉండాలో నలుగురిలో ఆదర్శంగా ఎలా మసులుకోవాలో తెలియజేస్తుంది. అందుకే ఈ కావ్యం అందరినీ అనుసర నియమైనది. పండితుడు మొదలుకొని, పామరుడు దాకా రామాయణ గాథలు అందరిని అలరిస్తూ పూర్తిని కలుగజేస్తాయి అనడంలో సందేహం లేదు. జానపదులు జీవన విధానంలో రామాయణం ఒక భాగం అయిపోయింది. మన పూర్వీకులు రామాయణంలోని ప్రతి అక్షరం ఆచరణీయమైంది అంటారు. అందుకే రాజ్యం "రామరాజ్యం" కావాలన్నాడు మహాత్మా గాంధీ. పైగా ఈనాడు అంతరామరాజ్యం కావాలని ఉంటారు, వింటుంటాము అంతటి రాజనీతజ్ఞత గల రాముడు పాలన ఇక్షాకు వంశీయుల వంశానిది ఉన్నతమైన రాజనీతజ్ఞతో ధర్మాన్ని అడుగడుగునా అణువణువునా పాటిస్తూ ప్రజాస్వామిక పరిపాలనగా చెప్పవచ్చు. ప్రస్తుత రాజకీయ వ్యవస్థ పరిపాలన వ్యవహారాలు రాజ్య నిర్వహణ చట్టం న్యాయం ధర్మం వ్యవస్థలు ఏ విధంగా నిర్వహిస్తున్న అన్న విషయాన్ని ఒకసారి గమనిస్తే ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహిస్తున్నారా లేదా అన్న విషయాన్ని తెలిసిపోతుంది. రాజకీయ పార్టీలు అనుసరిస్తున్న రాజకీయ విలువలు కూడా పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా నిత్యం మనం గమనిస్తున్న పరిపాలన వ్యవస్థ, ప్రతిపక్ష వ్యవస్థ ఏ విధంగా వ్యవహరిస్తున్నాయో ప్రజలు అర్థం చేసుకోలేని పరిస్థితుల్లో లేరు. కాబట్టి ప్రజలకు నమ్మకమైన, ఒక విధానపరమైన రాజకీయ వ్యవస్థ, ధర్మబద్ధమైన వ్యవస్థ ఉండాలని ప్రజలు కోరుకుంటున్న విషయాన్ని పాలకులు గమనించాల్సి ఉంటుంది.

2.రాజకీయ పార్టీలు అవకాశాలను ఉపయోగించుకొని అధికారానికి రావడానికి ఎన్ని ఎత్తుగడలు వేసి అయినా లక్ష్యాన్ని చేరుకోవాలని ఆలోచనే కానీ ప్రజా ప్రయోజనం మాత్రం విస్మరించడం రోజురోజుకు ఆందోళన కలిగిస్తున్న అంశం. ప్రజాస్వామ్యంలో భారత రాజ్యాంగం గూర్చి గొప్పగా చెప్పుకోవడానికి అభ్యంతరం లేదు కానీ వాటి అమలులోనే ఉంది రాజకీయ పార్టీలు అధికారానికి వచ్చిన ప్రభుత్వాల ధమన నీతి .రాజ్యాంగ పీఠికలో రాయబడినటువంటి సౌమ్యవాద గణతంత్ర ప్రజాస్వామ్య లౌకిక భావజాలం సౌభ్రాతృత్వ ధోరణి న్యాయాన్ని సమానత్వాన్ని సాధించి పెట్టడం లక్ష్యంగా పేర్కొన్న కీలక అంశాలు ఆచరణలో సామాన్యుని గడప దాటకపోవడం భారత ప్రజాస్వామ్యం అపహాస్యం కావడానికి కారణమవుతుంటే దానికి బాధ్యత వహించవలసినటువంటి రాజకీయ పార్టీలు ప్రభుత్వ అధికార పక్షాలు దాటవేత ధోరణితో పరస్పరం విమర్శించుకుంటూ బెదిరింపు శాపనార్థాలు రెచ్చగొట్టి వెంటపడే ధోరణులు సిగ్గుచేటు. ప్రజా చైతన్యంతో హక్కులను కోల్పోతున్న విభిన్న వర్గాలు రాజ్యాధికారంలో వాటా కోల్పోతున్నటువంటి బహుజనులు అందరినీ కలుపుకొని రాజ్యాంగ పరిధిలోనే ప్రజాస్వామ్య బద్ధంగా పోరాడటానికి నిరంతరం కార్యాచరణ కొనసాగాలి .ఆహారం నిద్ర ఏరకంగా సహజమైనటువంటి కార్యకలాపాలో అదే రకంగా ఉత్పత్తిలో భాగస్వాములు కావడం, పరిపాలన చేయడం, హక్కులు కోల్పోతున్న వాళు పోరాడడం , చట్టసభల్లో ప్రజల పక్షాన ప్రశ్నించడం కూడా అంతే సహజమైన అంశాలుగా గుర్తించాలి. ఆ రకంగా చూసుకున్నప్పుడు ప్రస్తుతం భారతదేశంలో రాజకీయ పార్టీల యొక్క బెదిరింపు లేదా లొంగదీసుకునే రాజకీయాలు రెండు కూడా ప్రజాస్వామ్య సౌధాన్ని విచ్ఛిన్నం చేసేవే .

కుళ్ళు బోతు రాజకీయాలు :ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో ప్రకటించడంతోపాటు ప్రజల కోసమే పని చేస్తామని ప్రజల తీర్పు శిరోధార్యం అని ఓటమి అయినా గెలుపైనా ప్రజల వైపే ఉంటామని హామీ ఇచ్చి బహిరంగంగా ప్రకటించి ఎన్నికలు పూర్తయిన తర్వాత గెలిచిన పార్టీని ఎలా నిందించడం అని ఆలోచిస్తున్నాయి

ప్రతిపక్ష పార్టీలు అందుకు ప్రధానంగా తెలంగాణ రాష్ట్రాన్ని ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఎన్నికైన ఏ ప్రభుత్వమైనా విభిన్న అంశాల పైన తన పాలనా విధానాలను ప్రకటించక ముందే పరిపాలన బాగాలేదని, రాక్షస పరిపాలనని ,ప్రజల హక్కులను హరించి వేస్తున్నారని, ప్రజల పక్షాన పని చేయడం లేదని, స్వార్థ చింతనతో లాభాపేక్షతోనే పనిచేస్తే వెంటపడి తరిమికొడతామని మరొక పార్టీ హెచ్చరిస్తూ శాపం పెడుతూ నిందిస్తూ ఉంటే అధికారంలో ఉన్న పార్టీ ప్రతిపక్షాన్ని మీరు అధికారంలో కొనసాగినప్పుడు కొన్ని ఏళ్ల వరకు మందలించలేదని ఏ ప్రభుత్వానికైనా సర్దుకోవడానికి సమయం పడుతుందని ముఖ్యంగా తెలంగాణలో తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని కనీసం ఐదు సంవత్సరాల వరకు ప్రతిపక్షాలు మేధావులు ప్రజాసంఘాలు కూడా విమర్శించలేదని పాలక కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నిసార్లు సర్ది చెప్పినా బెదిరింపులు మాత్రం తగ్గడం లేదు. ఇది కేవలం తెలంగాణకు మాత్రమే పరిమితం కాలేదు దేశవ్యాప్తంగా కేంద్రంలోనూ రాష్ట్రాలలోనూ ఇదే తంతు .

పరస్పరం విమర్శించుకుంటూ చట్టసభల సమయాన్ని ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ పబ్బం గడుపుకోవడం ఏ రకంగా ప్రజా పాలన ప్రజాస్వామ్యం అవుతుందో రాజకీయ పార్టీలు ఆలోచించుకోవాలి . అధికారానికి వచ్చిన కొత్తలో ప్రజల పౌర మానవ హక్కులను పరిరక్షిస్తామని, స్వేచ్ఛ స్వాతంత్రాలను కాపాడుతామని , ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తామని చెప్పిన రాజకీయ పార్టీలు అధికారానికి రాగానే అసహనా నికి గురికావడం , నిర్బంధం అణచివేత రాజ్య హింసకు పాల్పడడం, హక్కుల కోసం పోరాడుతున్నటువంటి ఉద్యోగ కార్మిక శ్రామిక ప్రజా సంఘాలు విభిన్న వర్గాలను ఎక్కడికక్కడ అరెస్టులు చేసి చిత్రవధకు గురిచేసి పోరాటాన్ని అణిచివేయడం ఇదేనా ప్రజా పాలన అని ప్రజలు ప్రజాస్వామిక వాదులు ప్రశ్నించుకునే రోజులు రావడం ఇచ్చిన మాటకు కట్టుబడనీ పాలకవర్గాలకు ప్రమాదకరమే కదా !అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని నిలదీస్తూ నిరసన కార్యక్రమాలు చేస్తూ ప్రజల దృష్టిలో ఉండాలని ఆలోచించిన రాజకీయ పార్టీలు ఒకే ఒక్కసారి ప్రభుత్వంలోకి రాగానే తీరును మార్చుకోవడం కొనసాగుతుంటే మరొకవైపు అధికారంలో కొనసాగి ఓడిపోయినటువంటి రాజకీయ పార్టీలు తమ ఓటమికి కారణం తమ పరిపాలన లోపం కాదని ప్రజల తొందరపాటు అని కొంతమంది ప్రజాసంఘాలు లేదా మేధావులు యొక్క కుట్ర అని మాత్రమే ప్రకటిస్తారు. కానీ తమ తప్పును స్వీకరించడానికి అంగీకరించడానికి సిద్ధంగా లేకపోవడం కూడా తాము తవ్వుకున్న గోతిలో తామే పడడానికి ఏర్పరచుకున్నటువంటి వేదికగా భావిస్తే మంచిది. అంతేకాదు ప్రజల తీర్పును కూడా తప్పు పట్టడం మరింత మూర్కత్వం.

ఇక అధికారంలో ఉన్న ప్రభుత్వానికి కార్యనిర్వహణలో అందదండలుగా ఉండాల్సినటువంటి అధికార యంత్రాంగం కూడా ప్రజాకోణాన్ని పక్కనపెట్టి పాలకులు ఏది చెప్పితే అది తూచా తప్పకుండా చేస్తూ స్వామి భక్తిని ప్రదర్శిస్తుంటే ఇటీవల కాలంలో హైకోర్టులు భారత సర్వోన్నత న్యాయస్థానం కూడా అనేకసార్లు అటువంటి అధికారులను మందలించిన సందర్భాలు అనేకం. ఒక దశలో కొత్తగా వచ్చిన ప్రభుత్వాలు ఆ ఉద్యోగులను సస్పెండ్ చేస్తే కోర్టుకు వెళ్లిన సందర్భంలో న్యాయస్థానం కూడా ప్రజల పక్షాన పని చేయాలి కానీ ప్రభుత్వానికి మద్దతుగా పనిచేయడం అంటే బాధ్యతను విస్మరించడమే చేసిన నేరానికి శిక్ష అనుభవించాల్సిందే అని ఇచ్చిన తీర్పుతోని ఇకనైనా అధికారులు గుణపాఠం తెచ్చుకోవాలి. ప్రజల పక్షాన నిక్కచ్చిగా పనిచేయడానికి సిద్ధపడాలి. గత కొంతకాలంగా మారిన ప్రభుత్వాల కాలంలో గతంలో ఐఏఎస్ ఐపీఎస్ ఇతర అధికారులుగా పనిచేసినవాళ్ల నేర ప్రవృత్తి కేసులను తిరగదొడిన సందర్భంలో జైలుకు వెళ్లిన సందర్భాలు కూడా అనేకం ఇది ప్రజాస్వామ్యం పలుచబడడానికి పెద్ద సూచికగా భావించవలసిన అవసరం ఉంది. ఇలాంటి అప్రజా స్వామిక ఆలోచనలు సంఘటనలు పునరావృతం కాకుండా కట్టడి చేయాలంటే ప్రజా చైతన్యం కీలకం. అంతేకాదు..

కొన్ని సూచనలు : వ్యక్తివాదం భావవాదం ఎక్కువై భౌతికవాదం తగ్గి ప్రజాప్రయోజనాలు ఆకాంక్షలు విస్మరించి అధికారం కోసమే అర్రులు చాస్తున్న ఈ కాలంలో పార్టీల పేరుతో ప్రభుత్వాలు, ముఖ్యమంత్రి పేరుతో ప్రభుత్వాలు కొనసాగడం సిగ్గుచేటు. గతంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం అని హుందాగా చెప్పుకునేవాళ్ళ%శీ%. కేంద్ర రాష్ట్ర సంబంధాలు బలంగా ఉండడానికి గతంలో సర్కారియా కమిషన్ వంటి అనేక కమిషన్లు చేసిన సూచనలను పాటించడం ద్వారా తమ రాజ్యాంగ సామాజిక బాధ్యతలను నిర్వహించడానికి రాజకీయ పార్టీలు కట్టుబడి ఉండాలి. ప్రభుత్వాలు కూడా పరస్పరం గౌరవించుకోవడమే కాదు ప్రజలు కూడా ప్రభుత్వాన్ని గౌరవించడం ప్రభుత్వాలు ప్రజలను ప్రభువులుగా చూడడం నేర్చుకోవాలి. ఓటు హక్కు కల్పించిన సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్" ఓటు హక్కు ద్వారా ఈ దేశంలో సమున్నతమైనటువంటి స్థాయికి ప్రతి వ్యక్తి చేరుకోవడానికి అవకాశం వచ్చింది ఓటు హక్కును వినియోగించుకొని పాలకునిగా యజమానిగా మారుతావో లేదా బానిసగా మిగిలిపోతారవో తేల్చుకో" అంటూ చేసిన హెచ్చరికను తూచా తప్పకుండా పాటించి ప్రజలను ప్రభువులు గా చూడడానికి అంగీకరించని పాలకులను ఆలోచింపజేసే విధంగా తమ హక్కులకై పోరాడుతూ రాజ్యాధికారంలో వాటా కోసం డిమాండ్ చేయడం మాత్రమే కాదు చట్టసభలను స్తంభింపజేయడం, రాజ్యాధికారం పట్ల ప్రధానమైన ప్రభలమైన కాంక్ష కలిగి ఉండడం, సర్వరోగ నివారిణి లాగా అట్టడుగు పేద వర్గాలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు అధికారమే ప్రధానమనే భావనను విశ్వవ్యాప్తం చేయడం ద్వారా మాత్రమే రాజకీయ పార్టీల కుట్రలు కుతంత్రాలు చిలిపి వేషాలు చులకన భావజాలం ప్రజాస్వామిక విలువలను హరించి వేసే దుష్ట సంస్కృతికి చరమగీతం పాడవచ్చు. అధికారానికి వచ్చిన ప్రభుత్వం రాబోయే 10 ఏళ్ల కాలమంతా మాదే అంటూ విర్రవీగుతుంటే సంవత్సరంలో ప్రభుత్వాన్ని పడగొడతాం ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెడితే మొత్తం సీట్లు మావే అంటూ చిల్లర వేషాలతో చిలిపి మాటలతో బాధ్యతారాహిత్యంతో మాట్లాడుతున్నటువంటి అపరిపక్వ నాయకుల కూటిల నీతిని ఎండ కట్టాల్సిన అవసరం చాలా ఉన్నది. రెండు పార్టీల మధ్యన సమస్య కాదు పరిపాలన అంటే ప్రజలను విస్మరించి రాజకీయ పార్టీలు స్వార్థం మనుగడ కోసం యుద్ధం చేస్తుంటే ఊరుకుందామా ?ఆలోచించుకోవాల్సిన అవసరం ఉంది మాట్లాడకుండా ప్రశ్నించకుండా మౌనంగా ఉంటే తలవంచి మెడ వంచి మనపై స్వారీ చేయడానికి ప్రతివాడు సిద్ధపడతాడు. తల ఎత్తుకొని గలమెత్తి వీలైతే కలమెత్తి పిడికిలి బిగించి నిలదీస్తే రాజ్యాంగం కొంతవరకైనా అమలు కావడానికి అవకాశం ఉంటుంది. సమగ్ర శాసనంగా రాసుకున్న రాజ్యాంగం పైన ప్రమాణం చేసి అధికారానికి వస్తున్న పాలకులు రాజ్యాంగాన్ని పక్కనపెట్టి వ్యక్తి వాదాన్ని భావవాదాన్ని మూడవిశ్వాసాలను ఊహ లోకాన్ని ప్రజల ముందు పెడితే అంగీకరించినంత కాలం

మహిళా జర్నలిస్టుల సమస్యలపై కమిషనర్‌కు వినతిపత్రం

● టియుడబ్ల్యూజే మహిళా విభాగం జర్నలిస్టుల వినతి

హైదరాబాద్, డిసెంబర్ 20 (జనంసాక్షి) : మీడియా సంస్థల్లో వృత్తిపరంగా మహిళా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమాచార శాఖ కమిషనర్ ఎస్.హరిష్, ఐఏఎస్‌కి తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) మహిళా సంక్షేమ కమిటీ విజ్ఞప్తి చేసింది. శుక్రవారం సచివాలయంలో ఆయనను కలిసిన ప్రతినిధి బృందం, మహిళా జర్నలిస్టుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్ళారు. మహిళా జర్నలిస్టులకు తమ వాటా ప్రకారం అక్రెడిటేషన్లు ఇచ్చే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని వారు కోరారు. ప్రతి మీడియా సంస్థలో ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ ఉండాలనే నిబంధన ఉన్నప్పటికీ అది కూడా అమలు కావడం లేదని వారు విచారం వ్యక్తం చేశారు. విశాఖ గైడ్‌లైన్స్ ప్రకారం ప్రతి మీడియా సంస్థలోనూ జెండర్ సెన్సిటివిటీ వర్క్ షాప్స్ జరగాలనే నిబంధన కూడా కాగితాలకే పరిమితమైందన్నారు. ఇప్పటినుంచైనా విశాఖ గైడ్‌లైన్స్ ప్రతిచోటా అమలు జరిగేలా చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. ఐసీసీ గైడ్‌లైన్స్ పాటించని సంస్థలకు అక్రెడిటేషన్లు ఇవ్వరాదనే నిబంధనను తీసుకురావాలని వారు కోరారు. ఐసీసీలో ఇచ్చే ప్రతి కంప్లైంట్ మీడియా అకాడమీ దృష్టికి కూడా తీసుకువచ్చేలా అకాడమీ ఆవరణలో కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు చేయాలని వారు కోరారు. తమ సంస్థలో పని చేస్తున్న మహిళా ఉద్యోగుల జాబితాను ప్రతి మీడియా సంస్థ కచ్చితంగా ఆరు నెలలకోసారి మీడియా అకాడమీకి సమర్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇళ్ల స్థలాల కేటాయింపులో మహిళా జర్నలిస్టులకు 33 శాతం రిజర్వేషన్ కచ్చితంగా అమలు చేయాలని, అక్రెడిటేషన్‌లతో సంబంధం లేకుండా మహిళా జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు మంజూరీ చేయాలన్నారు. ఆయా మీడియా సంస్థలు పూర్తి స్థాయి మాస్టర్ హెల్త్ చెకప్ క్యాంపును ఆరు నెలలకోసారి నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. మీడియా సంస్థల్లో పనిచేసే మహిళ ఉద్యోగులకు రాత్రివేళల్లో తప్పనిసరిగా రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లు, ఇబ్బందులు, మహిళా జర్నలిస్టుల భద్రత, ఇతర సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ప్రతినిధి బృందం కోరింది. పైఅంశాలపై ప్రభుత్వంతో చర్చించి, విధివిధానాలను రూపొందించి, మహిళా జర్నలిస్టుల సంక్షేమానికి తగు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కమిషనర్ హామి ఇచ్చారు. మహిళా జర్నలిస్టుల సమస్యలపై ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ ప్రతినిధి బృందంలో టీయూడబ్ల్యూజే మహిళా సంక్షేమ కమిటీ బాధ్యులు కళ్యాణం రాజేశ్వరీ, యశోద, ప్రతిభ, వాకా మంజుల ఉన్నారు.

బంజారాహిల్స్‌లో భూమి కబ్జా అవాస్తవం

● స్పష్టం చేసిన అధికారులు

● రెవెన్యూ, పోలీసు, హైడ్రా అధికారులతో సంయుక్త తనిఖీ

హైదరాబాద్, డిసెంబర్ 20 (జనంసాక్షి) : హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నంబర్.10 లో ఉన్న జలమండలి 2.20 ఎకరాల భూమి కబ్జాకు గురైందని వివిధ మాధ్యమాల్లో ప్రచారమైన విషయం అవాస్తవమని అధికారులు స్పష్టం చేశారు. వివిధ పత్రికలు, మాధ్యమాల్లో జరిగిన ప్రచారంపై జలమండలితో పాటు రెవెన్యూ, హైడ్రా, పోలీసు అధికారులు సంయుక్తంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో రెండు చోట్ల 2.20 ఎకరాల జలమండలి భూమి ఉందని తెలిపారు. ఒక దగ్గర ఎకరా భూమి ఉందని అక్కడ జలమండలికి చెందిన 6 ఎంఎల్ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ ఉందని తెలిపారు. బంజారాహిల్స్ రోడ్ నం. 2, 10, 14 ప్రాంతాల ప్రజలకు ఇదే రిజర్వాయర్ నుంచి తాగునీటి సరఫరా చేస్తున్నామన్నారు. దీనికి 150 మీటర్ల దూరంలో మరో 1.20 ఎకరాలు ఉందని చెప్పారు. అయితే ఇది రాళ్లతో కూడిన ఖాళీ స్థలం కావడంతో రెవెన్యూ అధికారుల చేత సర్వే నిర్వహించి స్పష్టమైన సరిహద్దులు కూడా ఏర్పాటు చేశామన్నారు. దీంతోపాటు ఈ స్థలంపై తెలంగాణ హైకోర్టు స్టేటస్ కో ఆర్డర్ సైతం ఉన్నట్లు వివరించారు. హైకోర్టు ఆదేశాల మేరకే అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదని తెలిపారు. కాబట్టి, దినపత్రికలు, మాధ్యమాల్లో వచ్చిన ప్రచారం అవాస్తవమని అధికారులు తెలిపారు. ఈ కబ్జా అంశంపై హైకోర్టులో అఫిడవిట్ సైతం దాఖలు చేస్తామని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు నర్సాపూర్ గురుకుల విద్యార్థులు ఎంపిక

నర్సాపూర్, డిసెంబర్ 20 (జనంసాక్షి) : ఈ నెల 27న హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ సీఎం కప్ పోటీలకు నర్సాపూర్ గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ తెలిపారు,శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మెదక్ లోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి సీఎం కప్ అథ్లెటిక్స్ లో నర్సాపూర్ గురుకుల పాఠశాల విద్యార్థులు బబ్లు జూనియర్ డిస్కస్ త్రోమొదటి స్థానం,విష్ణు జూనియర్ 400 మీటర్ మూడో స్థానం,సిద్ధార్థ్ సబ్ జూనియర్ 200 మీటర్ రన్ మొదటి స్థానంలో నిలిచారని ఆయన తెలిపారు,ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఈనెల 27న హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ సీఎం కప్ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ శ్రీనివాస్ తెలిపారు, ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు,ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కిషోర్, పిడి లక్ష్మణ్,పిఈటి లింగ గౌడ్, రాజు ఉన్నారు.

ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా కుట్టు మిషన్‌లకు దరఖాస్తు చేసుకోవాలి

● జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి నవీన్ కుమార్ రెడ్డి

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 20 (జనంసాక్షి) : తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఇందిరమ్మ మహిళా శక్తి పథకంలో మైనారిటీ మహిళల కు ఉచిత కుట్టు మిషన్ లు అందివ్వడం జరుగుతుందని జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి నవీన్ కుమార్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 నుండి 31.12.2024 వరకు మైనారిటీ మహిళలు ముస్లిం,సిక్కులు, బౌద్దులు, జైనులు, పార్సి కి చెందిన వారు %స్త్రశీఎఎం.ఎస్త్ర.స్త్రశీజ.అఅ% ద్వార దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ పథకంలో నిరుపేద, నిరాశ్రయులు, వితంతువు, విడాకులు అయిన మహిళలు, అనాథ, ఒంటరి మహిళలకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ పథకానికి కావలసిన జీరాక్స్, తెల్ల రేషన్ కార్డు,ఆహారభద్రత కార్డ్ రెండూ లేకపోతే గ్రామీణ ప్రాంతం వారికి 1.50 లక్షలు, పట్టణ ప్రాంతం వారికీ రెండు లక్షలు మించకుండా ఆదాయ ధృవపత్రం ఉండాలి.ఆధార్ కార్డు నివాస ధృవీకరణ ధ్రువీకరణ పత్రం వయస్సు 18 సం నుండి 55 సంవత్సరాలు ఉండాలని తెలిపారు.తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ లేదా ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ ద్వార నేర్చుకున్న టైలరింగ్ సర్టిఫికేట్ కనీసం 5వ తరగతి విద్య అర్హత కలిగి ఉండాలని తెలిపారు.అభ్యర్థి సెల్ఫ్ డిక్లరేషన్ గడిచిన 5 సంవత్సరాల కాలములో తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఎటువంటి ఆర్థిక, వస్తువులు లబ్ది పొందలేదు అని ఇవ్వాలి.ఆన్ లైన్ దరఖాస్తు తో పాటు ధ్రువ పత్రాలను జత చేసి రంగారెడ్డి జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయమం రూమ్ నెం ఎస్-18, 2వఅంతస్తులో ఐడిఓసీ బిల్డింగ్ కొంగరకలాన్ నందు అందజేయాలని తెలిపారు.

రాహుల్ గాంధీపై చర్యలు తీసుకోవాలి

● జిల్లా మహిళా మోర్చా అధ్యక్షులు లక్ష్మి శ్యామ్

నారాయణపేట జిల్లా బ్యూరో, డిసెంబర్ 20 (జనంసాక్షి) : పార్లమెంట్‌లో నాగాలాండ్‌కు చెందిన గిరిజన మహిళా ఎంపి.పాంగ్ సాన్ కోక్యాన్ పట్ల పార్లమెంట్ విపక్ష నేత రాహుల్ గాంధీ అనుచితంగా ప్రవర్తించిన తీరు సమంజసం కాదని ఆయనపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని నారాయణపేట జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు లక్ష్మీ శ్యామ్ సుందర్ గౌడ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.ఒక గిరిజన మహిళ ఎంపి పట్ల అసౌకర్యంగా రాహుల్ గాంధీ ప్రవర్తించడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు.ఎప్పుడు రాజ్యాంగ పుస్తకాన్ని చేతిలో పట్టుకుని తిరిగే ఆయనకు మహిళల పట్ల వ్యవహరించే తీరు రాజ్యాంగం నేర్పిందా అని ప్రశ్నించారు.రాజ్యాంగంపై చిత్త శుద్ధి లేనివారే ఇలా ప్రవర్తిస్తారు అన్నారు.ఇప్పటికైనా రాహుగాంది నిజస్వరూపం సొంత కాంగ్రెస్ నాయకులు గుర్తిస్తే మంచిదని హితవు పలికారు.

దేశపు ఉత్తమ బ్రాండ్ 2024-25గా ఫ్రీడమ్ ఆయిల్

ఖైరతాబాద్, డిసెంబర్ 20 (జనంసాక్షి) : ఇండియా టుడేతో కలిసి మార్క్స్‌మెన్ డైలీ సంస్థ, ఫ్రీడమ్ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను '2024-25'లో అత్యంత ఇష్టపడే బ్రాండ్‌లలో ఒకటిగా గుర్తించిం దని జెమినీ ఎడిబుల్స్, ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్, సేల్స్, మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి.చంద్ర శేఖర రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడు తూ.. ఈ గుర్తింపు నాణ్యత, ఆరోగ్యం, కస్టమర్ సంతృప్తి కోసం బ్రాండ్ యొక్క స్థిరమైన నిబద్ధత ను వేడుక జరుపుకుంటుందని అన్నారు. ఇది దేశ వ్యాప్తంగా ఉన్న గృహాలలో విశ్వసనీయమైన పేరు గా మారిందన్నారు. జెమిని ఎడిబుల్స్, ఫ్యాట్స్ ఇం డియా లిమిటెడ్ జీఎం మార్కెటింగ్ చేతన్ పింపా ల్‌ఖుటే మాట్లాడుతూ ఫ్రీడమ్ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ గత 3 సం.ల నుండి నిరంతరంగా సన్‌ఫ్ల వర్ ఆయిల్ విభాగంలో(నీల్సన్ ఐక్యూ డేటా (మాట్) ఫిబ్రవరి 2024 ప్రకారం) భారత దేశంలో వాల్యూమ్ సేల్స్ పరంగా నంబర్.1 బ్రాండ్‌గా నిలిచిందన్నారు.

నీటి ఎద్దడిని నివారించండి

● జలమండలి ఎండి. అశోక్ రెడ్డికి ఎమ్మెల్యే వినతి

మల్కాజిగిరి, డిసెంబర్ 20 (జనంసాక్షి) : గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో నెలకొన్న మంచినీటి ఎద్దడి నివారించాలని కోరుతూ ఖైరతాబాద్ జలమండలి ఎండి అశోక్ రెడ్డిని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వినతి పత్రాన్ని అందజేసి స్థానికులు ఎదుర్కొంటున్న నీటి సమస్యను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఇందిరా నెహ్రూ నగర్, జయగిరి లక్ష్మీనరసింహస్వామి నగర్, న్యూ వెంకటేశ్వర నగర్, బిహారి బస్తి తదితర ప్రాంతాలలో మహేంద్ర హిల్స్ రిజర్వాయర్ నుండి 2 ఎంఎల్ నిటిని రోజు విడిచి రోజు సరఫరా చేయాలని కోరారు.సానుకూలంగా స్పందించిన జలమండలి ఎండి అశోక్ రెడ్డి నీటి సరఫరా మెరుగుపరచడానికి చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన మేనూ అమలు చేయాలి

● రంజోల్ బాలికల గురుకుల పాఠశాల కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 20 (జనంసాక్షి) : గురుకుల పాఠశాలలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మెనూ అమలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం జహీరాబాద్ మండలం రంజోల్ బాలికల గురుకుల పాఠశాల ను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వంటగది స్టోర్ రూమ్ , కూరగాయలు బియ్యం చింతపండు తదితర సామాగ్రి ఎలా ఉందని కలెక్టర్ పరిశీలించారు విద్యార్థులకు కొత్త మెనూ ప్రకారం భోజనాలు అందించాలని ప్రిన్సిపల్ ఆదేశించారు. ఈ తనిఖీలో జహీరాబాద్ రెవిన్యూ డివిజన్ అధికారి. రామ్ రెడ్డి.మండల ప్రతేక్య అధికారి.బిక్షపతి.ఎంపీడీఓ. తాసిల్దార్. ప్రిన్సిపల్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

నారాయణపేట జిల్లా బ్యూరో, డిసెంబర్ 20 (జనంసాక్షి) : ప్రతి ఒక్కరూ రాజ్యాంగంలోని చట్టాల గురించి తెలుసుకో వాలని నారాయణపేట అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేష్ అన్నారు.నారాయణ పేట జిల్లా న్యాయ సేవా సంస్థ లీగల్ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం శ్యాసన్ పల్లి గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.ఈ కార్య క్రమంలో కె.సురేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రాజ్యాంగం గురించి తెలుసు కోవాలన్నారు. హక్కుల పట్ల భంగం కలగకుండా చూసుకో వాలన్నారు.ఈ సందర్భంగా వరకట్న నిషేధం చట్టం (1961) గురించి వివరించారు.తదుపరి చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ లక్ష్మిపతీ గౌడ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ,బీసీ మూడు లక్షల ఆదాయం ఉన్నవారు ఉచిత న్యాయ సహాయం పొందవచ్చు మీ యొక్క సమస్యలకు 15100కు ఫోన్ చేయడం వలన మీ యొక్క సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే సురేష్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ కే లక్ష్మీపతి గౌడ్ మరియు పంచాయతీ కార్యదర్శి భాను ప్రకాష్, కానిస్టేబుల్, పరలీగల్ వాలంటీర్స్, సుధాకర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

అమిత్ షా క్షమాపణలు చెప్పాలి

తాండూరు, డిసెంబర్ 20 (జనంసాక్షి) : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పై కేంద్ర హోంమంత్రి అమిషా చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పాలని మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్, అంటూ పదే పదే అనడం ఇప్పుడు ఓ ఫ్యాషన్గా మారింది.దీనికి బదులుగా దేవుడిని ఇన్నిసార్లు స్మరిస్తే స్వర్గానికి వెళ్లొచ్చని సాక్షాత్తు పార్లమెంట్ లో అమిత్ షా అనడం బాధాకరమన్నారు. దేశంలోనే ఉన్నతమైన పదవుల్లో ఉండి అంబేద్కర్ ను అవమానించడం సరికాదన్నారు. ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను అవమానించే హక్కు నీకు లేదని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను అవమానించిన అమిత్ షాను వెంటనే మంత్రిపదవినుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంతోనే పార్లమెంట్లో ఉన్నతమైన పదవి అనుభవిస్తున్నావని తెలిపారు. ఆ మహానుభావులు పేట్టిన బిక్షానుమర్చిపోయి

నోటికొచ్చినట్లు మాట్లాడటం మంచి పద్ధతి కాదని కొనియాడారు.ఈ కార్యక్రమంలో వివిధ మండల అధ్యక్షులు, వివిధ గ్రామ నాయకులు, ఎస్సీ సెల్ అధ్యక్షులు,మండలాల,మాజీ సర్పంచులు, ఉప సర్పంచ్లు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

● డిఈఓ వెంకటేశ్వర్లు

మునిపల్లి, డిసెంబర్ 20 (జనంసాక్షి) : పదో తరగతిలో మంచి మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు విద్యార్థులకు సూచించారు.శుక్రవారం నాడు మునిపల్లి మండలం కంకోల్ లోని ఉర్దూ మీడియం జడ్పీహెచ్ ఎస్,ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు.పదవ తరగతి విద్యా బోధన పట్ల అరా తీశారు.పదవ తరగతి ప్రత్యేక తరగతుల నిర్వహణ గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పదవ తరగతి ప్రత్యేక తరగతుల నిర్వహణ పట్ల ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు బాగా చదివి మంచి జిపిఏ తెచ్చుకోవాలన్నారు.ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థుల విద్యా సమర్థ్యాలను పరిశీలించి వారికి తగు సూచనలు ఇచ్చారు.తరగతి గదుల నిర్వహణ పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.ప్రధానోపాధ్యాయులు మాధురి, షఫీఅహ్మద్లను డిఈఓ అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ

ఓ భీం సింగ్,తుకారామ్ ఉపాధ్యాయులు ఉమేష్,రాములు,రాఫాత్, జమీల్, యాస్మిన్,నసీమ్ బేగం పాల్గొన్నారు.

వరి ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలి

- అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు

పెబ్బేరు, డిసెంబర్ 20 (జనంసాక్షి) : పెబ్బేరు మండల పరిధిలోని పెబ్బేరు మార్కెట్ యార్డు, కంచిరావు పల్లి ఐ.కే.పి, సహకార సంఘాల ద్వారా నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ సందర్శించారు. ధాన్యం సేకరణ నిబంధనల ప్రకారం జరగాలని, తేమ, తాలు, చెత్త లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులను సూచించారు. సేకరించిన ధాన్యాన్ని నిర్దేశించిన మిల్లులకు ఎప్పటికప్పుడు తరలించాలని అదేవిధంగా ఆన్లైన్‌లో నమోదు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. అకస్మాత్తుగా వచ్చే వర్షాల నుండి ధాన్యానికి రక్షణ కల్పించే విధంగా టార్పాలిన్ లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

ప్రతి కేసులో పారదర్శకంగా, పకడ్బందీగా విచారణ చేపట్టాలి

- కేసులలో నిందితులకు పడే శిక్షల శాతాన్ని పెంచాలని
- నేర సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ డి. జానకి

మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్ 20 (జనంసాక్షి) : ప్రతి కేసులో పారదర్శకంగా పకడ్బందీగా విచారణ చేపట్టాలని, కేసులలో నిందితులకు పడే శిక్షణ శాతాన్ని పెంచాలని జిల్లా ఎస్పీ డీ. జానకి సూచించారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సర్కిల్ వారిగా పోలీస్ అధికారులతో జిల్లా ఎస్పీ నెల వారి నేర సమీక్ష సమావేశంను నిర్వహించారు. ఈ సదర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు వ్యవస్థీకృత నేరాల పై దృష్టి పెట్టాలని, నమోదు అయిన ప్రతి కేసులో పారదర్శకమైన లోతైన విచారణ చేపట్టాలని అన్నారు. పోలీస్ స్టేషన్ ల వారిగా గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల వివరాలను, యు ఐ కేసుల వివరాలను పరిశీలించారు. గ్రేవ్ కేసులలో యు ఐ లో ఉండడానికి గల కారణాలను పరిశీలించి కేసులను చేదించుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఎస్సీ, ఎస్టి కేసుల వివరాలను, నమోదు అయిన పోక్సో కేసు వివరాలను పరిశీలించి ఆయా కేసులలో శిక్షల శాతాన్ని పెంచేందుకు పోలీస్ అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కంటెస్టెడ్ కేసులు కోర్టు ట్రయల్స్ నడిచే సమయంలో సాక్షులను పకడ్బందీగా బ్రీఫ్ చేస్తు ఎప్పటికప్పుడు కేసులకు సంభందించిన విషయాలను బాధితులకు అప్డేట్ చేస్తూ కేసుల లో నిందితులకు పడే శిక్షల శాతాన్ని పెంచాలని సూచించారు. అలాగే మహిళలకు జరిగే నేరాలు అయిన పొక్సొ కేసులలో కుడా నిందితులకు పడే శిక్షల శాతాన్ని పెంచేందుకు పోలీస్ అధికారులు కృషి చేయాలని సూచించారు. దొంగతనాల

కేసులను చేదించడంలో పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, అందుకు తగిన ప్రణాళిక రచించి ముందుకెళ్లాలని ఆదేశించారు. దొంగతనాల కేసులలో నిందితులను లోతుగా విచారించాలని, వీలైనంత త్వరగా అయా కేసులను చేదించాలని ఆదేశించారు. ఎఫ్ ఎస్ ఎల రిపోర్ట్స్, అరెస్ట్ లు పెండింగ్ లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రజా వాణి లో వచ్చిన పిర్యాదులు పై వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రాములు, డి.ఎస్పి వెంకటేశ్వర్లు, డి సి ఆర్ బి డి.ఎస్పి జివి రమణ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శివకుమార్, సి ఐ, ఎస్సై లు తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ ప్రకటనల రుసుం చెల్లింపు కోసం ఆన్‌లైన్ మాడ్యూల్

హైదరాబాద్ సిటీ, డిసెంబర్ 20 (జనంసాక్షి) : గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) అన్ని వర్తక సంస్థలకు తమ వాణిజ్య ప్రాంగణంలో ప్రదర్శించబడే అన్ని గ్లో సైన్ బోర్డులు,నేమ్ బోర్డులు,ఫ్లెక్స్ బోర్డులు,స్టిక్కర్లు మొదలైన వాటికి నిర్ణీత ప్రకటన రుసుమును చెల్లించడం తప్పనిసరి అని తెలియజేస్తుంది.ప్రక్రియను క్రమబద్ధీకరించడానికి మరియు సమ్మతి సౌలభ్యాన్ని నిర్ధారించడానికి,జిహెచ్ఎంసి ప్రకటనల రుసుము చెల్లింపు కోసం ఆన్‌లైన్ మాడ్యూల్‌ను ప్రారంభించింది. ఆన్‌లైన్ అప్లికేషన్ పోర్టల్‌ను https://advt.ghmc.gov.in/Citizen/OTP_Validation లింక్‌లో యాక్సెస్ చేయవచ్చు.ఈ ప్లాట్‌ఫారమ్ ద్వారా వాణిజ్య సంస్థలు అనుమతుల కోసం, సౌకర్యవంతంగా దరఖాస్తు, ఎక్కడి నుండైనా ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేయవచ్చు. ముఖ్యమైన మార్గదర్శకాలు: అన్ని వ్యాపార సంస్థలు తమ ప్రాంగణంలో గ్లో సైన్ బోర్డులు,నేమ్ బోర్డులు,ఫ్లెక్స్ బోర్డులు,స్టిక్కర్లు మొదలైన వాటి ప్రదర్శన కోసం ముందస్తు అనుమతి తీసుకోవాలి. ఆన్‌లైన్ మాడ్యూల్ అప్లికేషన్‌లను అవాంతరాలు లేకుండా సమర్పించడానికి అనుమతులు, ఫీజుల చెల్లింపును సురక్షితం చేస్తుంది. ఈ నిబంధనలను పాటించడంలో విఫలమైతే జిహెచ్ఎంసి చట్టంలోని నిబంధనల ప్రకారం జరిమానాలు విధించబడతాయి. జిహెచ్ఎంసి వ్యాపార యజమానులందరూ క్రమబద్ధీకరించుకోవడానికి ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని, మరింత సమాచారం లేదా సహాయం కోసం,జిహెచ్ఎంసి హెల్ప్‌డెస్క్‌ని సంప్రదించవచ్చని తెలియజేసింది.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించిన కలెక్టర్

మునిపల్లి, డిసెంబర్ 20 (జనంసాక్షి,) : అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుందని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి పేర్కొన్నారు. శుక్రవారం మునిపల్లి మండలంలోని కంకోల్ లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను కలెక్టర్ వల్లూరి క్రాంతి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల సర్వే పార్దర్శకంగా ఉండాలన్నారు. అర్హులను గుర్తించి న్యాయం చేయాలన్నారు.ఈ నెలాఖరు వరకు సర్వే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

హోం మంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలి

- అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం
- గ్రంథాలయ మాజీ చైర్మన్ తోపాజి అనంత కిషన్

సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 20 (జనంసాక్షి) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ భీమ్ రావు అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా బహిరంగ క్షమాపణ చెప్పాలని గ్రంథాలయ మాజీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తోపాజి అనంత కిషన్ డిమాండ్ చేశారు. హోం శాఖ మంత్రి అమిత్ షా వాక్యాలకు నిరసనగా శుక్రవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి లో బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు సమావేశాల్లో సభ్యులు పదే పదే అంబేద్కర్ పేరును ఉచ్చరించడాన్ని మంత్రి అమిత్ షా జీర్ణించుకోలేక పోయారని ఆయన విమర్శించారు.సమసమాజ స్థాపనకై అహోరాత్రులు శ్రమించి తన మేధస్సుతో నిర్మితమైన భారత రాజ్యాంగం ద్వారా దేశానికి దిశా నిర్దేశం చూపిన అంబేద్కర్ ను తక్కువ చేసి మాట్లాడటం అవివేకమన్నారు.అమిత్ షా వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, నాయకులు పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం

- కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్

కాప్రా, డిసెంబర్ 20 (జనంసాక్షి) : ప్రతి ఒక్కరు మంచి ఆహారం తీసుకుని, వాకింగ్ వ్యాయమం చేసి ఆర్యోగానికి కాపాడుకోవాలని చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవియాదవ్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని సోనియాగాంధీ నగర్ ఫేజ్-1లో హిల్ హెల్కె సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిధిగా కార్పోరేటర్ శ్రీదేవియాదవ్ పాల్గొని ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవుడు ఆర్యోగంగా ఉంటేనే అన్ని సాధించగలడన్నారు. ప్రతి మనిషి నుంచి ఆహారం తీసుకోని వాకింగ్, వ్యాయామం చేయాలన్నారు. కాలనీ ప్రజలందరూ ఉచిత మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్లు దామిని నికిత కాలనీ ప్రజలకు పలు వైద్య పరీక్షలు నిర్వహించి

మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, నాయకులు, మార్కెట్ కమిటీ డ్రెరెక్టర్ నాగిళ్ల బాల్ రెడ్డి, బోడిగే ప్రభుగౌడ్, బత్తుల శ్రీకాంత్ యాదవ్, గోపాల్ యాదవ్, లింగం నాయక్, హరినాయి కాలనీవాసులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లర్లకు ఇచ్చిన ధాన్యాన్ని సకాలంలో అందించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ
- రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం

గద్వాల నడిగడ్డ, డిసెంబర్ 20 (జనంసాక్షి) : రైస్ మిల్లర్లకు ఇచ్చిన ధాన్యాన్ని సకాలంలో అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసిలోని అదనపు కలెక్టర్ ఛాంబర్ నందు రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్ 2022-23 సంబంధించిన ధాన్యాన్ని వేలం దార్లకు కి అప్పగించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర నుండి ఫిలిప్పైన్స్ కు ఎగుమతి చేయబడే ధాన్యం ను వేలం వేసిన ధాన్యం నుండి 5% నూకతో బియ్యం ని సివిల్ సప్లై శాఖకు అందజేయాలని అన్నారు. ఖరీఫ్ -2024-25 కు సంబంధించిన సిఎంఆర్‌ను వెంటనే డెలివరీ చేయాలి. ఖరీఫ్-2024-25కు మిల్లర్లు ఇచ్చిన బ్యాంకు గ్యారెంటీ గడువు పూర్తి అయినందున ఇప్పటికీ ఇవ్వనివారు త్వరగా అందజేయాలని ఆయన తెలిపారు.ఈ సమావేశంలో డిఎస్ఓ స్వామి కుమార్, జిల్లా మేనేజర్ విమల, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 20 (జనంసాక్షి) : దివ్యాంగులు అన్ని అవకాశాలు అందిపుచ్చుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ దివ్యాంగులకు సూచించారు. మెదక్ జిల్లా ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక దివ్యాంగ వైద్య శిబిరంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని, దివ్యాంగులకు ఏలాంటి అనారోగ్య సమస్యలైన పరిష్కరించాలని, అనారోగ్యంలో ఉన్నవారికి అన్ని రకాల ఉచిత నాణ్యమైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. జిల్లా ఆస్పత్రిలో దివ్యాంగులకు సరైన వైద్యం అందుబాటులో లేనియెడల చికిత్స నిమిత్తం హైదరాబాదు లాంటి నగరాలకు కూడా పంపిస్తామన్నారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి నెల రెండో మంగళవారం ప్రత్యేక ప్రజావాణి

కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి శ్రీరామ్, జిల్లా ఆస్పత్రి సూపర్డెంట్ శివ దయాల్ , వైద్యులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీలలో రాష్ట్రస్థాయికి ఎంపికైన సెయింట్ మేరీస్ హై స్కూల్ విద్యార్థులు

మిడ్జిల్, డిసెంబర్ 20 (జనంసాక్షి) : సీఎం కప్ క్రీడా పోటీలలో భాగంగా మిడ్జిల్ మండల కేంద్రానికి చెందిన సెయింట్ మేరీస్ హై స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికై ఈనెల 19న జరిగిన కరాటే లో భాగమైన వూషూ క్రీడా పోటీలలో చక్కటి ప్రతిభ కనబరిచారు. అండర్17 బాలికల విభాగంలో ఆలీషా తబాషు ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించి, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక బాగా, మురారి, అంజి వెండి పథకాలు సాధించారు. అండర్14 విభాగంలో నిల్వ నాయక్ సిల్వర్ పథకాన్ని సాధించారు. జిల్లా స్థాయిలో జరిగిన క్రీడా పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికై మిడ్జిల్ సెయింట్ మేరీస్ హై స్కూల్ పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చిన తమ విద్యార్థులను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించి

అభినందించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎంప్రయిల్ జోసెఫ్, డైరెక్టర్ షీనా జోసెఫ్, ప్రిన్సిపల్ లింగం, రవికుమార్ ఉపాధ్యాయులు సతీష్, శ్రీను, దుర్గాభవాని, హేమలత, ప్రవీణ్ కరాటే మాస్టర్ మహమ్మద్ గౌస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల యాప్ సర్వే త్వరగా పూర్తి చేయాలి

- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి బ్యూరో, డిసెంబర్ 20 (జనంసాక్షి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో తప్పులు లేకుండా చూసుకోవాలని, సర్వేను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.శుక్రవారం ఉదయం వనపర్తి లోని బసవన్నగడ్డ, వనపర్తి శివారు రాజానగరం వడ్డెగేరిలో జరుగుచున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఒక్కో సర్వేయర్ రోజుకు కనీసం 25 ఇళ్ళు పూర్తి చేయాలని ఆన్లైన్ లో డేటా నింపేటప్పుడు తప్పులు చేయవద్దని సిబ్బందిని సూచించారు. సర్వే చేసేటప్పుడు కుటుంబ సభ్యుల వివరాలు ఏమైనా తప్పులు ఉంటే సరి చేయాలని చెప్పారు. యాప్ లో ఏమైనా సాంకేతిక సమస్యలు ఉంటే ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ రాజనగరం శివారులోని అమ్మ చెరువు ను పరిశీలించారు. చెరువు కట్టపై ఏర్పాటుచేసిన లైట్లు వినియోగంలో ఉన్నాయా అని మునిసిపల్ కమీషనర్ ను అడిగి తెలుసుకున్నారు. కట్టపై క్లీనింగ్ చేయడంతో పాటు, ఉన్న ఖాళీ స్థలంలో ప్లాంటేషన్ చేయించాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ కు ఆదేశించారు.

ప్రాథమిక పాఠశాల ఆకస్మిక తనిఖీ

వడ్డెగేరిలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు సమయానికి హాజరవుతున్నారా లేదా అని కలెక్టర్ ఆరా తీశారు. పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులకు గాను ఒకరే హాజరు ఉన్నారు. దీంతో ఉపాధ్యాయుల గత నెల రోజుల జియో టాగింగ్ అటెండెన్స్ వివరాలు ఇవ్వాలని ఎంఈఓ కు చెప్పారు. పాఠశాలలో విధులకు హాజరు కాని ప్రధానోపాధ్యాయుడికి షోకాస్ నోటీసు జారీ చేయాలని ఎంఈఓ కు ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈఓ కు సూచించారు.మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, తహసిల్దార్ రమేష్ రెడ్డి, ఇతర అధికారులు, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 20 (జనంసాక్షి) : మైనర్ బాలికను ప్రేమ పేరుతో మభ్యపెట్టి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి అపహరించి లైంగిక దాడికి సంబంధించి పోక్సో చట్టం కింద నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ రంగారెడ్డి జిల్లా కోర్టు ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయమూర్తి శుక్రవారం తీర్పు వెలువరించారు. రంగారెడ్డి జిల్లా వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గుంజా గురుస్వామి(23) బట్టిప్రోలు గ్రామం, గుంటూరు జిల్లా, ఆంధ్ర ప్రదేశ్ వాసికి అండర్ సెక్షన్ 366(ఏ), 376(ఏ) ఐపిసి, సెక్షన్ 4 ఆఫ్ పోక్సో చట్టం వనస్థలిపురం స్టేషన్ ఎస్.సి నెం 114/2018 కేసు నమోదుకాగా, పోలీసులు విచారణ చేశారు.నిందితుడు గుంజా గురుస్వామి (23) దోషిగా తేలడంతో రంగారెడ్డి జిల్లా ఎల్బినగర్ ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయమూర్తి నిందితుడిని శుక్రవారం దోషిగా నిర్ధారించారు. ఈ కేసులో నిందితుడికి పదేళ్ళ కఠిన కారాగార శిక్ష,రూ.12,500 జరిమానా, బాధితురాలికి నష్టపరిహారం కింద 5 లక్షల రూపాయలు అందచేశారు.

నిరుద్యోగులు దళారులను నమ్మొద్దు

నారాయణపేట జిల్లా బ్యూరో, డిసెంబర్ 20 (జనంసాక్షి) : నిరుద్యోగులు మధ్య దళారీలను నమ్మి డబ్బు వృధా చేసుకోరాదని ప్రభుత్వ నిబంధనల ప్రకారమే వైద్య శాఖలో ఉద్యోగాలు వస్తాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారినీ డాక్టర్ సౌభాగ్య లక్ష్మీ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల నారాయణపేట పి. హచ్. సి.ఆసుపత్రిలో ఉద్యోగాల కొరకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయగా కొందరు నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని వారిని ఒకరు 9836330846, 9490673253,8276841598, అనే నంబర్ నుండి ఉద్యోగాలు ఇప్పిస్తానని అజ్ఞాత వ్యక్తి మోసం చేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చింది అన్నారు. నిరుద్యోగులను దారి మళ్లిస్తు డబ్బులు గుంజేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు.ఇలాంటి వారిని నమ్మవద్దని ఆమె సూచించారు.

ప్రాథమిక స్థాయి విద్యార్థులపై దృష్టి పెట్టండి

విద్యార్థులు గ్రంథాలయ పుస్తకాలు చదివేలా చూడాలి

కంకోల్ ప్రాథమిక పాఠశాలలో రూమ్ టు రీడ్

గ్రంథాలయాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్

సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 20 (జనం సాక్షి)

ప్రాథమిక స్థాయి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం కంకోల్ ప్రాథమిక పాఠశాలలో రీడ్ టు రూమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇన్క్లుక్షన్స్ ప్రోగ్రాంలో భాగంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. రిసెప్షన్స్ లో భాగంగా ఒకటవ తరగతి విద్యార్థుల పైన ఉపాధ్యాయులు ఎక్కువగా దృష్టి పెట్టాలని దానితో పాటుగా గ్రంథాలయ పుస్తకాలను కూడా వాడాలని కలెక్టర్ తెలిపారు. గ్రంథాలయం యొక్క ప్రాముఖ్యత వాటి నిర్వహణ గురించి చర్చిస్తూ ప్రతిరోజు పిల్లలు టైం టేబుల్ ప్రకారం గ్రంథాలయ పుస్తకాలను సద్వినియోగం చేసుకోనేలా చూడాలని కలెక్టర్ సూచించారు. లైబ్రరీకి సంబంధించి మెటీరియల్స్ గురించి డీకోటబుల్ బుక్స్ ఒకటవ తరగతి చదువుతున్నవిద్యార్థులకు ఎంతగానోఉపయోగపడతాయన్నారు. పుస్తకాల పంపిణీ, వినియోగం గురించి కలెక్టర్ వివరించారు. చిన్నారులు నాటక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అందించిన డి కోటబుల్ బుక్స్, పేరెంట్స్ క్యాలెండర్ ను కలెక్టర్ వల్లూరు క్రాంతి , డీఈవో వెంకటేశ్వర్లు, ఎంఈఓ భీమ్ సింగ్, ఎంపీడీవో హరి నందన్ రావు ,మండల ప్రత్యేక అధికారి రామాచారి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తుకారం లు ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శైలజ పాఠశాల ఉపాధ్యాయులు సంతోష్ మ్మ, వినోద్, మనిత రాణి, దేవిక, లావణ్య ,రూమ్ టు రీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రవీణ్, తేజస్విని , లిటరసీ ఫెసిలిటేటర్ సంధ్య, విజయశ్రీ ,రవి తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్‌లో పేట జిల్లాను అగ్రస్థానంలో నిలబెట్టాలి

నారాయణపేట స్పోర్ట్స్ కరాటే డు అసోసియేషన్ (క్యూ) జిల్లా అధ్యక్షులు లొట్టి శ్రీను

నారాయణపేట జిల్లా బ్యూరో, (జనం సాక్షి):

నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు లైన్స్ క్లబ్ ఆవరణలోసీఎం కప్ లో భాగంగా జిల్లాస్థాయి కరాటే సెలక్షన్స్ నిర్వహించడం జరిగింది. జిల్లా స్థాయి కరాటే పోటీల సెలక్షన్స్ కు జిల్లా లోని నలుమూలల నుంచి 100 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారాయణపేట స్పోర్ట్స్ కరాటే డు అసోసియేషన్ (క్యూ) జిల్లా అధ్యక్షులు లొట్టి శ్రీను మాట్లాడుతూ ఈనెల 31, జనవరి1,2 తేదీలలో హైదరాబాదులోని యూసుఫ్ గూడా కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో మూడు రోజులపాటు సెలక్షన్స్ ఉంటాయని తెలిపారు. జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో కరటే విద్యార్థులు హాజరై ఉత్తమ ప్రదర్శన ప్రదర్శించి తెలంగాణలోనే నారాయణపేట జిల్లా పేరును మొదటి స్థానంలో నిలపాలని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గ్రామీణ ప్రాంతాలలో ఉండే విద్యార్థిని, విద్యార్థులు వారిలో క్రీడల పట్ల ఉండే ప్రతిభను వెలికి తీయాలని ఉద్దేశంతో సీఎం కప్ ను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను జాతీయ స్థాయికి అలాగే అంతర్జాతీయ స్థాయికి అందించాలని మంచి సంకల్పంతో సీఎం కప్ ఉద్దేశమని తెలియజేశారు. అలాగే కరాటే సెలక్షన్స్ లో భాగంగా విద్యార్థినీ, విద్యార్థులు 12 బంగారు పతకాలు, ఏడు వెండి పథకాలు, ఐదు క్యాంస పథకాలు సాధించారు. వీరిని ఉద్దేశించి జిల్లా డి.వై.ఎస్.ఓ. మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నటువంటి సీఎం కప్పు ఆటల పోటీలలో భాగంలో కరాటే ను కూడా చేర్పించడం. చాలా ఆనందదాయకం అన్నారు. వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో కూడా పథకాలు సాధించి మన నారాయణపేట జిల్లాకు, కరాటే మాస్టర్ లకు మంచి పేరు తీసుకురావాలని కొనియాడారు. అదేవిధంగా ఈ సర్టిఫికెట్స్ విలువైనవని స్పోర్ట్స్ కోటాలో 2% సర్టిఫికెట్స్ పనికొస్తాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మార్వో , మున్సిపల్ కమిషనర్ భోగి శ్వరరావు, మాజీ జెడ్పిటిసి లక్ష్మారెడ్డి, మత్స్యకార జిల్లా అధ్యక్షులు కోళ్ల వెంకటేష్ ,డ్రాగన్ శోటో ఖాన్ కరాటే డు స్పోర్ట్స్ స్టైల్ చీఫ్ సలాం బిన్ ఉమర్, కరాటే జిల్లా కమిటీ కోశాధికారి సయ్యద్ ఇస్మాయిల్, ఉపాధ్యక్షులు సీతారాములు, అమ్రేష్, తిమ్మప్ప అశోక్,కో ఆప్షన్ మెంబర్ శంషుద్దీన్ , రహీం పటేల్ , జాయింట్ సెక్రటరీ ముహమ్మద్ సలీం, ఆరిఫ్, మౌనిక, అంజన్ ప్రసాద్ , నరసింహ, అశోక్ ,వెంకటేష్ ,చాంద్ పాషా కరటే విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వ్యవసాయ భూములపై "రియల్" కన్ను!

ఏజెన్సీ ప్రాంతంలో చట్టాలను ఉల్లంఘిస్తున్న వ్యాపారస్తులు

అధికారుల కనుసనల్లో నడుస్తున్న బడా బాబుల దందా?

జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు స్పందించేనా..?

కామేపల్లి, డిసెంబర్ 20 (జనంసాక్షి):

ఏజెన్సీలో అడుగడుగునా చట్టాల ఉల్లంఘన జరుగుతున్నది. కాపాడాల్సిన అధికారులు రియల్ మాఫియాకు పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తున్నారు. దీంతో ఇక్కడి వ్యవసాయ భూములపై రియల్ ఏస్టేట్ మాఫియా బడా బాబుల కన్నుపడటంతో వారికి రెవెన్యూ, ఐబి అధికారులు యదేచ్ఛగా సహకరిస్తున్నట్టు, వ్యవసాయ భూములు కాస్త ప్లాట్లుగా మారి అమ్మకాలు కొనసాగుతున్నట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వేరే ప్రాంతం రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఏజెన్సీ చట్టాలను తుంగలో తొక్కి నిబంధనలను ఉల్లంఘించి కోట్లాది రూపాయల వ్యాపారం చేస్తున్నారు. కామేపల్లి మండలలోని కొమ్మినేపల్లి గ్రామ పంచాయతీ కొండాయిగూడెం రెవెన్యూలోని సర్వే నెంబర్ 05లో నాలుగు ఎకరాల వ్యవసాయ భూమిని ఎకరం కోటి 30 లక్షలకు మహబూబాబాద్ జిల్లా బయ్యారంకు చెందిన రియల్ వ్యాపారులు కొనుగోలు చేశారు. ఈ భూముల్లో ఉన్న కొబ్బరి చెట్లను ఫారెస్ట్ అధికారుల పర్మిషన్ తీసుకోకుండా నరికించి వ్యర్థాలను పక్కనే ఉన్న చాకిరాయి కుంట చెరువులో పోశారు. ఇంత జరిగిన కనీసం స్పందించాల్సిన ఐబి అధికారులు ఆ వ్యాపారులకు జీ హూజూర్ అంటున్నారే తప్ప ఇప్పటివరకు చిన్న నోటీస్ కూడా ఇవ్వలేదు. ఈ భూమిని చదును చేసి వేరే ప్రాంత (గిరిజనేతరులు) రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లుగా మార్చి యదేచ్ఛగా అమ్మకాలు కొనసాగిస్తున్నారు. ఏజెన్సీలో వ్యవసాయ భూమిని ప్లాట్లుగా మార్చాలంటే ఆ భూమిని కమర్షియల్‌గా మార్చాలి. ప్లాట్లను కేవలం గిరిజనులకే అమ్మాల్సి ఉంటుంది కానీ అలా జరగటం లేదు. ఇది తెలుసుకున్న లంబాడీ హక్కుల పోరాట సమితి నేతలు బాదావత్ నరేష్ నాయక్ ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆలస్యంగా స్పందించిన రెవెన్యూ అధికారులు వ్యవసాయ భూమి యజమానితో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారులను తమ కార్యాలయానికి పిలిపించుకొని వారితో తహసిల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుదీర్ఘంగా మంతనాలు జరిపి భూ యజమానికి వారు సలహా ఇచ్చి ఆ భూమిని తాను ఎవరికి అమ్మలేదని దరఖాస్తు రాయించుకొని చేతులు దులుపుకున్నారు. ఇందులో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కీలకంగా వ్యవహరించి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కొమ్ముకాస్తునట్లు తెలుస్తుంది. ఈ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గత చరిత్ర అంతా అవినీతిమయంగా మారింది. ఇప్పటికే తాను పనిచేసిన ప్రాంతాలలో అవినీతి ఆరోపణలపై రెండుసార్లు సస్పెండ్ అయిన తన వ్యవహారశైలి మార్చుకోకుండా డబ్బులు వచ్చే అన్ని వ్యవహారాల్లో ముందుండి తల దూరుస్తూ తనపై అధికారులను కూడా తప్పుదోవ పట్టిస్తాడని కార్యాలయం ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ఇలాంటి రెవిన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల రాష్ట్ర ప్రభుత్వం ఖజానాకు రావలసిన ఆదాయం గండికొట్టినట్లు అయ్యింది. ఇలాంటి అధికారులపై న్యాయ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎల్‌హెచ్‌పిఎస్ ఇల్లందు నియోజకవర్గ అధ్యక్షులు బాదావత్ నరేష్ డిమాండ్ చేశారు. లేకుంటే ప్రత్యక్ష ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ ఐటీడీఏ పీవో స్పందించాలని ఆయన కోరారు. దీనిపై స్థానిక తహసిల్దార్ సుధాకర్‌ను వివరణ కోరగా తమకు విషయం తెలియగానే కొండాయి గూడెం రెవెన్యూ పరిధిలోని సంబంధిత రైతును పిలిపించి వివరణ కోరామని తాను తన భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎవరికి అమ్మలేదని లిఖితపూర్వకంగా తమకు రాసిచ్చాడని తెలిపారు. తమ కార్యాలయానికి రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎవరు వచ్చి తమను కలవలేదని వెల్లడిరచారు సంబంధిత రైతు నిబంధనల విరుద్ధంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులకు నమ్మితే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఫ్యాషన్ టెక్నాలజీ విద్యతో ప్లేస్మెంట్స్ అవకాశాలు

వరంగల్ ఈస్ట్, డిసెంబర్ 20 (జనం సాక్షి)

ఫ్యాషన్ టెక్నాలజీ విద్య ద్వారా ప్లేస్మెంట్స్ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ప్రొఫెసర్ శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు వరంగల్ ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ అనేది భారత ప్రభుత్వ టెక్స్టైల్స్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఐఐటీలు మరియు ఐఐఎంల వంటి భారత పార్లమెంట్ చట్ట ప్రకారం ఏర్పాటు చేయబడిన ఒక ప్రధాన సంస్థ అని తెలిపారు. దీని కారణంగా సొంత ఐఐటి లు ఐఐఎంలు వంటి డిగ్రీలను ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. ఇది డిజైన్ మేనేజ్మెంట్ మరియు టెక్నాలజీ యొక్క ప్రీమియర్ ఇన్స్టిట్యూట్ గా ఉద్భవించినట్లు వివరించారు. అభివృద్ధి చెందుతున్న ప్రపంచ దృష్టాంతంలో ఫ్యాషన్ వ్యాపారంలో నాయకత్వ స్థానాలను చేపట్టడానికి నిపుణులను అభివృద్ధి చేస్తుందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా నిఫ్ట 19 వృత్తిపరంగా నిర్వహించబడే కేంద్రాల నెట్వర్క్ ను కలిగి ఉన్నట్లు చెప్పారు. ఈ ఫ్యాషన్ టెక్నాలజీ హైదరాబాద్ లో జూలై 2025 నుండి విద్యా సంవత్సరానికి కావలసిన అడ్మిషన్లను ప్రారంభించనున్నట్లు శ్రీనివాస్ వివరించారు. అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులకు ఫ్యాషన్ డిజైన్ టెక్స్టైల్స్ డిజైన్ నీట్ వేర్ డిజైన్, లెదర్ డిజైన, ఫ్యాషన్ కమ్యూనికేషన్, ఫ్యాషన్ టెక్నాలజీ వంటి డిజైన్, స్ట్రీమ్ లు అర్హులుగా పేర్కొన్నారు. ఆన్లైన్ ద్వారా రిజిస్ట్రేషన్స్ గత నవంబర్ 20 నుండి ప్రారంభమై అయినయని చివరి తేదీ 6 జనవరి 2025 గా తెలియజేశారు. 5000 అదనపు ఫీజు తో జనవరి 7 నుండి 9 వరకు ఉన్నట్లు వివరించారు. వ్రాత పరీక్ష ఫిబ్రవరి 9వ తారీకు ఉంటుందని సిచువేషన్ టెస్ట్ ఏప్రిల్ లో ఉంటుందని డిక్లరేషన్ ఆఫ్ ఫైనల్ రిజల్ట్ కూడా ఏప్రిల్ లోనే ఉంటుందని సీట్ అలాట్మెంట్ కూడా మే జూన్లలో 2025 సంవత్సరంలో ఉంటున్నట్లు వివరించారు. ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో డాక్టర్ చక్రపాణి, నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన ట్యుటీ ఇప్పించడానికి కృషి చేస్తాం

ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు సీతారామయ్య

రామకృష్ణాపూర్, డిసెంబర్ 20 (జనంసాక్షి):

పదవ వేజ్ బోర్డు లో దిగిపోయిన సింగరేణి కార్మికులకు పెరిగినటువంటి గ్రాడ్యూటిని ఇప్పించడానికి కృషి చేస్తామని ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి సీతారామయ్య హామీ ఇచ్చారు. మందమర్రి ఏరియా రామకృష్ణాపూర్ సింగరేణి కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేసిన విశ్రాంత ఉద్యోగుల ప్రత్యేక సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ప్రతి కార్మికుడు ఎలాంటి సమస్యలను ఎదుర్కొంటున్న వెంటనే తమ యూనియన్ దృష్టికి తీసుకువస్తే యాజమాన్యంతో చర్చించి సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అందుకొరకు ప్రతి వార్డులో కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే సింగరేణిలో కూడా పెన్షన్లను పెంచే విధంగా కృషి చేస్తామని తెలిపారు. రిటైర్డ్ అయినా కార్మికులతో పాటు గోల్డెన్ సెకండ్ ద్వారా దిగిపోయిన కార్మికులు కూడా ఆరోగ్య భీమా పథకం కొరకు సిపిఆర్ఎంఎస్ కార్డు పొందడానికి వచ్చే సంవత్సరం మార్చి వరకు అవకాశం ఉందన్నారు.

కార్డు ద్వారా 40 వేలు రూపాయలు యాజమాన్యానికి చెల్లిస్తే 8 లక్షల రూపాయల వరకు ఆరోగ్య బీమా వర్తిస్తుందని పేర్కొన్నారు. రిటైర్డ్ కార్మికులకు ఖాళీ క్వార్టర్లను కేటాయించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ సెంట్రల్ సెక్రటరీ అక్బర్ అలీ, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు ఇప్పకాయల లింగయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్, రిటైర్డ్ కార్మికులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం సీజ్ కేసు నమోదు

11 క్వింటాళ్ల 50 కిలోలు బియ్యం పట్టివేత

గాంధారి డిసెంబర్ 20 జనం సాక్షి

ప్రభుత్వం పేదలకు ఇస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వచేసి ఇతర రాష్ట్రాలకు అమ్ముతున్న వారిపై గాంధారి సబ్ ఇన్స్పెక్టర్ బి.ఆంజనేయులు నిఘా పెంచి గాంధారి మండలం పోతంగల్ కలాన్ కమాన్ ముందు ఆకస్మిక తనిఖీలు చేస్తుండగా బాన్సువాడ చెందిన అబ్దుల్ రహీం శుక్రవారం ఉదయం బొలెరో వాహనంలో 11:30 క్వింటాళ్ల పిడిఎస్ రైస్ బియ్యం బొలెరో వాహనం నెంబర్ %TS17 U% 0993 గల దానిలో అక్రమంగా తరలిస్తుండగా గాంధారి ఎస్ఐ పట్టుకుని బొలెరో వాహనాన్ని దానిలో ఉన్న పీడీఎస్ రేషన్ బియ్యం ని,బొలెరో వాహనాన్ని పోలీస్ స్టేషన్ తీసుకువచ్చి కేసు నమోదు చేసి, సంబంధిత అధికారులకు పీడీఎస్ రేషన్ బియ్యం అప్పగించినారు, ఈ సందర్భంగా ఎస్ఐ మండలం లో ఎవరైనా ప్రభుత్వం ఇచ్చిన ఉచిత బియ్యాన్ని అక్రమంగా తరలించినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో అసాంఘిక చర్యలకు ఎవరైనా పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నగరంలో మహిళా సాధికారిత సాధించేందుకు కృషి

జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి

హైదరాబాద్, డిసెంబర్ 20 (జనంసాక్షి)

నగరంలో మహిళా సాధికారిత సాధించేందుకు అధికారులు కృషి చేయాలని కమీషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. శుక్రవారం తన ఛాంబర్ లో ఎస్టేట్, అర్బన్ కమ్యూనిటీ విభాగం అడిషనల్ కమిషనర్లు, ప్రాజెక్టు అధికారులతో పాటు జోనల్ పిఓ లు, అసిస్టెంట్ ఎస్టేట్ అధికారులతో ఆ శాఖల ప్రగతి పై కమీషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ... మహిళా సాధికారత సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కోటి మహిళలను కోటేశ్వర్లను చేయాలనే లక్ష్యంతో ఉన్నందున నగరంలో అర్హులైన మహిళలను స్వయం సహాయక సంఘాలలో చేర్పించి వారికి బ్యాంక్ లింకేజి ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించేందుకు కృషి చేయాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో అర్హులైన మహిళలందరిని స్వయం సహాయక సంఘాల గ్రూప్ లో సభ్యులుగా చేర్చి ఆర్థిక సాధికారత కు దోహద పడే విధంగా కృషి చేయాలని కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు.

జిహెచ్ఎంసీ ఆస్తులను కంప్యూటరైజ్ చేయాలి: కమిషనర్

నగర వ్యాప్తంగా ఉన్న జిహెచ్ఎంసి ఆస్తులకు సంబంధించిన రిజిస్ట్రార్ ఏర్పాటుచేసి దాని ప్రకారం గా కంప్యూటరైజ్ చేయాలని జిహెచ్ఎంసి కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఆస్తులకు సంబంధించిన లీజు పూర్తయిన, ఇంకా కొనసాగుతున్నట్లు వివరాలను సేకరించి వారందరికీ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఆస్తులు కంప్యూటర్ లో నే ప్రజలకు పూర్తి వివరాలు తెలియాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కమీషనర్ సి. చంద్రకాంత్ రెడ్డి, యు సి డీ ప్రాజెక్టు డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.సురేష్ కుమార్, 30 సర్కిళ్ల ప్రాజెక్ట్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

మహదేవపూర్ డిసెంబర్ 20(జనం సాక్షి)

మండలంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పర్యటించి శుక్రవారం రోజున కాళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ నిర్వహించారు. వైద్యులు అందుబాటులో ఉండి రోగులకు సేవలు అందించాలని డాక్టర్ తో పాటు వైద్య సిబ్బందికి సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఓపి రిజిస్టర్ ను తనిఖీ చేసి ఇన్ పేషెంట్ వార్డు డ్రగ్ స్టోర్లను పరిశీలించి వైద్యులను ఆస్పత్రి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య సిబ్బంది రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సమయపాలన పాటిస్తూ నిత్యం అందుబాటులో ఉండి రోగులకు సేవలు అందించాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పైకప్పు లీకేజీ అవుతుందని మరమ్మతులు చేపించాలని సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం మాదాపూర్ ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మాయం సింగ్. నాయబ్ తాసిల్దార్ కృష్ణ. ఎంపీడీవో వెంకటేశ్వర్లు డాక్టర్ సుస్మిత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరిత. ఉన్నారు

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
21 డిసెంబర్ 2024

పైలెట్ పద్ధతిన గ్రామీణ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తాం

- ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా సోలార్ బ్యాటరిలాతో
- రినివబుల్ ఎనర్జీ ఉత్పత్తి

మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి

నల్గొండ బ్యూరో, డిసెంబర్ 20 (జనంసాక్షి) : రాష్ట్రంలోనే మొదటి సారిగా పైలెట్ పద్ధతిన గ్రామీణ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఉద్దేశించి ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా సోలార్ బ్యాటరీలతో రినివబుల్ ఎనర్జీ ఉత్పత్తి చేసేందుకు నల్గొండ జిల్లా, కట్టంగూరు మండలం, ఐటి పాముల గ్రామానికి చెందిన 50 మంది స్వయం సహాయక సంఘాల మహిళలతో సోలార్ పవర్ బ్యాటరీలు ఏర్పాటు చేయిస్తున్నట్లు రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. శుక్రవారం అయన నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఉదయాదిత్య భవన్లో నల్గొండ జిల్లా,కట్టంగూరు మండలం,ఐటిపాములకు చెందిన 50 మంది స్వయం సహాయక సంఘాలలోని మహిళలకు ఇందిరా మహిళ స్వశక్తి కింద ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ఒక్కొక్కరికి లక్ష రూపాయల విలువ చేసే సోలార్ బ్యాటరీల ఏర్పాటు కు 50 మందికి,50 లక్షల రూపాయల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఈ కార్యక్రమం బాగా ఉపయోగపడుతుందని, దీనికోసం ప్రత్యేకించి మహిళలు పనిచేయాల్సిన అవసరం లేదని, వారి పని వారు చేసుకుంటూనే నెలకు అదనంగా ఆదాయం పొందవచ్చన్నారు.భూమి లేని నిరుపేదలు కుటుంబాలకు తోడుగా ఉండేందుకు నెలకు 3 నుండి 4 వేల రూపాయల ఆదాయం వచ్చే విధంగా స్వబ్యాగ్స్ ల్యాబ్స హకారంతో సోలార్ బ్యాటరీ ఎనర్జీ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ఇలాంటి కార్యక్రమాన్నీ నల్గొండ జిల్లాలో చేపట్టడం జరిగిందని,ఈ కార్యక్రమం ద్వారా కుటుంబాలకు చేదోడు, వాదోడుగా మహిళలు నిలుస్తారని,అంతేకాక ఆర్థికంగా బలపడతారని తెలిపారు.మహిళలు ఈ సోలార్ బ్యాటరీల ఏర్పాటు వల్ల ఎలాంటి అదనపు పని చేయాల్సిన అవసరం లేదని, వారి పని వారు చూసుకుంటూనే ఈ బ్యాటరీ ద్వారా ఆదాయం పొంద పొందవచ్చు అని తెలిపారు. స్వభాగ్స్ ల్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్ ఖాళీ బ్యాటరీలను ఇంటిదగ్గర ఉంచి వెళ్ళడం జరుగుతుందని, బ్యాటరీఛార్జింగ్‌తో నిండిన తర్వాత వారే వచ్చి తీసుకువెళ్తారని,ఒక యూనిట్ పవర్ ను 16 రూపాయలకు స్వ బ్యాగ్స్ ల్యాబ్ కంపనినే తీసుకుంటుందని, ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. సత్య సోలార్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ జక్కుల సత్యనారాయణ మాట్లాడుతూ సోలార్ ఎనర్జీకి చాలా భవిష్యత్తు ఉందని,2016లో సోలార్ ఎనర్జీ పై అంతా అవగాహన ఉండేది కాదని,ఇప్పుడు ప్రతి జిల్లాలో 50 వరకు సోలార్ ఎనర్జీ యూనిట్లు పనిచేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్,జిల్లా పరిశ్రమల మేనేజర్ కోటేశ్వరరావు,గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్,ఆర్ డి ఓ అశోక్ రెడ్డి,శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలి

- ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలి
- జిల్లా ఎస్పీ డి. ఉదయ్ కుమార్ రెడ్డి

మెదక్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 20 (జనంసాక్షి) : ప్లాన్ ఆఫ్ యాక్షన్ తో పనిచేయాలి. ప్రతి గ్రామాల్లో సిసి కేమేరాల సంఖ్య పెంచాలి. సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలి. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలి. నేరాలు తగ్గేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలి" అని జిల్లా ఎస్.పి .డి.ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్.పి . డి. ఉదయ్ కుమార్ రెడ్డి జిల్లా సిబ్బందితో నేర సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పెండింగ్ ఉన్న (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి డి. ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతు.. జిల్లాలో తమ తమ పోలీస్ స్టేషన్ పరిదిలలో కల గ్రామాలను పోలీస్ అధికారులు సందర్శించాలని ట్రబుల్ మాంగర్స్ మరియు తరచుగా తగాదాలకు, నేరాలకు పాల్పడేవారి పై నిఘా ఉంచాలని గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ఏ విధంగా ఇన్వెస్టిగేషన్ చెయ్యాలి ఏ ఏ అంశాలు కోడికరించాలి తదితర అంశాల గురించి వివరించారు. ప్లాన్ ఆఫ్ యాక్షన్ తో పని చేసి జిల్లాకు మంచి పేరు తేవాలని అన్నారు. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలి. పూర్తి పారదర్శకంగా కేసులో ఇన్వెస్టిగేషన్ చేయాలి. కేసు నమోదు నుండి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్నికూలంకుషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలి. ఫోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలి. ప్రతి అధికారికి పూర్తి ఇన్వెస్టిగేషన్, స్టేషన్ మేనేజ్మెంట్ తెలిసి ఉండాలని సూచించారు. లాంగ్ పెండింగ్ కేసులు,గుర్తుతెలియని మృతదేహాల కేసులు త్వరగా చేదించాలి, కేసుల చేదనలో అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించాలి, ఛాలెంజ్ గా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలి, సైబర్ నేరాల నియంత్రణ గురించి తెలియచేస్తూ ఎవరయినా సైబర్ నేరానికి గురి అయినట్లు అయితే వెంటనే సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ అయిన 1930 కాల్ చేయాలని అన్నారు. అలాగే సిసి కెమెరాల ఆవశ్యకత గురించి గ్రామాలలో పట్టణాలలోఆయా గ్రామాల పోలీస్ అధికారులు సిబ్బంది ప్రోయాక్టివ్ పోలీస్ సింగ్ విధులు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ . ఎస్. మహేందర్ ,మెదక్ డి.ఎస్.పి. ప్రసన్న కుమార్ , సైబర్ క్రైమ్ డి.ఎస్.పి. సుభాష్ చంద్ర బోస్, జిల్లా సిఐ లు ఎస్. ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

మైనర్ బాలిక కిడ్నాప్, రేప్ హత్యాయత్నం కేసులో ఇద్దరు నేరస్తులకు జీవితఖైదు

రాజేంద్రనగర్, డిసెంబర్ 20 (జనంసాక్షి) : మైనర్ బాలికను కిడ్నాప్ చేసి రేప్ హత్యాయత్నం చేసిన కేసులో నేరస్థులకు న్యాయస్థానం జీవిత ఖైదు, జరిమానా విధించింది. అత్తాపూర్ ఇన్స్పెక్టర్ వెంకట్రామిరెడ్డి తెలిపిన విరాల ప్రకారం తేదీ: 22.01.2020 నాడు అప్పటి రాజేంద్రనగర్ పి.యస్ (ప్రస్తుత అత్తాపూర్ పి.యస్) పరిధిలోని ఆరాంఘర్ ఏరియాలో ఒక మైనర్ బాలికను కిడ్నాప్ చేసి బాలిక పైన హత్యాచారం చేసి ఆమెను చంపాలని ప్రయత్నించినందుకు న్యాయమూర్తి ఆంజనేయులు నేరస్తులు ఎ1 షేక్ జాఫర్ , షేక్ నయిం లకు ఇద్దరికీ జీవిత ఖైదు, ఒక్కొక్కరికి రూ.16,000 చొప్పున కోర్టు జరిమానా విధించింది. ఇట్టి నేర విచారణలో భాగమైన పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి. వెంకటేశ్వర రెడ్డి, పరిశోధన అధికారి అశోక్ చక్రవర్తి, ఏసీపీలను , కోర్టు డ్యూటీ అధికారులను ఉన్నత అధికారులు అభినందించారు.

బైక్ నుంచి కిందపడి యువతి మృతి

ఒకరికి స్వల్ప గాయాలు

చారకొండ, డిసెంబరు 20 (జనంసాక్షి) : బైక్ నుంచి కిందపడి ఓ యువతి మృతి, ఓ యువకుడు గాయాలయిన సంఘటన చారకొండ మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ శంఘుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి జిల్లా వలిగొండ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన వెలకుర్తి హర్షవర్ధన్ చారి, నల్గొండ జిల్లా నార్కట్ పల్లికి చెందిన పెరమోల పావని (22)లు శుక్రవారం ఉదయం నార్కట్ పల్లి నుంచి ఇద్దరు కలిసి బైక్ పై జడ్చర్లకు వెళ్లి తిరిగి నార్కట్ పల్లికి వస్తుండగా మండలంలోని సారంబండతండా సమీపంలో జడ్చర్ల– కోదాడ జాతీయ రాహదారిపై మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి పక్కనే ఉన్న ర్యాంపునకు ఢీకొట్టడంతో పావని అక్కడికక్కడే మృతి చెందింది. హర్షవర్ధన్ చారికి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో వెంటనే అంబులెన్సు సంఘటన స్థలానికి చేరుకుని ఇద్దరిని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ శంఘుద్దీన్ తెలిపారు. ఎస్ఐ వెంట హెడ్ కానిస్టేబుల్ వెంకటరెడ్డి ఉన్నారు.

సరిహద్దు వివాదంపై త్వరలోనే చర్యలు

- జిల్లా జాయింట్ కలెక్టర్ లక్ష్మినారాయణ

రాజోలి, డిసెంబర్ 20 (జనంసాక్షి) : గత కొంతకాలంగా ఏపీ, తెలంగాణ సరిహద్దు వివాదం కొనసాగుతుంది. రాజోలి మండలంలోని తూర్పు గార్లపాడు ఇసుక రీచ్ దగ్గర సరిహద్దుపై శుక్రవారం జోగులాంబ గద్వాల జిల్లా జాయింట్ కలెక్టర్ లక్ష్మి నారాయణ, జిల్లా డిఎస్పీ సత్యనారాయణ నది సరిహద్దు ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. త్వరలోనే జిల్లా అధికారుల ఆదేశాల మేరకు జాయింట్ సర్వే చేసే విధంగా చర్యలు తీసుకుంటామని, నది మధ్యలో రెండు రాష్ట్రాల సరిహద్దులను ఏర్పాటు చేసి, బౌండరీ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అంతవరకు సరిహద్దు వరకు ట్రాక్టర్లు వెళ్ళవద్దని ట్రాక్టర్ యజమానులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనింగ్ అధికారి రమణ, సీఐ టాటాబాబు, తహసీల్దార్ రామ్మోహన్, రాజోలి రాజోలి ఎస్ఐ జగదీశ్వర్, మైనింగ్ సిబ్బంది విజయ్, బ్రాహ్మానందం, రవి తదితరులు పాల్గొన్నారు.

కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి వర్ధంతి

- నివాళులర్పించిన మంత్రి వెంకట్ రెడ్డి

చిట్యాల, డిసెంబర్ 20 (జనంసాక్షి) : రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తనయుడు కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి 13 వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రానికి వెళ్తున్న మంత్రి మార్గమధ్యలో చిట్యాల కనకదుర్గ కూడలిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొని ప్రతీక్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసిన అర్పించి వెళ్ళడం జరిగింది. అనంతరం పార్లమెంట్ లో బిఆర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని మున్సిపాలిటీ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు పోకల దేవదాసులు డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత పై అవమానకర రీతిలో రాజ్యాంగ పదవిలో ఉండి వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని హోం మంత్రి పదవికి తక్షణమే రాజీనామా చేసి క్షమాపణలు చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ పందిరి శ్రీనివాసులు, మాజీ జెడ్పిటిసి యాదయ్య, కౌన్సిలర్లు కోనేటి కృష్ణ, రెముడాల లింగస్వామి, బెల్లి సత్తయ్య, నాయకులు వనమా వెంకటేశ్వర్లు,పందిరి రమేష్, జిట్టా చంద్రకాంత్, ముబీన్, బట్టు ఐలేష్, కట్టగురి మల్లేష్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు పద్ధతిలో వైద్యాధికారుల పోస్టుల భర్తీ

- భద్రాచలం ఐటిడిఏ పిఓ బి రాహుల్

భద్రాచలం, డిసెంబర్ 20 (జనంసాక్షి) : వైద్య ఆరోగ్య విభాగం, జాతీయ ఆరోగ్య మిషన్ నందు ఆళ్లపల్లి, దమ్మపేట మాతా శిశు ఆరోగ్య, ఎపిడమిక్ బృందంలో వైద్యాధికారి ఖాళీలను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయుటకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు ఐటిడిఏ పిఓ బి. రాహుల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంబిబిఎస్, పట్టభద్రులై, మెడికల్ కౌన్సిల్ లో నమోదు చేసుకొని ఉండాలని, అభ్యర్థి వయస్సు 31 జూలై 2024 నాటికి 44 సంవత్సరాల లోపు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని పిఓ పేర్కొన్నారు. ఏజెన్సీ ఏరియా గిరిజన అభ్యర్థులకు, గతంలో గిరిజన ప్రాంతంలో పనిచేసిన అనుభవం గల వారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందని నియామకం ఒక ఏడాది కాంట్రాక్టు పద్ధతి పై తీసుకోవడం జరుగుతుందని అన్నారు. వైద్యాధికారి నెలసరి వేతనం రూ. 52వేలు ఉంటుందని 23 సంవత్సరాల నుండి 44 ఏళ్ల లోపు వయసు ఉండాలని, చర్ల, ఆళ్లపల్లి మండలాల్లో పనిచేయవలసి ఉంటుందని అన్నారు. కావున అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు తమ జిరాక్స్ సర్టిఫికెట్ తో జతపరిచిన దరఖాస్తులను ఈ నెల 20 నుండి 27 సాయంత్రం 5 గంటలలోపు ఐటీడీఏ భద్రాచలం ప్రాంగణంలో గల అదనపు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని కోరారు.

శాంటా మారియా విద్యార్థులకు బెస్ట్ డెలిగేషన్ అవార్డ్

హైదరాబాద్, డిసెంబర్ 20 (జనంసాక్షి) : శాంటా మారియా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు మలేషియాలోని కౌలాలంపూర్‌లో టెన్‌బీ ఇంటర్నేషనల్ స్కూల్, సెటియా ఎకో పార్క్‌లో నిర్వహించిన మొదటి ప్రత్యక్ష ఇంటర్నేషనల్ స్కూల్స్ పార్టనర్‌షిప్ మోడల్ యునైటెడ్ నేషన్స్ (ఐఎస్పీ ఎంయూఎన్) లో ప్రతిష్ఠాత్మకమైన బెస్ట్ డెలిగేషన్ అవార్డ్ గెలుచుకున్నారు. ఈ గ్రాండ్ ఈవెంట్‌కు డెబ్బైకి పైగా ఇంటర్నేషనల్ స్కూల్స్ పార్టనర్‌షిప్ స్కూళ్లకు చెందిన 250 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఐదు రోజుల ఈ ఈవెంట్‌లో సాంస్కృతిక మార్పిడి, ఆలోచనాత్మక సహకారం, చర్చలు జరిగాయి. ప్రస్తుతం ప్రపంచంలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు తమ ప్రతిభను ప్రదర్శించారు. విమర్శనాత్మక ఆలోచన, నాయకత్వం, దౌత్య కళలను మెరుగుపరచుకుని 21వ శతాబ్దానికి అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకున్నారు.శాంటా మారియా నుంచి హర్నిధ్, అరిప్రా, సుజయ పాల్గొన్నారు. ఉపాధ్యాయ మెంటర్స్ డాక్టర్ రోసిటా జోసఫ్ (ఐఎస్పీ ఎంయూఎన్ ప్రోగ్రాం ఇన్‌ఛార్జ్), నీరజ్ శంకర్ (డిపార్ట్మెంట్ లీడ్, లాంగ్వేజెస్) మార్గదర్శకత్వం వహించారు. విద్యార్థులు అద్భుతమైన స్కిల్స్ ప్రదర్శించారు. బెస్ట్ డెలిగేషన్ అవార్డు అందుకున్నారు. ఈ అవార్డుతో పాటు వ్యక్తిగత విభాగాల్లో కూడా అత్యద్భుత విజయాలు సాధించారు.

గెలుపు ఓటములు సహజం

- ఓటమి విజయానికి నాంది పలకాలి
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

నల్లగొండ బ్యూరో, డిసెంబర్ 20 (జనంసాక్షి) : క్రీడలలో గెలుపు, ఓటములు సహజమని,ఓటమి విజయానికి నాంది కావాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్ఫూర్తినిచ్చారు.నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానంలో గత 20 రోజులుగా నిర్వహిస్తున్న ఎన్ పి ఎల్ క్రికెట్ మ్యాచ్ ముగింపు సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.మనిషి అనుకుంటే సాధించలేనిది ఏదీ లేదని,అందువల్ల ప్రతి ఒక్కరు బాగా కష్టపడి పని చేసి పైకి రావాలని పిలుపునిచ్చారు.ఎన్ జి కళాశాల మైదానాన్ని భవిష్యత్తులో అందరికీ అనుకూలంగా ఉండే విధంగా తీర్చిదిద్దుతామని చెప్పారు.జిల్లా అభివృద్ధి లో భాగంగా ఎస్ఎల్ బిసికి 4000 కోట్ల రూపాయలను మంజూరు చేయించి టన్నెల్ తవ్వే మిషన్ బేరింగ్ ను అమెరికా నుండి తెప్పిస్తున్నామని,రెండు మూడు నెలల్లో బ్రాహ్మణ వెల్లేముల ప్రాజెక్టు ద్వారానీళ్లు నింపి నల్గొండ పట్టణం సమీపంలోని చర్లపల్లి వరకు మీరు ఇస్తామని తెలిపారు.ఎం జి యూనివర్సిటీలో రెండు కొత్త బ్లాక్‌లు నిర్మిస్తున్నామని, ఐటి టవర్లో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని, లతీఫ్ సాబ్ గుట్టను107 కోట్ల రూపాయలతో టూరిజం కేంద్రంగా మార్చేందుకు టెండర్లు పిలవడం జరిగిందని, రాబోయే నాలుగేళ్లలో నల్గొండను బంగారు కొండగా చేస్తానని తెలిపారు. జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవార్ మాట్లాడుతూ క్రీడలు మనిషి జీవితంలో అతి ముఖ్యమని, ఓడినవారు,గెలిచినవారిని స్ఫూర్తిగా తీసుకొని ఆటలాడాలని పిలుపునిచ్చారు.జిల్లాలో డ్రగ్స్ నిర్మూలనలో భాగంగా మిషన్ పరివర్తన తీసుకురావడం జరిగిందని,దీనికి అందరు సహకరించాలని కోరారు. అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, గుమ్మలమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు వారు అందుబాటులో ఉండాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ బ్యూరో, డిసెంబర్ 20 (జనంసాక్షి) : ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారు సర్వే బృందాలు వచ్చినప్పుడు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. ఈ నెల 31 వరకు ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వే నిర్వహించడం జరుగుతుందని,అందువల్ల ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ సందర్భంగా దరఖాస్తు చేసుకున్న ప్రతి దరఖాస్తుదారు సర్వే బృందాలకు అందుబాటులో ఉండి వారి ఫోటోతో సహా ఇంటికి సంబంధించిన డాక్యుమెంట్లు,ఇతర వివరాలను సమర్పించాలని కోరారు.ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలనపై శుక్రవారం ఆమె జిల్లా,మండల స్థాయి అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.సర్వే నిర్వహించే సమయంలో ఎవరైనా దరఖాస్తుదారు ఇతర ప్రాంతానికి వలస వెళ్లినట్లయితే వాట్సాప్ ద్వారా సమాచారాన్ని తెలియజేసి అందుకు సంబంధించిన రుజువును సర్వే బృందాలు వారి దగ్గర ఉంచుకోవాలని తెలిపారు.ఈ నెల 31లోగా సర్వే పూర్తి చేయడం జరుగుతుందని అందువల్ల దరఖాస్తుదారులు సర్వే బృందాలకు సహకరించి వారి పూర్తి వివరాలు, ఫోటోలు ఇవ్వాలన్నారు. అన్నీ గ్రామాలు, మున్సిపాలిటీలలో మరోసారి అవగాహన కల్పించాలని ఆదేశించారు.సర్వే పూర్తి అయ్యేవరకు గ్రామపంచాయతీ కార్యదర్శులకు ఎలాంటి సెలవులు మంజూరు చేయవద్దని,ముఖ్యంగా అత్యవసరమై అనారోగ్యం పాలైనప్పుడు మాత్రమే ముందస్తు అనుమతితో సెలవు మంజూరు చేయాలని చెప్పారు.అదనపు కలెక్టర్ జే .శ్రీనివాస్,మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి, చందూరు ఆర్డీవో శ్రీదేవి,గృహ నిర్మాణ పి డి రాజ్ కుమార్, తదితరులు ఈ టెలి కాన్ఫరెన్స్ లో మాట్లాడారు.

అమిత్ షాకు హోంమంత్రిగా అర్హత లేదు

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మూడో మహాసభల్లో

సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

ఖమ్మం, డిసెంబర్ 20 (జనంసాక్షి) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ను పార్లమెంట్ సాక్షిగా అవమానించేలా మాట్లాడిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు ఆ పదవిలో కొనసాగే అర్హత లేదని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. తక్షణమే హోం మంత్రిగా అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కమ్యూనిస్టులు లేకపోతే ఈ దేశానికి భవిష్యత్తు ఉండదన్నారు. మతోన్మాద ఫాసిస్ట్ బీజేపీని తిప్పికొట్టేందుకే కాంగ్రెస్‌తో కలిసి ఇండియా కూటమిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇల్లెందు? 24 ఏరియా సింగరేణి కమ్యూనిటీ హాల్ లో శుక్ర, శనివారాలు నిర్వహించే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీపీఐ (ఎం) మూడో మహాసభల్లో తమ్మినేని ప్రారంభోపన్యాసం చేశారు. ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసే ఒకే ఎన్నిక విధానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హామీలు ఏమయ్యాయి రేవంత్..?

గత కేసీఆర్ ప్రభుత్వం కౌలుదారులను గుర్తించలేదు, కుటుంబ పాలన, నియంతృత్వ పోకడ, ఎమ్మెల్యేల కొనుగోళ్ల కారణంగా ప్రజలు ఆ పార్టీని ఓడించి కాంగ్రెస్ కు అధికారం ఇచ్చారని తమ్మినేని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఆరు గ్యారంటీలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. ఈ మహాసభలకు పరిశీలకులుగా సీపీఐ (ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి. వెంకట్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర పరిశీలకులు బండారు రవికుమార్, సీనియర్ నాయకులు మీడియం బాబూరావు, కొండపల్లి పావన్, రాష్ట్ర కమిటీ సభ్యులు మాచర్ల భారతి, యర్రా శ్రీకాంత్, నాయకులు ఆనందాచారి, మూడ్ శోభన్, పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదినేని రమేష్, భూక్యా వీరభద్రం, యర్రా శ్రీనివాసరావు, భద్రాద్రి జిల్లా నాయకులు కారం పుల్లయ్య, ఎ. బ్రహ్మచారి, బి. నర్సారెడ్డి, ఎస్ నబీ, ఎం. జ్యోతి, సత్యనారాయణ పాల్గొన్నారు.

వారంతా కొత్త ఫాస్ట్‌ట్యాగ్ తీసుకోవాలి..

వాహనదారులకు బిగ్ అలర్ట్. ఎవరైతే పేటీఎం ఫాస్‌ట్యాగ్ వినియోగిస్తున్నారో వారికి కీలక సూచనలు చేసింది జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఎన్‌హెచ్‌ఏఐ. ఈనెల 15వ తేదీ లోపు అంటే రేపటి లోపు మరో బ్యాంక్ నుంచి కొత్త ఫాస్ట్ ట్యాగ్ కొనుగోలు చేయాలని కోరింది. ఫాస్ట్‌ట్యాగ్ వినియోగిస్తున్న వాహనదారులకు బిగ్ అలర్ట్. ఎవరైతే పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ ఫాస్ట్ ట్యాగ్ వినియోగిస్తున్నారో వారంతే ఈనెల 15వ తేదీలోగా మరో బ్యాంక్ నుంచి కొత్త ఫాస్ట్ ట్యాగ్ తీసుకోవాలని సూచించింది నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (%చీనూ×%). దీంతో టోల్ ప్లాజాల వద్ద పెనాల్టీలు, రెట్టింపు ఫీ చెల్లించాల్సిన పరిస్థితుల నుంచి తప్పించుకోవచ్చని పేర్కొంది. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ పై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్‌బీఐ విధించిన ఆంక్షలు మార్చి 15వ తేదీ తర్వాత అమలులోకి రానున్నాయి. దీంతో పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ సేవలన్నీ నిలిచిపోతాయి. ఈ క్రమంలోనే ఎన్‌హెచ్‌ఏఐ పేటీఎం ఫాస్ట్ ట్యాగ్ వినియోగదారులకు కీలక సూచనలు చేసింది.

ఆర్‌బీఐ ఆంక్షల నేపథ్యంలో పేటీఎం ఫాస్ట్ ట్యాగ్ వినియోగదార్లు ఈ నెల 15 తర్వాత తమ బ్యాలెన్స్ టాపప్ లేదా రీఛార్జ్ చేసుకోలేరు. అయితే, పేటీఎం ఫాస్ట్ ట్యాగ్ లో బ్యాలెన్స్ ఉంటే దానిని మార్చి 15 తర్వాత కూడా ఉపయోగించుకునే వీలుంటుంది. కానీ, సరిపడా బ్యాలెన్స్ లేని సందర్భంలో పెనాల్టీలు లేదా రెట్టింపు ఫీజులు కట్టాల్సి వస్తుందని గుర్తుంచుకోవాలి. ఏవైనా సందేహాలు ఉంటే పేటీఎం పాస్ట్ ట్యాగ్ వినియోగదార్లు తమ బ్యాంకులను సంప్రదించాలని లేదంటే ఇండియన్ హైవేస్ మేనేజ్‌మెంట్ కంపెనీ వెబ్ సైట్లోని ప్రశ్నలు- సమాధానాలను పరిశీలించొచ్చని ఎన్‌హెచ్‌ఏఐ సూచించింది. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ (పీపీబీఎల్) వినియోగదార్లతో పాటు వ్యాపారులు తమ బ్యాంక్ అకౌంట్లను మార్చి 15వ తేదీ లోపు ఇతర బ్యాంకులకు మార్చుకోవాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గత ఫిబ్రవరి నెలలోనే సూచించిన సంగతి తెలిసింది. ఆర్‌బీఐ ఆంక్షలు తొలుత మార్చి 1 నుంచే అమలులోకి రావాల్సి ఉంది. అయితే, మరి కాస్త సమయం ఇస్తూ గడువును మార్చి 15కు పొడిగించారు. ఇప్పుడు ఈ గడువు సైతం మరో రోజులోనే ముగియనుంది. ఇప్పుడు మరోసారి పొడిగింటే అవకాశాలు లేనట్లే కనిపిస్తోంది. ఇప్పటి వరకు దీనిపై ఎలాంటి అప్డేట్ లేదు. దేశ వ్యాప్తంగా మొత్తం 8 కోట్లకుపైగా పాస్ట్ ట్యాగ్ లు వినియోగంలో ఉన్నాయి.

మరో కంపెనీ వాటా మొత్తం కొనుగోలు..



భారత అత్యంత సంపన్నుడు ముకేశ్ అంబానీ తన వ్యాపారాల్ని విస్తరించడంలో దూసుకెళుతున్నారు. తాజాగా మరో డీల్ చేసుకున్నారు. ఇప్పటికే వాల్ట్ డిస్నీతో తమ మీడియా వ్యాపార కార్యకలాపాల్ని విలీనం చేయనున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ ప్రకటించగా.. ఇప్పుడు మరో కీలక ప్రకటన చేసింది. వయాకామ్18లో మరో సంస్థకు ఉన్న13 శాతం వాటాల్ని కొనుగోలు చేయనున్నట్లు పేర్కొంది. ఇండియా టెలివిజన్ రంగం వ్యాపారంలో తమకు ఉన్న వాటాల్ని రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు విక్రయిస్తున్నట్లు అమెరికాకు చెందిన పారామౌంట్ గ్లోబల్ గురువారం రోజు ప్రకటన చేసింది. ఈ మేరకు ఇప్పటికే రెండు సంస్థల మధ్య నిశ్చయాత్మక ఒప్పందం కుదిరిందని వెల్లడించింది. అయితే నియంత్రణ సంస్థల నుంచి వచ్చే అనుమతులు మాత్రమే మిగిలి ఉన్నట్లు తెలిపింది. ఈ డీల్‌లో భాగంగా కొన్ని షరతులు విధించుకున్నామని.. వాటికి రెండు సంస్థలు కట్టుబడి ఉంటే మాత్రమే డీల్ ప్రాసెస్ పూర్తవుతుందని స్పష్టం చేసింది. వయాకామ్18 మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌లో పారామౌంట్ గ్లోబల్ కు ఉన్న 13.1 శాతం వాటాల్ని రూ. 4286 కోట్లతో కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు మరోవైపు రిలయన్స్ ఇండస్ట్రీస్ కూడా స్టాక్ ఎక్స్ఛేంజీ ఫైలింగ్‌లో వెల్లడించింది. ఇంకోవైపు రిలయన్స్, వయాకామ్18, స్టార్ డిస్నీ మధ్య ఏర్పాటు చేయాలని నిర్ణయించిన జాయింట్ వెంచర్ పూర్తయిన తర్వాత మాత్రమే ఈ తాజా కొనుగోలు ఒప్పందం అమల్లోకి వస్తుందని ఎక్స్ఛేంజీలకు పారామౌంట్ తెలియజేసింది. కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యాక కూడా పారామౌంట్ తన కంటెంట్‌ను వయాకామ్18కు అందిస్తున్నట్లు వెల్లడించింది. ఇక ఈ కొనుగోలు ప్రక్రియ పూర్తయితే.. వయాకామ్ కంపెనీలో రిలయన్స్ వాటా 70.49 శాతానికి చేరుతుంది. భారత్‌లో తమ మీడియా వ్యాపార కార్యకలాపాల్ని విలీనం చేస్తామని రిలయన్స్ ఇండస్ట్రస్, అమెరికా సంస్థ వాల్ట్ డిస్నీ ఇప్పటికే ప్రకటించాయి. విభిన్న భాషల్లో మొత్తం 120 టీవీ ఛానెల్స్ (స్టార్ ప్లస్, కలర్స్, స్టార్ గోల్డ్ వంటి ఎంటర్‌టైన్మెంట్ ఛానెళ్లు, స్టార్ స్పోర్ట్స్, స్పోర్ట్18 వంటి క్రీడా ఛానెళ్లు),

రెండు ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ (హాట్‌స్టార్, జియో సినిమా) కలిగి ఉండటం సహా దేశవ్యాప్తంగా చూస్తే 75 కోట్ల మంది వీక్షకుల సంఖ్యతో భారత మీడియా, వినోద రంగంలోనే అతిపెద్ద సంస్థగా ఇది అవతరిస్తుంది. డీల్‌లో భాగంగా.. స్టార్ ఇండియాలో వయాకామ్ 18 మీడియా వ్యాపారం విలీనం అవుతుందని రెండు సంస్థలు తెలిపాయి. విలీనం అనంతరం.. సంస్థ విలువ రూ. 70,352 కోట్లుగా ఉండొచ్చని అంచనా.

శాలరీ, అద్దె, క్యాష్ విత్ డ్రా, డిపాజిట్లు..

ఆదాయపు పన్ను గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అయితే, కొన్ని లావాదేవీలపై ట్యాక్స్ డిడక్టెడ్ ఎట్ సోర్స్ కట్ అవుతుంది. అందులో జీతం, ఇంటి అద్దే, వడ్డీ ఆదాయాలు, నగదు ఉపసంహరణ, ఫిక్స్‌డ్ డిపాజిట్ల వంటివి ఉన్నాయి. మరి ఆయా ట్రాన్సాక్షన్లపై దేనికి ఎంత టీడీఎస్ రేటు ఉంది? అనే లిస్ట్ ఓసారి పరిశీలిద్దాం. జీతం, బ్యాంకు డిపాజిట్లపై వడ్డీ ఆదాయం, కమీషన్, ఇంటి రెంటు, డివిడెండ్లు వంటి ఆదాయాలపై నిర్దేశిత పరిమితి దాటి రాబడి ఉంటే ఆయా ట్రాన్సాక్షన్లపై ట్యాక్స్ డిడక్టెడ్ ఎట్ సోర్స్ (టీడీఎస్) కట్ అవుతుంది. అయితే, టీడీఎస్ అనేది నిబంధనల ప్రకారం.. ఒక్కో ట్రాన్సాక్షన్‌కు ఒక్కో విధంగా ఉంది. ఉదాహరణకు ఒక వ్యక్తి నెలకు రూ.50 వేలు ఆ పైన ఇంటి రెంటు చెల్లిస్తున్నాడు అనుకుందాం. ఇంటి యజమానికి రెంటు చెల్లించే ముందే దానిపై 5 శాతం టీడీఎస్ కట్టాల్సి ఉంటుంది. టీడీఎస్ డిడక్షన్‌కి సంబంధించిన రూల్స్ కచ్చితంగా అనుసరించాల్సి ఉంటుంది. అలాగే టీడీఎస్ రిటర్న్స్ ఫైల్ చేయాలి. లేదంటే పెనాల్టీలు పడే అవకాశం ఉంది. కొన్ని సార్లు చట్టపరమైన చర్యలూ ఎదుర్కోవలసి వస్తుంది.

194ఈఈ సెక్షన్ ప్రకారం.. నేషనల్ సేవింగ్స్ స్కీమ్ లో ఇన్వెస్ట్ చేస్తే రూ.2,500 వరకు మినహాయింపు ఉంటుంది. ఆ తర్వాత 10 శాతం టీడీఎస్ కట్టాలి.సెక్షన్ 194ఎఫ్ ప్రకారం.. మ్యూచువల్ ఫండ్స్ యూనిట్ల కొనుగోలు చేస్తే ఎలాంటి మినహాయింపు లేదు 20 శాతం టీడీఎస్ పడుతుంది. 194హెచ్ ప్రకారం.. కమీషన్, బ్రోకరేజీ రూ.15 వేల వరకు మినహాయింపు ఉంటుంది. ఆ పైన 5 శాతం టీడీఎస్ పడుతుంది.

టీడీఎస్ రేట్లు అనేవి ఆదాయ స్థాయి, ఎక్కడి నుంచి వస్తుంది?, ఆదాయం పొదుతున్న వ్యక్తి రెసిడెంటా, నాన్ రెసిడెంటా అనే అంశాలపై ఆధారపడి ఉంటుంది. కొన్ని కేసుల్లో టీడీఎస్ డిడక్ట్ చేయకపోతే 7 ఏళ్ల వరకు జైలు శిక్ష సైతం పడే అవకాశం ఉంది. ఆదాయపు పన్ను చట్టం 1961లోని సెక్షన్ 276బీ ప్రకారం జైలు శిక్ష సైతం ఉంటుంది. డబ్బులు చెల్లిస్తున్నప్పుడు సంబంధిత రేటులో టీడీఎస్ చెల్లించాల్సి ఉంటుంది. నిర్దేశిత సమయంలోపూ టీడీఎస్ సర్టిఫికేట్ తీసుకోవాలి. ఇంటి రెంటు విషయానికి వస్తే రూ.50 వేలు, ఆపైన రెంటు చెల్లిస్తే అద్దెకు ఉండే వ్యక్తి ఫామ్ 26క్యూసీ దాఖలు చేసిన తర్వాత యజమానికి 15 రోజుల్లోగా ఫామ్ 16సీ అందించాల్సి ఉంటుంది.

ఏ ట్రాన్సాక్షన్లకు ఎంత టీడీఎస్ రేటు?

సెక్షన్ 192 ప్రకారం నెలవారీ జీతంపై బేసిక్ ఎగ్జెంప్షన్ ఉంటుంది. బేసిక్ శాలరీని బట్టి టీడీఎస్ కట్ చేస్తాయి కంపెనీలు

సెక్షన్ 192ఏ ప్రకారం.. ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ప్రీమెచ్యూర్ విత్ డ్రా చేస్తే రూ.50 వేల వరకు మినహాయింపు ఉంటుంది. ఆపైన విత్ డ్రా చేస్తే పాన్ కార్డు ఇచ్చిన వారికి 10 శాతం, పాన్ కార్డు ఇవ్వకుంటే 20 శాతం టీడీఎస్ కట్టాలి. సెక్షన్ 193 ప్రకారం.. సెక్యూరిటీలపై వడ్డీ రూ.5000 వరకు మినహాయింపు ఉంటుంది. ఈ లిమిట్ దాటితే 10 శాతం టీడీఎస్ పడుతుంది. సెక్షన్ 194 ప్రకారం.. డివిడెండ్ ఆదాయంపై రూ.5000 వరకు మినహాయింపు లభిస్తుంది. ఈ పరిమితి దాటితే 10 శాతం టీడీఎస్ ఉంటుంది. సెక్షన్ 194ఏ ప్రకారం.. బ్యాంకులు, పోస్టాఫీసు డిపాజిట్లపై వడ్డీ ఆదాయం సీనియర్ సిటిజన్లకు అయితే రూ.50 వేల వరకు మినహాయింపు లభిస్తుంది. జనరల్ కస్టమర్లకు రూ.40 వేల వరకు ఎలాంటి టీడీఎస్ ఉండదు. లిమిట్ దాటితే 10 శాతం చొప్పున టీడీఎస్ కట్ అవుతుంది. సెక్షన్ 194బీ ప్రకారం.. లాటరీ, పజిల్స్, కార్డు ఆటల ద్వారా ఆదాయం వస్తే రూ.10 వేల వరకు మినహాయింపు ఉంటుంది. లిమిట్ దాటితే 30 శాతం టీడీఎస్ కట్టాలి. సెక్షన్ 194బీఏ ప్రకారం.. ఆన్‌లైన్ గేమ్స్ ద్వారా ఆదాయం వస్తే ఎలాంటి మినహాయింపులు లేవు. 30 శాతం టీడీఎస్ కట్టాల్సిందే. సెక్షన్ 194బీబీ ప్రకారం.. గుర్రపు పందేల ద్వారా ఆదాయం వస్తే రూ.10 వేల వరకు మినహాయింపు ఉంటుంది. లిమిట్ దాటితే 30 శాతం టీడీఎస్ పడుతుంది.

సెక్షన్ 194డీ ప్రకారం.. వ్యక్తులు, కంపెనీలకు ఇన్సూరెన్స్ కమీషన్ వస్తే రూ.15 వేల వరకు మినహాయింపు ఉంటుంది. లిమిట్ దాటితే వ్యక్తులకు అయితే 5 శాతం, కంపెనీలకు అయితే 10 శాతం టీడీఎస్ పడుతుంది. సెక్షన్ 194డీఏ ప్రకారం.. లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీల ప్రీమియం రూ.1 లక్ష వరకు మినహాయింపు ఉంటుంది. దాటితే 5 శాతం టీడీఎస్ కట్టాలి. 194ఈఈ సెక్షన్ ప్రకారం.. నేషనల్ సేవింగ్స్ స్కీమ్ లో ఇన్వెస్ట్ చేస్తే రూ.2,500 వరకు మినహాయింపు ఉంటుంది. ఆ తర్వాత 10 శాతం టీడీఎస్ కట్టాలి. సెక్షన్ 194ఎఫ్ ప్రకారం.. మ్యూచువల్ ఫండ్స్ యూనిట్ల కొనుగోలు చేస్తే ఎలాంటి మినహాయింపు లేదు 20 శాతం టీడీఎస్ పడుతుంది. 194హెచ్ ప్రకారం.. కమీషన్, బ్రోకరేజీ రూ.15 వేల వరకు మినహాయింపు ఉంటుంది. ఆ పైన 5 శాతం టీడీఎస్ పడుతుంది.

194ఐ ప్రకారం.. ఇంటి అద్దె విషయంలో ప్లాంట్, మెషనరీ కోసం రూ.2,40,000 వరకు మినహాయింపు ఉంటుంది ఆపైన 2 శాతం టీడీఎస్ కట్టాలి. అదే ల్యాండ్, బిల్డింగ్, ఫర్నీచర్ దాని కోసం రూ.2.40 లక్షల మినహాయింపు ఉంటుంది. ఆపైన 10 శాతం టీడీఎస్ కట్టాలి. 194 ఐఏ ప్రకారం.. వ్యవసాయ భూమి మినహా స్థిరాస్తి లావాదేవీలకు రూ.50 లక్షల వరకు మినహాయింపు ఉంటుంది. ఆపైన 1 శాతం టీడీఎస్ కట్టాలి. 194ఎన్ ప్రకారం.. క్యాష్ విత్ డ్రా చేసినప్పుడు కోఆపరేటివ్ సొసైటీల్లో రూ.3 కోట్లు, ఇతరులకు రూ.1 కోటి వరకు మినహాయింపు ఉంటుంది. ఆ పైన 2 శాతం టీడీఎస్ పడుతుంది. వివిధ బ్యాంకు ఖాతాల నుంచి నగదు విత్ డ్రా చేస్తే రూ.1 కోటి వరకు మినహాయింపు ఉంటుంది. ఆపైన 2 శాతం టీడీఎస్ పడుతుంది. యాప్ ల ద్వారా విత్ డ్రా చేస్తే రూ.20 లక్షల వరకు మినహాయింపు ఉంటుంది. ఆపైన 2 శాతం టీడీఎస్ కట్టాలి. అదే రూ.1 కోటి దాటితే 5 శాతం టీడీఎస్ పడుతుంది.

జాతీయం అంతర్జాతీయం

సీఎన్‌జీ ట్యాంకర్‌ను ఢీకొట్టిన ట్రక్కు భారీ అగ్ని ప్రమాదం

జైపూర్: రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఓ పెట్రోల్ బంక్ వద్ద ఘోర అగ్నిప్రమాదం జరిగింది. శుక్రవారం ఉదయం జైపూర్‌లోని అజ్మీర్ రోడ్డులో ఉన్న పెట్రోల్ బంక్ వద్ద ఆగి ఉన్న సీఎన్‌జీ ట్యాంకర్‌ను మరో ట్రక్ ఢీకొట్టింది. దీంతో ట్యాంకర్‌లో మంటలు చెలరేగడంతో అది ఒక్కసారిగా పేలిపోయింది. పక్కనే ఉన్న వాహనాలకు మంటలు వ్యాపించడంతో వాహనాలు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో ఐదుగురు సజీవ దహనమయ్యారు. మరో మందికిపైగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. 22 ఫైర్ ఇంజిన్ల సాయంతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. గాయపడిన వారిని సవాయ్ మాన్‌సింగ్ హాస్పిటల్‌కు తరలించారు. వారికి ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. భారీగా అగ్నికీలలు ఎగసిపడటంతో ఆకాశంలో నల్లటి పొగలు కమ్ముకున్నాయి. దీంతో పక్కనే ఉన్న రహదారిపై పెద్దసంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. కాగా, దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది.

లోకసభ నిరవధిక వాయిదా

న్యూఢిల్లీ: లోక్‌సభ శుక్రవారం నిరవధిక వాయిదా పడింది. విపక్ష సభ్యుల ఆందోళన నేపథ్యంలో స్పీకర్ ఓం బిర్లా సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఆ సమయంలో ప్రధాని మోదీ సభలో ఉన్నారు. మరో వైపు ఇవాళ ఉదయం పార్లమెంట్ ఆవరణలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద .. ఇండియా కూటమి ఎంపీలు నిరసన చేపట్టారు. అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఇండియా కూటమి నేతలు తప్పుపట్టారు. షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్‌ను అవమానించిన షా రాజీనామా చేయాలని ఇవాళ విజయ్ చౌక్ వద్ద విపక్ష ఎంపీలు ఆందోళన చేపట్టారు. జమిలి ఎన్నికల బిల్లును జేపీసీకి లోక్‌సభ రిఫర్ చేసింది. మరో వైపు విపక్ష సభ్యుల ఆందోళన నేపథ్యంలో రాజ్యసభను 12 గంటల వరకు వాయిదా వేశారు. జమిలి ఎన్నికల ముసాయిదాను జేపీసీకి పంపాలన్న తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని స్పీకర్ బిర్లా.. న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌ను కోరారు. మరో వైపు సభలో విపక్షాలు జైభీం అంటూ కేకలు పెట్టారు. పార్లమెంట్ గేటు వద్ద ఆందోళనలు, నిరసనలు చేపట్టరాదు అని స్పీకర్ బిర్లా ఆదేశించారు. విపక్ష సభ్యుల ఆందోళనల నేపథ్యంలో స్పీకర్ సభను నిరవధిక వాయిదా వేశారు.

కొరియర్‌లో డెడ్‌బాడీ

పశ్చిమగోదావరి జిల్లాలో కలకలం

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో శీతాకాల సమావేశాలు శుక్రవారం ముగిశాయి. విపక్ష సభ్యుల ఆందోళనల నేపథ్యంలో ఉభయసభలను నిరవధికంగా వాయిదా వేశారు. అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై విపక్ష ఎంపీలు నిరసన వ్యక్తం చేస్తుండగానే స్పీకర్ ఓం బిర్లా లోక్ సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఆ సమయంలో ప్రధాని మోదీ కూడా సభలో ఉన్నారు. వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లుపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన జాయింట్ పార్లమెంటరీ కమిటీలో 12 మంది రాజ్యసభ సభ్యులకు చోటు కల్పించాలని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ మేఘ్‌వాల్ ప్రవేశపెట్టిన తీర్మానానికి రాజ్యసభ ఆమోదం తెలిపింది. ఆ తర్వాత అమిత్ షా వ్యాఖ్యలపై సభలో విపక్ష ఎంపీలు నిరసనకు దిగడంతో రాజ్యసభను నిరవధికంగా వాయిదా వేశారు. దాంతో పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఇవాళ్టితో ముగిసి నట్లయ్యింది. శుక్రవారం ఉదయం ఉభయసభల ప్రారంభానికి ముందు పార్లమెంట్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వద్ద .. ఇండియా కూటమి ఎంపీలు నిరసన చేపట్టారు. అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను వారు తప్పుపట్టారు. షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్‌ను అవమానించిన షా రాజీనామా చేయాలన్నారు.

మానవ తప్పిదం వల్లే కూలిన హెలీకాప్టర్

బిపిన్ రావత్ మృతిపై రిపోర్టు

న్యూఢిల్లీ: త్రివిధ దళాధిపతి జనరల్ బిపిన్ రావత్ ప్రయాణిస్తున్న ఎంఐ 17 వీ5 హెలికాప్టర్ 2021 డిసెంబర్ 8వ తేదీన ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ఆ ఘటనలో మొత్తం 12 మంది మరణించారు. బిపిన్ రావత్ భార్య మధులిక రావత్ కూడా ఆ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. తమిళనాడులోని కూనూరులో ఆ ఘటన జరిగింది. ఆ ప్రమాదం పట్ల రక్షణశాఖ స్థాయి సంఘం కమిటీ నివేదికను తయారు చేసింది. ఆ నివేదికను గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. మానవ తప్పిదం వల్ల ఎంఐ-17 హెలికాప్టర్ కూలినట్లు రిపోర్టులో వెల్లడించారు. 2017 నుంచి 2022 వరకు భారతీయ వైమానిక దళానికి చెందిన 34 ప్రమాదాలు జరిగినట్లు స్టాండింగ్ కమిటీ రిపోర్టులో పేర్కొన్నారు. ఇక 2021-2022లో జరిగిన 9 ప్రమాదాల్లో.. డిసెంబర్ 8వ తేదీన మానవ ప్రమాదం వల్ల ప్రమాదం జరిగినట్లు తెలిపారు.

గర్ల్‌ఫ్రెండ్‌తో వెళ్లిపోయిన భార్య

హైకోర్టును ఆశ్రయించిన భర్త

అహ్మదాబాద్: గర్ల్‌ఫ్రెండ్‌తో వెళ్లిపోయిన భార్యను వెతికి పెట్టాలంటూ ఒక వ్యక్తి గుజరాత్ హైకోర్టును ఆశ్రయించాడు. స్వలింగ సంపర్కురాలైన తన భార్య అక్టోబర్‌లో తన ప్రియురాలితో కలిసి ఇంట్లోంచి వెళ్లిపోయిందని, ఆ సమయానికి ఆమె ఏడునెలల గర్భవతి అని ఆయన కోర్టుకు విన్నవించాడు. దీనిపై చాంద్‌ఖేడ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా వారు తన భార్య ఆచూకీని కనుగొనలేకపోయారని తెలిపాడు. కాగా, ఆమెను ఈ నెల 23లోగా తమ ముందు హాజరుపర్చాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది.

వాట్సాప్‌లోనూ చాట్ జీపీటీ

న్యూఢిల్లీ: కృత్రిమ మేధ వేదిక ఓపెన్ ఏఐ మరో కొత్త సదుపాయం అందుబాటులోకి తెచ్చింది. ఇక నుంచి చాట్‌జీపీటీ కోసం ఎలాంటి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోనక్కర్లేదు. దాని సేవలను నేరుగా వాట్సాప్‌లోనూ వినియోగించుకోవచ్చునని ఓపెన్ ఏఐ ప్రకటించింది. వేరే యాప్, అకౌంట్‌తో సంబంధం లేకుండా నేరుగా వాట్సాప్‌లోనే దీనిని వాడవచ్చు. 18002428478 నంబర్‌తో వాట్సాప్‌లో చాట్ చేయవచ్చు. మనం అడిగిన సందేహాలు, ప్రశ్నలకు ఇది సమాధానం చెపుతుంది. ఇంతకాలం కెనడా, అమెరికాలకే పరిమితమైన సేవలు ఇకనుంచి భారత్‌లో కూడా పొందవచ్చు. అయితే దీని రోజువారీ వాడుకపై పరిమితి ఉంటుంది. మెటా ఏఐ చాట్‌బాట్‌కు పోటీగా ఓపెన్‌ఏఐ దీనిని వాట్సాప్‌లో ప్రవేశపెట్టింది.

జేపీసీకి జమిలి బిల్లు..లోక్‌సభలో తీర్మానం ఆమోదం



న్యూఢిల్లీ: ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీలకు ఎన్నికలు నిర్వహించే అంశంపై రూపొందిన జమిలి బిల్లును పార్లమెంటరీ స్థాయి సంఘానికి పంపాలని శుక్రవారం లోక్‌సభ తీర్మానం పాస్ చేసింది. సభను నిరవధికంగా వాయిదా వేయడానికి ముందు రెండు బిల్లులను జేపీసీకి పంపేందుకు తీర్మానాన్ని లోక్‌సభ ఆమోదించింది. న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అయితే రెండు రోజుల క్రితం జమిలి ఎన్నికల బిల్లుకు లోక్‌సభలో ఆమోదం దక్కిన విషయం తెలిసిందే. అయితే పార్లమెంటరీ స్థాయి సంఘంలో ఉండే సభ్యుల వివరాలను పంపించాలని రాజ్యసభను మంత్రి కోరారు. సంయుక్త పార్లమెంటరీ స్థాయి సంఘం కమిటీలో మొత్తం 39 మంది ఎంపీలు ఉంటారు. దాంట్లో 27 మంది లోక్‌సభ, 12 మంది రాజ్యసభ సభ్యులు ఉండనున్నారు. మాజీ కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్, పీపీ చౌదరీ, ప్రియాంకా గాంధీలు లోక్‌సభ నుంచి ఆ కమిటీలో ఉన్నారు. జమిలి ఎన్నికలకు సంబంధించిన రెండు బిల్లులపై జేపీసీలో చర్చిస్తారు. ఓ బిల్లు కోసం మాత్రం రాజ్యాంగ సవరణ అవసరమని నిపుణులు చెబుతున్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లు న్యాయమైనవి

11వ రోజు సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న నిరసన దీక్షలో పాల్గొన్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ

కరీంనగర్ బ్యూరో, డిసెంబర్ 20 (జనంసాక్షి) :

సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లు న్యాయమైనవని వారి డిమాండ్లకు ప్రభుత్వం వెంటనే చట్టబద్ధత కల్పించాలని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన బుదవారం సిద్ధిపేట కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవదిక సమ్మె శిబిరాన్ని సందర్శించి వారికి సంఘీబావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యాశాఖ లో భాగంగా పని చేస్తూ, గత 11 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు చట్టబద్ధంగా నియమించబడ్డారని వారిని రెగ్యులరైజ్ చేయాలని లేదంటే ప్రభుత్వం పే స్కేల్ అమలు చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఉన్నటువంటి అన్నివసతులు కల్పించాలని వారి న్యాయమైన డిమాండ్ లను ప్రభుత్వం అమలు చేయాలన్నారు. 2023 లో ఇదే సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మెను విరమింపజేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పుడు వారి సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష బాధ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజా పాలనలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుంది

సుడా పరిధిలో ప్రణాళికా బద్ధమైన అభివృద్ధి చేయడమే లక్ష్యం.

కొత్తపల్లి 12వ వార్డులో 20 లక్షలతో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి, 3 లక్షల నిధులతో హైమాస్ట్ లైట్లు ప్రారంభం చేసిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి.

కరీంనగర్ బ్యూరో, డిసెంబర్ 20 (జనంసాక్షి) :

ప్రజా అవసరాలే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రజా పాలనలో అవినీతి రహితంగా సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. కొత్తపల్లి హావేలి మున్సిపల్ పరిధిలోని 12 వ వార్డులో శుక్రవారం సుడాకు సంబంధించి ఇరవై లక్షల నిధులతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అనంతరం ఒకటవ వార్డు ఆరవ వార్డులలో హైమాస్ట్ లైట్లను ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమం నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి నిలిచిపోయిందని కొంత మంది మాట్లాడుతున్నారని ఉనికి కోసం వాళ్ళు మాట్లాడుతున్న దాన్ని మేము అభివృద్ధి సంక్షేమంతోనే జవాబు చెబుతామని అభివృద్ధి కార్యక్రమాలను నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. సుడా పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ఇతర నిధులతో కూడా అభివృద్ధి చేస్తున్నామని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. సుడా పరిధిలో ప్రణాళికా బద్ధమైన అభివృధికి కృషి చేస్తున్నామని రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు మంజూరు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ ఇంచార్జి పురుమళ్ల శ్రీనివాస్, కొరివి అరుణ్ కుమార్, బాణోతు శ్రవణ్ నాయక్, కొత్తపల్లి టౌన్ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ గౌడ్, కొత్తపల్లి మండల అధ్యక్షుడు పంజాల స్వామి గౌడ్, వాసాల రమేష్, రాచకొండ ప్రభాకర్, ఏర్రం కనుకా రెడ్డి, దుబ్బాస్ కుమార్, జేరిపోతుల వాసు, యాస్వాడ రాజ్ కుమార్, వేముల కవిత, గున్నాల విజయ, బూస స్వాతి, హైమావతి, బూస వీరేశం తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

మధ్యాహ్న భోజనం తనిఖీ

ఇందిరమ్మ ఇండ్లు సర్వేను పరిశీలించారు

గాంధారి డిసెంబర్ 20 జనం సాక్షి

విద్యార్థులతో మాట్లాడి ఈ సంవత్సరంలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. గాంధారి మండలం పోతంగల్ కలాన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పదో తరగతి విద్యార్థులకు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. మధ్యాహ్న భోజనం సందర్శించారు. వాటితో పాటు ఆరోగ్య ఉప కేంద్రం, ఇందిమ్మ ఇళ్ల సర్వే, అంగన్ వాడీ కేంద్రం, గాంధారిలోని నర్సరీలను కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. పోతంగల్ కలాన్ హైస్కూల్ లోని కిచెన్ లో వంటలను, స్టోర్ రూమ్ లోని బియ్యాన్ని పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. కలెక్టర్ వెంట ఆర్డీవో ప్రభాకర్, జిల్లా విద్య శాఖాధికారి రాజు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ శిరీష, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, ఇన్ చార్జి తహసీల్దార్ రవికాంత్, ఎంపీడీవో సతీశ్, గాంధారి ఎంపిటిఓ రాజేశ్వర్, ఎంపీ ఓ, ఏఎంసీ చైర్మన్ పరమేష్, మండల సాయి అధికారులు, గ్రామస్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె బాటలో ఉపాధ్యాయులు.. కస్తూర్బాలో విద్యార్థినులు

మల్దకల్ డిసెంబర్ 20 (జనంసాక్షి)

సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెబాట పట్టారు.మల్దకల్ కస్తూర్బా గాంధీ విద్యాలయంలో బోధన నిలిచిపోవడంతో విద్యార్థినులు ఆందోళన చెందుతున్నారు బాలికలకు రక్షణ అల్పాహారం భోజనము అందించడానికి ఇద్దరు మినహా మిగతా ఉపాధ్యాయులు సమ్మెలో పాల్గొంటున్నారు. పదో తరగతి పరీక్షలు సమయం దగ్గర పడుతుండడం,ఇప్పటికే సిలబస్ పూర్తికాక ఈనెల ఆరో తేదీ నుండి ఉద్యోగులు, ఉపాధ్యాయులు సమ్మె చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేకపోవడంతో ఉద్యోగులు సమ్మె కొనసాగిస్తున్నారు.గత 15 రోజులు కావస్తున్న ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించకుండగా కాలయాపన చేస్తున్నడంతో వివిధ పార్టీలకు చెందిన నాయకులు వారికి మద్దతు కలుపు సంఘీభావం తెలియజేస్తున్నారు.మార్చి 21వ తేదీ నుండి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నడంతో బాలికలకు సిలబస్ కాక ఆందోళన చెందుతున్నారు.విద్యార్థినుల భవిష్యత్తుపై సమ్మె ప్రభావం పడుతుందని విద్యార్థిని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు .మండల వనరుల కేంద్రం సైతం మూతపడడంతో ఉద్యోగులు ఉపాధ్యాయులు దిక్కుతోచని పరిస్థితుల్లో బాలికలు ఉన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే వారి సమస్యలను పరిష్కరించి విధులలోకి తీసుకోవాలని కోరుతున్నారు.

గిరిజన దర్బార్ సత్వర పరిష్కారం

కొత్తగూడ డిసెంబర్ 20 (జనంసాక్షి)

: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ రైతు వేదిక కార్యాలయం లో నిర్వహించిన గిరిజన దర్బార్ లో గిరిజనుల నుండి వచ్చిన వినతులను స్వయంగా స్వీకరించి సమస్యలను త్వరితగతిన పరిష్కారం చూపాలని సంబంధిత సెక్టార్ అధికారులకు ప్రాజెక్ట్ అధికారి చిత్ర మిశ్ర ఐటిడిఏ ఏటూరునాగారం ఆదేశించినారు. ఈ గిరిజన దర్బార్ లో కొత్తగూడ గంగారం,గూడూర్,గార్ల,బయ్యారం మండలాల నుండి మొత్తం (48) దరఖాస్తులను చిత్రా మిశ్ర ఏటూర్ నాగారం స్వయంగా గిరిజనులు సమర్పించడం జరిగింది.

గాంజాని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు అరెస్ట్

శంషాబాద్, డిసెంబర్ 20 (జనంసాక్షి) : గుట్టు చప్పుడు కాకుండా బెంగళూరు నుంచి హైదరాబాద్ కి గాంజా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను తోండుపల్లి టోల్ గేట్ వద్ద శంషాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపి వివరాలు, భాను తేజ రెడ్డి, రాజ్ కుమార్లు మారుతి కార్ టిజి07 4060 బెంగళూరు నుంచి హైదరాబాద్ వస్తుండగా విశ్వనీయ సమాచారం మేరకు తోండు పల్లి టోల్గేట్ వద్ద పోలీసులు అదుపులకు తీసుకొన్నారు. వారి వద్ద నుంచి 70 గ్రాముల ఓజీ కుష్ గాంజా స్వాధీనం చేసుకుని దర్యాప్తు సాగిస్తున్నారు. ఖమ్మం వరంగల్ కి చెందిన వ్యక్తులుగా పోలీసులు గుర్తించారు.

ఏపీజీవీబీ బ్యాంకులు తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనం

వరంగల్ ఈస్ట్, డిసెంబర్ 20 (జనం సాక్షి)

01జనవరి 2025 నుండి అమలు

విలేకరుల సమావేశంలో చైర్మన్ ప్రతాపరెడ్డి వెల్లడి

ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ)లో ఉన్నటువంటి 493 బ్యాంక్ శాఖలను తెలంగాణ గ్రామీణ బ్యాంకు (టి జి బి) లో విలీనం అవ్వనున్నట్లు బ్యాంకు చైర్మన్ ప్రతాపరెడ్డి అన్నారు. ఈ ప్రక్రియ 1 జనవరి 2025 నుండి అమలవుతున్నట్లు చెప్పారు. ఈ మేరకు హనుమకొండలోని రీజనల్ ఆఫీసులో శుక్రవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రతాపరెడ్డి మాట్లాడుతూ వన్ స్టేట్ వన్ ఆర్ ఆర్ బి లక్ష్యంలో భాగంగా భారత ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం డి ఎఫ్ ఎస్ 13 -11 - 2024 నాటి ఉత్తర్వు ద్వారా 2025 జనవరి 1 నుంచి ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనం చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో తలెత్తే సాంకేతిక సమస్యల కారణంగా తమ బ్రాంచ్ ఆపరేషన్ ఆన్లైన్ బ్యాంకింగ్ సర్వీసెస్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ మొదలైనవి అన్ని కస్టమర్ సర్వీస్ సెంటర్లు లావాదేవీలు ఈనెల 28 నుండి 31 వరకు అందుబాటులో ఉండవని చైర్మన్ ప్రతాపరెడ్డి తెలిపారు వినియోగదారులు ఈనెల 27వ తేదీలోగా తమ లావాదేవీలను పూర్తి చేసుకోవాల్సిం దిగా తెలిపారు. జనవరి 1 నుండి ఈ సర్వీసులు యధావిధిగా నడుస్తాయని ఖాతాదారుల ఖాతా నెంబర్లు అలాగే ఉంటాయని తెలిపారు.ఈ విషయంలో ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. హైదరాబాదులోని టీజీబి హెడ్ ఆఫీస్ కింద ఏపీజీవీబీ బ్రాంచ్లు పనిచేయనున్నట్లు వివరిం చారు.ఈ సమావేశంలో వి.దయాకర్, చైతన్య కుమార్, శశికాంత్, యశ్వంత్ పాల్గొన్నారు.

నిధులు మంజూరుకు వినతి

మల్కాజిగిరి,డిసెంబర్21(జనంసాక్షి)

మల్కాజిగిరి డివిజన్ పరిధిలో ప్రతిపాదనలో ఉన్న అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ శ్రావణ్ కుమార్ శుక్రవారం జిహెచ్ఎంసి కమిషనర్ ఇలాంబర్తి ని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రావణ్ మాట్లాడుతూ.విష్ణుపురి ఎక్స్ టేన్షన్ నాలా, సఫిల్ గూడ మినీ ట్యాంక్ బండ్ లోని గణేష్ నిమజ్జన కొలను ఎత్తు, లోతు విస్తరణకు నిధులు మంజూరు చేయాలని వినతి పత్రాన్ని అందజేసి కోరినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన ఆయన నిధులు మంజూరు చేసే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారని అన్నారు.

జాతీయస్థాయి టెన్నిస్ టోర్నమెంట్ లో సత్తా చాటిన సాయి అనన్య.

మల్కాజిగిరి,డిసెంబర్21(జనంసాక్షి)

జాతీయస్థాయి టెన్నిస్ ట్నోమెంట్ లో సైనిక్ పూరి కి చెందిన అమ్మాయి సత్తా చాటింది. పంజాబ్ లోని జలంధర్ లో ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు ఆలిండియా టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్ 18 జాతీయస్థాయి టెన్నిస్ టోర్నమెంట్ లో నేరేడ్ మెట్ సైనిక్ పూరి కి చెందిన సాయి అనన్య ప్రతి భని కనబరిచింది.శుక్రవారం హర్యానాకు చెందిన ఆనందిత ఉపాధ్యాయ తో సాయి అనన్య తలపడి, ఓడిపోయింది. ఫైనల్లో రన్నరఫ్ గా నిలిచిన సాయి అన్యను పలువురు క్రీడాకారులు ,ఉపాధ్యాయులు అభినందించారు.టోర్నమెంట్ డైరెక్టర్ దినేష్ ఆరోరా, ఆర్గనైజర్ మాలికులు ట్రోఫీతో పాటు ఆమెకు ప్రశంసా పత్రాన్ని ఆమెకు అందజేశారు

ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి

ములుగు ప్రతినిధి,డిసెంబర్ 20(జనంసాక్షి).

ములుగు మండలంలోని రాయిని గూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మరియు జంగాలపల్లి లోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్ జంగాలపల్లి మరియు రాయిని గూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వైద్య సేవల కొరకు, వచ్చిన రోగుల తో మాట్లాడుతూ, వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రాయినిగూడెం ఆరోగ్య కేంద్రంలో నీ మందుల నిల్వ ఉన్న గదిని పరిశీలించి అందుబాటులో ఉన్న మందుల వివరాలను అడిగి తెలుసుకుని మందుల నిల్వల రిజిస్టర్లు పరిశీలించారు. అందుబాటులోని మందులను ముందస్తుగానే ఇండెంట్ పెట్టుకుని మందు లను సమకూర్చుకోవాలని సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో జంగాలపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ డాక్టర్ నవ్యరాణి, డాక్టర్ నాగ అన్వేష్, డాక్టర్ శ్రవణ్, సీనియర్ అసిస్టెంట్ అన్నపూర్ణ, సూపర్వైజర్ నిర్మల మేరీ, స్టాఫ్ నర్స్ సత్యకుమారి, ల్యాబ్ టెక్నీషియన్ సుజాత, ఆరోగ్య కార్యకర్త శ్రీలత మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కోకో పోటీలకు 50 వేల విరాళం

వరంగల్ ప్రతినిధి, డిసెంబర్ 20 (జనం సాక్షి)

వరంగల్ జిల్లా గీసుకొండ మండల కేంద్రంలో 57వ రాష్ట్రస్థాయి సీనియర్స్ ఖోఖో ఛాంపియన్ షిప్ నిర్వహణకు 50 వేల రూపాయల విరాళం అందజేసినట్లు ఏనుగుల మంజుల - సాంబరెడ్డి దంపతులు నిర్వాహకులకు అందజేశారు.శుక్రవారం గీసుకొండ మండల కేంద్రంలో రాష్ట్ర సయి కోకో పోటీలకు వచ్చేవారికి సౌకర్యాలు కల్పించడానికి విరాళం అందించినట్లు విరాళ దాతలు ప్రకటించారు.ఈ నెల 8వ తేది నుంచి 11వ తేది వరకు గీసుకొండ హైస్కూల్ లో జరుగనున్న 57వ రాష్ట్రస్థాయి సీనియర్స్ ఖోఖో ఛాంపియన్ షిప్ నిర్వహణకు, గీసుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయ చైర్మన్ ఏనుగుల మంజుల -సాంబరెడ్డి దంపతులు 50 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కోట రాంబాబుకు అందజేశారు. ఈకార్యక్రమంలో వరంగల్ జిల్లా ఖోఖో అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ వీరగొని స్వప్న, టోర్నమెంట్ సలహాదారులు దోపతి అరుణ, షేక్ ఖాదర్ ఉపాధ్యాయులు సామాజిక సేవకులు కర్ణకంటి రాంమూర్తి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను పక్కాగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి..

వరంగల్ ప్రతినిధి: డిసెంబర్ 20 (జనంసాక్షి)

ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని, లబ్ధిదారుల వివరాలను మొబైల్ యాప్లో నమోదు చేయడంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా సూచించారు.ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను సర్వేయర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి మొబైల్ యాప్లో నమోదు చేస్తున్నారు.

శుక్రవారం వరంగల్ పట్టణంలోని 18వ డివిజన్ లేబర్ కాలనీ ప్రాంతంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను కలెక్టర్ సత్య శారదా దేవి పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఒక్క దరఖాస్తును వదలకుండా సర్వే చేయాలని ఆదేశించారు. సర్వేపై దరఖాస్తుదారులకు ముందస్తు సమాచారం అందించాలని, ప్రజలు సైతం అవసరమైన డాక్యు మెంట్లను సిద్ధం చేసుకొని సర్వే కోసం వచ్చే ఎన్యూమరేటర్లతో సహకరించాలని సూచించారు.ఒక్కో దరఖాస్తుదారుడి వివరాలు నమోదుకు ఎంత సమయం పడుతోంది.. రోజుకు ఎన్ని కుటుంబాల వివరాలు నమోదు చేస్తున్నారు.. సర్వే సందర్భంగా క్షేత్రస్థాయిలో ఏమైన ఇబ్బందులు ఉన్నాయా అని అధికారులను అడిగారు.ప్రతిరోజు నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు ఎన్యుమరేటర్లు ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తు సర్వే పూర్తి చేయాలని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని.. తప్పిదాలకు తావులేకుండా వివరాలు సేకరించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు సర్వే పారదర్శకంగా జరిగేలా సహకరించాలని కలెక్టర్ కోరారు.ఈ తనిఖీలలో కలెక్టర్ వెంట కార్పొరేటర్ వస్కుల బాబు, జిల్లా పరిషత్ సీఈఓ రామిరెడ్డి, జిడబ్ల్యూ ఎంసీ కాశిబుగ్గ సర్కిల్ రెవిన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

న్యూట్రిషన్ సమస్య పరిష్కారానికి కృషి చేయాలి

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):

న్యూట్రిషన్ సమస్య పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయపు కాన్ఫరెన్స్ హాలులో మహిళా శిశు సంక్షేమ, విద్యా, వైద్య, గ్రామీణాభివృద్ధి, పౌర సరఫరాలు, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులతో జిల్లా స్థాయి న్యూట్రిషన్ కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు, గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లుల ఆరోగ్య పరిస్థితులు, పోషకాహార లోపాలు, వాటి పరిష్కారాలపై ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. నిరంతర పర్యవేక్షణ, సమాచార సేకరణను కొనసాగించాలని పేర్కొన్నారు. గ్రామాల్లో ఆరోగ్య క్యాంపులు ఏర్పాటు చేసి, ప్రజలకు పోషకాహారం పై అవగాహన కల్పించాలని, పిల్లల తల్లుల కోసం ప్రత్యేక శిక్షణా శిబిరాలను నిర్వహించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషక ఆహారం పంపిణీ, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు, ఆరోగ్య బృందాల ద్వారా హెల్త్ క్యాంపుల నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అస్పిరేషనల్ డిస్ట్రిక్ లలో భాగంగా మన జిల్లా దేశంలోనే 12వ స్థానంలో ఉందని, కేటాయించిన 6 యాస్పిరేషన్ పారామీటర్లలో ప్రతిభ కనబరిచిన వారికి రాష్ట్ర స్థాయిలో అవార్డుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంక్షేమ అధికారి చిన్నయ్య, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్, విద్యాశాఖ అధికారి రాజేందర్, వ్యవసాయ అధికారి విజయభాస్కర్, డిఆర్డీఓ నరేష్, సిపిఓ బాబురావు, ఆర్ డబ్ల్యూ ఎస్ ఈఈ నిర్మల, పౌర రఫరాల అధికారి శ్రీనాథ్, ఆర్డీవో మంగీలాల్, పోషణ అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ యోచన పాల్గొన్నారు.

చిన్న కాళేశ్వరం పంప్ హౌజ్ హెడ్ రెగ్యులేటర్ నిర్మాణం పనులకు శంకుస్థాపన

మహదేవపూర్, డిసెంబర్ 20 (జనం సాక్షి)

చిన్న కాళేశ్వరం పంప్ హౌస్ హెడ్ రెగ్యులేటర్ నిర్మాణం పనులకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ శంకుస్థాపన చేసినారు. ఈ సందర్భంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ. చిన్న కాలేశ్వరం పంప్ హౌస్ సేడ్ రెగ్యులేటర్ నిర్మాణం పనులను
మార్చి వరకు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మహదేవపూర్ మండలం బీరసాగర్ వద్ద చిన్న కాళేశ్వరం వద్ద గోదావరి నుండి 250.మీటర్ల వరకు నీటిని తరలించడానికి హెడ్ రెగ్యులేటర్ నిర్మాణం పనులు వేగవంతంచేయాలని మార్చి మాసం నాటికి డ్రై రన్ నిర్వహించాల్సి ఉందని పనుల్లో వేగం పెంచాలని మేఘ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులు నిర్దేశించిన సమయానికి పూర్తి చేయడం ద్వారా సాగుకు అందించడానికి అవకాశం కలుగుతుందని తద్వారా రైతులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. అలాగే హెడ్ రెగ్యులేటర్ నిర్మాణం పనులను వేగంగా పూర్తి చేయాలని అలాగే పంప్ హౌస్ విద్యుత్ సంబంధించిన
పనులను మోటార్లు పంపు మరమ్మతు పనులు పరిశీలించిన జిల్లా కలెక్టర్ పనుల్లో నాణ్యత పాటించాలని స్పష్టం చేశారు లేకుండా నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని పనులు ప్రగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు అందజేయాలనిజిల్లా కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మాయాక్ సింగ్ ఇరిగేషన్ ఈ యాదగిరి. నాయబ్ తాసిల్దార్ కృష్ణ. డిఈలు సూర్యప్రకాష్. ఉపేందర్ .మెగా డీజిఎం వైవి రావు .తదితరులు పాల్గొన్నారు.

పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా చేస్తే పీడీ యాక్ట్

ఎస్. పి శ్రీనివాసరావు

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో
డిసెంబర్ 20 (జనం సాక్షి)

ప్రభుత్వ నిషేధిత, అనుమతి లేని అక్రమ వ్యాపారులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్. పి డి.ఎల్ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ శ్రీనివాసరావు గత 6 నెలల్లో స్వాధీన పరుచుకున్న గుట్కా అక్రమ రవాణాకు సంబంధించిన వివరాలను తెలిపారు. గత జూన్ మాసం నుండి డిసెంబర్ వరకు 6 నెలల్లో గుట్కా అక్రమ రవాణా చేస్తూ, నిబంధనలకు విరుద్ధంగా నిల్వచేసి అక్రమ వ్యాపారాలు చేస్తున్న 59 మంది పై 44 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. తద్వారా రు.38.381 లక్షల విలువ చేసే గుటుక సామాగ్రిని స్వాధీనపరచుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే జిల్లాలో ప్రభుత్వం ద్వారా పేదలకు పంపిణీ జరుగుతున్న పిడిఎస్ బియ్యాన్ని అక్రమ రవాణా చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. అలాగే జిల్లాలో అక్రమణి వ్యాపారాలు చేస్తే చట్ట పరంగా కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు.అవసరమైతే వారిపై వారిపై పిడి యాక్ట్ కేసులు నమోదు చేస్తున్నట్లు వివరించారు. జిల్లాలో పోలీసులు అక్రమ వ్యాపారాలను అరికట్టడంలో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.

కేటీఆర్ ని అరెస్టు చేస్తే ఊరుకోం

డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డి ఎస్ రెడ్యా నాయక్

మరిపెడ డిసెంబర్ 20 జనం సాక్షి

కేటీఆర్ పై పెట్టిన తప్పుడు కేసు ను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే కేసును ఉపసంహరించుకోవాలని లేకుంటే బిఆర్ఎస్ ప్రజలు కార్యకర్తలు ఊరుకోమని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డిఎస్ రెడ్యా నాయక్ అన్నారు. శుక్రవారం మాజీ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు గెస్ట్ హౌస్ లో నిర్వహించిన పత్రిక విలేకరుల సమావేశంలో రెడ్యా నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం కొచ్చి ఏడాది గడిచిన అభివృద్ధి పనులు మాత్రం ముందుకు సాగడం లేదు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు హామీలు నెరవేర్చడం లేదు అని అభివృద్ధి చేయలేక బిఆర్ఎస్ ప్రభుత్వంలో కేటీఆర్ చేసిన అభివృద్ధిని ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం గోరంత కూడా చేయలేక కేటీఆర్ పై నిందలు మోపడం సరికాదని వెంటనే కేటీఆర్ పైన పెట్టిన కేసు వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ముందుగా మీరు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గ్యారంటీలను సక్రమంగా నెరవేర్చి ప్రజలకు చూపించండి అని అంతేగాని కేటీఆర్ ని అరెస్టు చేస్తే మా టిఆర్ఎస్ కార్యకర్తలు ప్రజలు ఊరుకోరని కేటీఆర్ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు, మాజీ ఎంపీపీ వెంకన్న, జిల్లా నాయకులు గుగులోత్ రాంబాబు నాయక్, తేజవత్ రవీందర్ నాయక్ , తాళ్లపల్లి రఘు, పద్మశాలి సంఘం అధ్యక్షులు శ్రీను, వీరారం మాజీ సర్పంచ్ దుస్సా నరసయ్య, మాజీ కోఆప్షన్ సభ్యులు అయూబ్ పాషా, తదితరులు పాల్గొన్నారు

విద్యార్థుల అస్వస్థత.. తనిఖీ చేసిన జిల్లా అధికారులు

పెద్ద కొడప్గల్ డిసెంబర్ 20 (జనం సాక్షి)

: పెద్ద కొడప్గల్ మండల కేంద్రంలోని బాలుర వసతి గృహంలో గురువారం రాత్రి భోజనం చేసిన విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. అనారోగ్యానికి గురైన ఇద్దరు విద్యార్థులను బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సను అందించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న షెడ్యూల్ కులాల అభివృద్ధి జిల్లా అధికారిని రజిత శుక్రవారం బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. స్థానిక వైద్యులతో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించారు. తదనంతరం అధికారిని రజిత మాట్లాడుతూ కొత్తగా వచ్చిన బియ్యం వండడంతో సరిగ్గా ఉడక లేక నలుగురు విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యారని, చికిత్స అనంతరం ప్రస్తుతం కోలుకున్నారని, బియ్యాన్ని మార్చడం జరిగిందని తెలిపారు. దీనికి బాధ్యులైన వంట మనిషిని తొలగించినట్లు తెలిపారు. అదేవిధంగా నిర్లక్ష్యం వహించిన హాస్టల్ వార్డెన్ ను వేరే హాస్టల్ కు పంపించి వేరే వార్డెన్ ను ఇక్కడ నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో

ఏఎస్డబ్ల్యూ వెంకటేష్, మండల ప్రత్యేక అధికారి కిషన్, తహసిల్దార్ దశరథ్, ఎస్సై మహేందర్, డాక్టర్ ఉమాకాంత్, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఈజీ మనీ కోసం చైన్ స్నాచింగ్

ఇద్దరు చైన్ స్నాచర్ల అరెస్ట్

శామీర్ పేట్ (జనంసాక్షి)

జల్సాలకు అలవాటు పడి ఈజీ మనీ కోసం చైన్ స్నాచింగ్ కు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించిన ఘటన షామీర్ పే ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శుక్రవారం పేట్ బషీరాబాద్ ఏసీపీ రాములు వివరాలను మీడియాకు వెల్లడించారు. ఈనెల 10వ తేదీన మూ డిచింతలపల్లి గ్రామంలో ఓ వృద్ధురాలి మెడలో నుంచి బంగారు పుస్తెల తాడులో కొద్ది భాగం చైన్ స్నాచింగ్ ప్రయత్నించిన విషయం విధితమే. దీన్ని ఛాలెంజ్ గా తీసుకున్న షామీర్ పేట్ పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం, దాదాపు 60 సీసీ కెమెరాలను పరిశీలించి బండ్లగూడకి చెందిన అంజి రెడ్డి, బోలి గూడెంకు చెందిన నరేందర్ రెడ్డిని అరెస్ట్ చేశారు. వీరిద్దరూ ఐటీ కంపెనీలో క్యాబ్ డ్రైవర్లుగా పనిచేస్తూ జీవనం కొనసాగించేవారు. ఈజీ మనీకోసం అలవాటు పడి నగర శివారు మూడు చింతల పల్లిలో చైన్ స్నాచింగుకు పాల్పడ్డారు.వీరిని కోర్టుకు రిమాండ్ చేసి
తగిన శిక్ష పడేటట్లు చేస్తామని పేర్కొన్నారు.అనంతరం సీఐ శ్రీనాథ్ మాట్లాడుతూ.. నేర రహిత సమాజంలో భాగస్వాములవ్వడానికి ప్రజలందరూ సీసీ కేమోరాలు విధిగా పెట్టుకొని పోలీసులకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో శామీర్ పేట్ ఇన్స్పెక్టర్ శ్రీనాథ్, డీటేక్టీవ్ ఇన్స్పెక్టర్ గంగాధర్, సి ఎస్ నాయుడు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి నిలువెత్తు నిదర్శనం గార్వి షరీఫ్ ఉత్సవం

శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్

శేరిలింగంపల్లి, డిసెంబర్ 20 (జనంసాక్షి) :

ముస్లిం సోదరులు ఎంతో పవిత్రంగా నిర్వహించే గార్వి షరీఫ్ ఉత్సవాలు మతసామరస్యానికి నిలువెత్తు నిదర్శనం అని, ఇందులో కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొంటారని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వాలిదాసు జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు నియోజకవర్గ పరిధి ఆల్విన్ కాలనీ డివిజన్ ఈద్గా వద్ద శుక్రవారం నిర్వహించిన గార్వి షరీఫ్ ఉత్సవానికి డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ముస్లిం మాసాల ప్రకారం రబ్బీసాని మాసంలో దర్గావద్ద గార్వి షరీఫ్ పండుగను ముస్లిం సోదరులు నిర్వహించడం ఆనవాయితీ అని ఇందులో హిందువులు, ముస్లింలు మతభేదం లేకుండా ఎంతో ఉత్సాహంగా పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన

అన్నదాన కార్యక్రమాన్ని జగదీశ్వర్ గౌడ్ తన చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం వారితో కలిసి సహపంక్తి భోజనాన్ని చేయడం జరిగింది. ప్రతి సంవత్సరం ఒకరి ఇంటి వద్ద నుండి సందల్ ఊరేగింపుతో దర్గా వద్దకు చేరుకుని ప్రతి ఒక్కరూ తమ ఇంటి నుండి ఓ జెండాను దర్గావద్దకు తీసుకువచ్చి నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూన సత్యం గౌడ్, కావూరి ప్రసాద్, వాసు, నవీన్ రెడ్డి, లక్ష్మీనారాయణ, నవాజ్, కైజర్, సయ్యద్, రెహ్మాన్, సుల్తాన్, అబ్దుల్, కలీల్, అలహాబాక్ష, ముస్తఫా, షఫీ, సోయల్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రాన్ని ప్రభుత్వానికి అందజేస్తాం

టీపీసీసీ అధికార ప్రతినిధి, స్పోక్స్ పర్సన్ గౌరీ సతీష్

మొయినాబాద్, డిసెంబర్ 20(జనం సాక్షి)

:నాయకుల, గ్రామస్తుల వినతిపత్రాన్ని ప్రభుత్వానికి అందించే కృషి చేస్తామని టీపీసీసీ అధికార ప్రతినిధి, స్పోక్స్ పర్సన్ గౌరీ సతీష్, చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జీ భీమ్భరత్లు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అజీజ్నగర్లో గల భీమ్భరత్ కార్యాలయంలో చిలుకూరు గ్రామస్తులు వినతిపత్రాన్ని గౌరీసతీష్, భీమ్భరత్లకు అందజేశారు. ఈ సందర్భంగా వారికి తెలుపుతూ మొయినాబాద్ మున్సిపాలిటీ కాకుండా చిలుకూరు పేరును పెట్టాలని కోరుతూ దీనికి ప్రభుత్వానికి అందజేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇచ్చిన వినతిపత్రాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో వీరభద్రస్వామి, రాజు, సత్యనారాయణ, కె. రాజు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానయ్య, బాకారం మాజీ సర్పంచ్ వెంకట్రెడ్డి, టోలకట్ట మాజీ సర్పంచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

25న మెదక్ జిల్లాలో సీఎం పర్యటన

ఏర్పాట్లపై అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు

మెదక్ జిల్లా బ్యూరో/ పాపన్నపేట, డిసెంబర్ 20(జనం సాక్షి):

ఈ నెల 25 న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెదక్ జిల్లా పర్యటనకు రానున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్రాజ్ తెలిపారు. మెదక్ చర్చ్ సందర్శన, పాపన్నపేట మండలం ఏడుపాయల వనదుర్గ అమ్మవారి దర్శనం సందర్భంగా శుక్రవారం సంబంధిత అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 25 న రాష్ట్ర ముఖ్యమంత్రి మెదక్ చర్చి సందర్శన, ఏడుపాయల అమ్మవారిని దర్శించుకోనున్నట్లు తెలిపారు. ప్రాంగణంలో ముఖ్యమంత్రి అమ్మవారిని దర్శించుకునే ప్రాంతం, పార్కింగ్ ప్రదేశాలు, హెలి ప్యాడ్ ప్రదేశాలను పరిశీలించి ఏర్పాట్లపై తగు సూచనలు సలహాలు అందించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

ప్రతేక అధికారి నూతన్ కుమార్

కంగ్టి డిసెంబర్ 20 (జనం సాక్షి) :

వసతి గృహాల్లో విద్యార్థులకు మెను ప్రకారం భోజనం అందించాలని ప్రత్యేక అధికారి నూతన్ కుమార్ హాస్టల్ నిర్వాహకులకుసూచించారు.శుక్రవారం కంగ్టి మండలంలోని బీసీ,ఎస్సీ, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, తడకల్ ఎస్సీ బాలుర హాస్టల్ ను మండల ప్రత్యేక అధికారి సందర్శించి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన డైట్ మెనూ పాటిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కొత్త మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, ఎటువంటి నిర్లక్ష్యం చేయకూడదని తెలిపారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల సర్వే ను తుర్కవడగామా చాప్ట (బి) కంగ్టి గ్రామాలలో జరుగుతున్న పనితీరును పరిశీలిస్తూ ఈ నెలాఖరు లోపు సర్వేను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
21 డిసెంబర్ 2024

ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం

ప్రపంచ స్థాయికి ఎదగాలి

- తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- విద్య, పరిశోధన, విస్తరణలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రంగారెడ్డి ప్రతినిధి/రాజేంద్రనగర్, డిసెంబర్ 20 (జనంసాక్షి): 2047 నాటికి వ్యవసాయ రంగంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రపంచ స్థాయికి ఎదగాలని విశ్వవిద్యాలయం కులపతి, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆకాంక్షించారు. భాగస్వాముల అందరితో సమన్వయం చేసుకుంటూ వ్యవసాయ విద్య, పరిశోధన, విస్తరణలో పురోగతి సాధించాలని సూచించారు. రాజేంద్రనగర్ లో రెండు రోజులపాటు జరగనున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాలకు శుక్రవారం గవర్నర్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. రాజేంద్రనగర్ లోని పిజెటీఏయు క్రీడా మైదానంలో కిసాన్ మేళా, వ్యవసాయ ప్రదర్శనల్ని ప్రారంభించారు. వివిధ స్టాళ్లను పరిశీలించారు. తర్వాత ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. వజ్రోత్సవాల మీనియేచర్ పైలాన్ ని రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పిజెటీఏయు ఉపకులపతి అల్దాస్ జానయ్యతో కలిసి ప్రారంభించారు. కాన్సాస్ స్టేట్ యూనివర్సిటీ గుర్తింపు పత్రాలని అందజేశారు. తర్వాత విశ్వవిద్యాలయం అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులని ఉద్దేశించి ప్రసంగించారు. 60 ఏళ్లుగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ అభివృద్ధికి అసమాన సేవల్ని అందించిందన్నారు. సొనామసూరి, తెలంగాణ సోనా వంటి వంగడాలు రూపొందించిందన్నారు. భవిష్యత్ ప్రణాళికల అమలులో విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థుల సహకారం తీసుకోవాలన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, రెన్యూవబుల్ ఎనర్జీ వంటి అధునాతన పరిజ్ఞానాన్ని వ్యవసాయ రంగంలోకి విస్తృతంగా తీసుకురావాలని గవర్నర్ సూచించారు. భారతీయ స్టేట్ బ్యాంక్ సహాయంతో విశ్వవిద్యాలయం త్వరలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్‌ను ప్రారంభించడం అభినందనీయమన్నారు. వ్యవసాయ విద్యని అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఫీజులు తగ్గించడం స్వాగతించదగినదన్నారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా డిమాండ్ ఉన్న పంటలు, మన నేల స్వభావానికి తగ్గట్లుగా అనువైన పంటలు, అందుకు అవసరమైన సాంకేతిక సలహాలు, సూచనలను రైతులకు అందించాలని విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలకి ఆయన సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు వ్యవసాయ సంక్షేమానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారన్నారు. రైతు బీమా, రైతు రుణమాఫీలతో పాటు సంక్రాంతి తర్వాత రైతు భరోసాను అమలు చేస్తామన్నారు. హార్టికల్చర్, పంటలు, కూరగాయలు పామాయిల్ సాగు పెరగాలన్నారు. బిందు, తుంపర సేద్యం, వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు, శీతల గిడ్డంగుల నిర్మాణానికి చేయుతనిస్తామన్నారు. భవిష్యత్తులో పెద్ద సంఖ్యలో వ్యవసాయ పట్టభద్రులు రావాలని వ్యవసాయ రంగంలో అధిక జనాభా నిమగ్నం కావాలని తుమ్మల ఆకాంక్షించారు. దేశ ప్రధానుల చేతుల మీద ప్రారంభమైన విశ్వవిద్యాలయం రైతాంగానికి ఎల్లప్పుడూ చేదోడువాదోడుగా ఉందని ఆయనన్నారు. గత కొన్నేళ్లుగా ఈ విశ్వవిద్యాలయం వెనుకబాటుకు గురైందని, దాని అధిగమించి పూర్వ వైభవం తీసుకురావటానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో వ్యవసాయ విశ్వవిద్యాలయం మొదటి 10 ర్యాంకుల్లో నిలవాలని తుమ్మల నాగేశ్వరరావు ఆకాంక్షించారు. విద్య, పరిశోధన, విస్తరణల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కొంతమంది వ్యతిరేకిస్తున్నప్పటికీ జన్యు మార్పిడి పంటల సాగు నీ అనుసరించవలసిందేనన్నారు. రాష్ట్రంలో ఉన్న ఇక్రిసాట్, క్రిడా వంటి సంస్థల సహకారం తీసుకోవాలని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, టెక్నాలజీలని వ్యవసాయ రంగంలో విస్తృతంగా వినియోగించుకోవాలని చిన్నారెడ్డి సూచించారు. రైతుల కష్టాలు నాటికి నేటికి అలానే ఉన్నాయని మాజీ ముఖ్యమంత్రి, మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నాదెండ్ల భాస్కరరావు అన్నారు. ధరల పెరుగుదల, వాతావరణ మార్పులకి అనుగుణంగా రైతులకి చాలా చేయవలసి ఉందని ఆయన అన్నారు. వందేళ్ళ క్రితమే వ్యవసాయంగా ప్రాముఖ్యత గురించి మహాత్మా గాంధీ చెప్పారని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సమరసింహా రెడ్డి అన్నారు. వ్యవసాయానికి అవసరమైన అన్నింటిని రైతులకు అందుబాటులో ఉంచాలని సమరసింహారెడ్డి సూచించారు. 60 ఏళ్ల వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రస్తానాన్ని పీజేటీఏయు ఉపకులపతి అల్దాస్ జానయ్య వివరించారు. 60 ఏళ్లలో సుమారు 500 వంగడాలని విడుదల చేశామన్నారు. అదేవిధంగా సుమారు 32 వేల మంది గ్రాడ్యుయేట్లు బయటకొచ్చారన్నారు. 12 రాష్ట్రాల్లో సుమారు 3 కోట్ల ఎకరాల్లో విశ్వవిద్యాలయం రూపొందించిన వరి విత్తనాలు సాగు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి,రాజేంద్రనగర్ శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్,పోచారం శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, కమిషనర్ బి. గోపి, విత్తనాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, ఆగ్రోస్ కార్పొరేషన్ చైర్మన్ బాల్ రాజు, కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డి. రాజి రెడ్డి, పద్మశ్రీ గ్రహీతలు చింతల వెంకటరెడ్డి,వెంకటేశ్వర రావు, విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతులు రఘువర్ధన్ రెడ్డి, రాఘవ రెడ్డి, పద్మరాజు, వెటర్నరీ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ప్రభాకర్ రావు, పూర్వ అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది, పరిశ్రమల ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌ను కాలుష్యం నుండి రక్షించుకోవాలి

- ఈ బాధ్యతను ప్రతీ పౌరుడు తీసుకోవాలి
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ సిటీ, డిసెంబర్ 20 (జనంసాక్షి): వన మహోత్సవం -2024 కార్యక్రమంలో భాగంగా బంజారాహిల్స్ కమాండ్ కంట్రోల్ వెనుక భాగంలో గల లింక్ రోడ్డు ప్రాంతంలో ప్లాంటేషన్ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయ లక్ష్మి తో కలిసి మొక్కలు నాటారు. తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం సంవత్సరం పూర్తి చేసుకున్నందున యా వత్ తెలంగాణలోని ప్రతి పౌరుడు, విద్యా ర్థులు, ఉద్యోగులు అందరూ ఒక మొక్క నాటాలని రాబోయే కాలంలో హైదరాబాద్ ను కాలుష్యం నుండి రక్షించే బాధ్యతను తీసుకోవాలని పిలుపునిచ్చారు.దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యంతో పాఠశాలలు బంద్ చేసే పరిస్థితి వచ్చి వేరే దగ్గరకు వలస పోతున్నారు. హైదరా బాద్‌కు అలాంటి పరిస్థితి రాకుండా ఉండడానికి కాలుష్యా న్ని నివారించడానికి ప్రభుత్వం ముందస్తు చర్యలుగా వాహనాలకు ఈవీ పాలసీ తీసుకొచ్చిం దన్నారు. హైదరాబాద్ నగరం లో అన్ని వాహనాలు ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ఇతర వాహనాలు, ఎలక్ట్రిక్ వాహనాలుగా, కాలపరిమితి పూర్తి చేసుకున్న జీహెచ్ఎంసీలో వాడే వాహనాలు స్క్రాప్ కి ఇచ్చి ఈవి వెహికిల్ గా,15 సంవత్స రాలు దాటిన వాహనాలు స్క్రాప్ పాలసీ తీసుకొచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, అటవీ శాఖ అధికారులు,ఇతర అధికారులు పాల్గొన్నారు.

కేసులు ఉపసంహరించుకునే వరకూ పోరాడుతాం

- శాసనమండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి

హైదరాబాద్, డిసెంబర్ 20 (జనంసాక్షి) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై పెట్టిన అక్రమ కేసును ఉపసంహరించుకునే వరకు పోరాడుతామని మండలిలో విపక్ష నేత, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి అన్నారు. కేటీఆర్ మీద పెట్టిన అక్రమ కేసు తీవ్రంగా నిరసన తెలుపుతున్నామని, దానిపై సభలో చర్చించాలని డిమాండ్ చేశామన్నారు. హైదరాబాద్ విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు కేసీఆర్ అనేక కార్యక్రమాలు చేపట్టారని, కేటీఆర్ తన శక్తి మేరకు ప్రపంచ స్థాయి ఫార్ములా-ఈ రేస్ హైదరాబాద్ తెచ్చారని వెల్లడించారు. శాసనమండలి మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్సీలు మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్ కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో విదేశీ పెట్టుబడులు పెట్టేలా ఈ రేస్ చేపట్టారన్నారు. మొదటి రేసు విజయవంతమైందని, రెండో రేసుని ప్రభుత్వం ఆపేసిందని చెప్పారు. హైదరాబాద్‌ను సర్వనాశనం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని విమర్శించారు. అందులో భాగంగానే కేటీఆర్‌పై అక్రమ కేసు పెట్టారని ఆరోపించారు. ఇప్పటికే కేటీఆర్ అన్ని వివరాలు చెప్పారని, ఇందులో ఎలాంటి అవినీతి జరగలేదని స్పష్టం చేశారు. చాలా పారదర్శకంగా చెల్లింపులు జరిగాయని వెల్లడించారు. ప్రభుత్వం తప్పులను ఎత్తి చూపుతునందుకే ఈ అక్రమ కేసు పెట్టారని విమర్శించారు. రాష్ట్రంలో భయానక వాతావరణం కొనసాగుతున్నదని, అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ బిడ్డలకు పోరాటాలు కొత్తకాదని చెప్పారు. ఎలాంటి కేసులైన ధైర్యంగా ఎదుర్కొంటారని స్పష్టం చేశారు. కేటీఆర్‌ప పెట్టిన కేసు అక్రమమని మాజీ మంత్రి మహమూద్ అలీ అన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఈ రేస్ తెచ్చారని తెలిపారు. అనుకున్న దానికంటే ఎక్కువ పెట్టుబడులు వచ్చాయని వెల్లడించారు. హైదరాబాద్ ఇమేజ్ మరింత పెంచేందుకు ఫార్ములా-ఈ రేస్ తెచ్చారని చెప్పారు. కేటీఆర్ మీద కేసులు పెట్టడం కాదని, ఇచ్చిన హామీలు నెరవేర్చాలని రేవంత్ రెడ్డికి సూచించారు.

ఎన్నికల హామీలపై చర్చ జరగాల్సిందే..

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

హైదరాబాద్, డిసెంబర్ 20 (జనంసాక్షి) : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నో అలవికాని హామీలు ఇచ్చిందని, ఇప్పుడు ఆ హామీలను నెరవేర్చడంలో విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. ఆ హామీలపై చర్చ పెట్టాలని తాము కోరామని తెలిపారు. ఇవాళ ఉదయం శాసనసభ సమావేశాల ప్రారంభానికి ముందు మీడియా పాయింట్‌లో తలసాని మాట్లాడారు. ఫార్ములా వన్ రేసు సందర్భంగా అవినీతి జరిగిందంటూ తమ నాయకుడు కేటీఆర్‌పై కేసు పెట్టారని, ఫార్ములా వన్‌పై చర్చ జరగాలని తాము డిమాండ్ చేస్తున్నామని తలసాని వెల్లడించారు. శాసనసభలో తమ దళిత ఎమ్మెల్యేలకు చెప్పులు చూపించారని ఆయన ఆరోపించారు. సభ రికార్డులు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. తాము అన్ని విధాల సభకు సహకరించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

తెలంగాణ భవన్ వద్ద పోలీసుల మోహరింపు

హైదరాబాద్, డిసెంబర్ 20 (జనంసాక్షి) : తెలంగాణ భవన్ వద్ద పోలీసులు భారీగా మోహరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఫార్ములా ఈ-కార్ రేసులో ఏసీబీ కేసు నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అధికారులు భద్రత ఏర్పాటు చేశారు. కాగా, కాంగ్రెస్ సర్కార్ కుటిల ప్రయత్నంతో ఫార్ములా ఈ-కార్ రేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావుపై కేసు నమోదైంది. ఈ-కార్ రేసింగ్‌లో రూ.54.88 కోట్లు దుర్వినియోగం చేశారనే అభియోగంతో కేటీఆర్‌పై ఎంఏయూడీ సెక్రటరీ దానకిశోర్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి ఫిర్యాదు చేశారు. ఈ కేసుపై ఇప్పటికే పథకం ప్రకారం గవర్నర్ అనుమతి సైతం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం.. ఐఏఎస్ దానకిశోర్‌తో ఫిర్యాదు చేయించి, అరెస్టు చేసేందుకు కుట్రలు పన్నిందని బీఆర్ఎస్ శ్రేణులు విమర్శిస్తున్నాయి. గవర్నర్ నుంచి అనుమతి లభించిన వెంటనే ఈ వ్యవహారంపై విచారణ చేపట్టాలని మంగళవారం సీఎస్ శాంతికుమారి ఏసీబీకి లేఖ రాశారు. దీంతో బుధవారం సాయంత్రం ఎంఏయూడీ సెక్రటరీ దాన కిశోర్ ఏసీబీకి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం కేటీఆర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని ఏసీబీ డీఎస్పీ మాజిద్ అలీఖాన్ తెలిపారు. ఎన్నికల నియమావళిని ధిక్కరిస్తూ, ప్రభుత్వ అనుమతి లేకుండా, ముందస్తు సమాచారం ఇవ్వకుండా రూ.54,88,87,043 కోట్లను యూకేకు చెందిన 'ఫార్ములా ఈ ఆపరేషన్స్ లిమిటెడ్' (ఎఫ్ఈఓ) కంపెనీకి హిమాయత్‌నగర్ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు నుంచి బదిలీ చేయించారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు ఏ1గా మాజీ మంత్రి కేటీఆర్, ఏ2గా సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, ఏ3గా హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఇతరులపై కేసు నమోదు చేశారు. ఐసీపీ (బీఎన్ఎస్) 13(1) (ఏ), 13(2), సీపీయూక్ట్ 409, 120 (బీ) సెక్షన్స్ కింద అభియోగాలు మోపారు. ఈ మేరకు నాంపల్లి ఏసీబీ కోర్టుకు ఏసీబీ అధికారులు వివరణ ఇచ్చారు. రూ.10 కోట్లకు మించి బదిలీ జరిగితే ప్రభుత్వం, ఆర్థికశాఖ అనుమతి అవసరమని, సీజన్ 10 ఫార్ములా ఈ రేసింగ్‌కు స్పాన్సర్స్ లేక పోవడంతో హెచ్ఎండీఏ నిధులు మళ్లించారని, దీంతో విదేశీ కంపెనీకి చెల్లింపులతో హెచ్ఎండీఏకు అదనపు పన్ను భారమైందని దానకిశోర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. కేటీఆర్ సహా ఇతర అధికారులను విచారించేందుకు ఏసీబీ డీజీ విజయ్‌కుమార్ బంజారాహిల్స్‌లోని కేంద్ర కార్యాలయంలో ప్రత్యేకంగా ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా బృందాన్ని విచారణ కోసం ఏర్పాటు చేసినట్టు తెలిసింది. ఈ టీమ్‌లో పది మంది సిబ్బంది ఉన్నట్టు సమాచారం. విచారణ వివరాలు ఎప్పటికప్పుడు ఏసీబీ ఉన్నతాధికారికి, వారి నుంచి ప్రభుత్వానికి చేరేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలిసింది. ఈ క్రమంలో కేటీఆర్‌కు త్వరలోనే విచారణ నోటీసులను ఏసీబీ అధికారులు ఇవ్వనున్నారు. ఇప్పటికే కేటీఆర్ ప్రెస్‌మీట్ పెట్టి రాష్ట్ర ప్రజలకు ఈ-కార్ రేస్ గురించి వాస్తవాలు వెల్లడించడంతో ఆయనను అక్రమంగానైనా అరెస్టు చేస్తారనే ప్రచారం జరుగుతున్నది.

షట్‌డౌన్ దిశగా అమెరికా!

ఏకంగా 38 మంది రిపబ్లికన్ సభ్యులే డెమోక్రాట్లతో కలిసి బిల్లుకు వ్యతిరేకంగా ఓటేశారు. మరోవైపు ప్రస్తుతానికి సెనెట్‌లో డెమోక్రాట్ల పట్టు కొనసాగుతోంది. దీంతో శుక్రవారం రాత్రిలోగా ప్రభుత్వానికి నిధులు సమకూర్చడంలో కాంగ్రెస్ విఫలమైతే అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్ ఎదుర్కోక తప్పని పరిస్థితి నెలకొంది. అమెరికాలో లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. దాదాపు 8,75,000 మంది పనులు నిలిచిపోయే అవకాశం ఉంది. వీరిలో చాలామందిని పని ప్రదేశంలో రిపోర్టు చేయవద్దట్టారని బ్రెఫార్టీసన్ పాలసీ సెంటర్ డైరెక్టర్ అక్బాస్ వెల్లడిరచారు. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వంటి విభాగాల్లోని మరో 14 లక్షల మంది మాత్రం అత్యవసర సేవలు కొనసాగించాల్సి ఉంటుంది. వీరితో సెలవుల్లో కూడా పని చేయించుకొని చెక్ ఇవ్వరని ది అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ సంఘం పేర్కొంది. షట్‌డౌన్ ముగిశాకే.. వారికి పాత వేతనాలు చెల్లింపులు జరుగుతాయని పేర్కొంది. కొన్ని కాంట్రాక్టుల్లో ఈ చెల్లింపులకు ఎలాంటి హామీలు ఉండవని తెలిపింది. అమెరికా శత్రువులకు ఈ షట్‌డౌన్ ఓ క్రిస్మస్ గిఫ్ట్ అని అభివర్ణించింది. ఇక ముఖ్యంగా రవాణాశాఖ, ఇతర రంగాలపై ఈ షట్‌డౌన్ ముప్పు కొనసాగుతుంది.

ఏ విభాగాలపై ప్రభావం..

సోషల్ సెక్యూరిటీ, మెడికేర్ లబ్ధిదారులపై దీని ప్రభావం ఉండదు. వీరికి సంబంధించిన ప్రయోజనాలను కాంగ్రెస్ ప్రత్యేక చట్టం రూపంలో ఆమోదం తెలుపుతుంది. వీటికి వార్షిక చెల్లింపులు అవసరం లేదు. కానీ, సోషల్ సెక్యూరిటీ ఆఫీస్‌లు అందించే ప్రయోజనాలు పరిమితంగా ఉంటాయి. నేషనల్ పార్క్ సర్వీసులు మూతపడతాయి. 2013లో వందలకొద్దీ పార్కులు, మ్యూజియంలు, ఇతర ప్రదేశాలను మూసేశారు. అమెరికాలో షట్‌డౌన్ మొదలైతే ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేము. 2018-19 మధ్య దాదాపు 35 రోజుల పాటు మూతపడిరది. నాడు ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నారు. అమెరికా చరిత్రలోనే అది సుదీర్ఘమైన షట్‌డౌన్.

జాతీయ ఫెస్టుతో విద్యార్థులకు ఎంతో మేలు

- హైదరాబాద్ కిటికల్ రివర్ అండ్ కార్పొరేషన్ అధికారి సాలమన్ దేవ్ వరం

మొయినాబాద్,డిసెంబర్ 20(జనం సాక్షి):మెనేజ్మెంట్ విద్యలో విద్యార్థులకు అవగాహన పెంపొందించేందుకు అధ్యాపకుల పాత్ర ఎంతో అవసరమని నాణ్యమైన విద్యతో పాటు ప్రాక్టికల్స్ ప్రయోగాలు ఎంతో అవసరమని సీనియర్ డైరెక్టర్ హెడ్ బాలెంట్ హ్యూమన్ వెల్త్, హైదరాబాద్ కిటికల్ రివర్ అండ్ కార్పొరేషన్ అధికారి సాలమన్ దేవ్ వరం అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అజీజనగర్ చౌరస్తాలో గల విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో అద్వాయ 2K24 జాతీయ స్థాయి ఫెస్టు రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. మొదటి రోజు శుక్రవారం ప్రారంభం కాగా జాతీయ స్థాయిలో 35 కళాశాలల నుంచి 300 మంది విద్యార్థులకు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హైదరాబాద్ కిబికల్ రివర్ అండ్ కార్పొరేషన్ అధికారి సాలమన్ దేవ్ వరం పాల్గొని జ్యోతి ప్రజ్వాలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు జాతీయ ఫెస్టో పాల్గొనడం అభినందనీయమన్నారు. విద్యతో పాటు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడే విజ్ఞానవంతులుగా ఎదుగుతారన్నారు. విద్యార్థుల కోసం ఫార్మాలి. ఎన్ఫార్మాలి ఏర్పాటు చేయడం ఎంతో బాగుందన్నారు. ఇందులో ఫార్మాలిలో పేపర్ ప్రజెంటేషన్, యంగ్ మేనేజర్, సర్ఫ్ టైమ్, బిజినెస్ క్విజ్తో పాటు ఎన్ఫార్మాలిలో ఇలేంట్స్, ట్రెజరాట్, డేస్వింగ్, సింగింగ్, ఐపీఎల్ బిట్టింగ్ వివిధ అంశాలపై నిర్వహించడం విద్యార్థులకు ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సాయిబాబారెడ్డి, డీన్ డాక్టర్ పద్మజ, శ్రీలత, ఏవో వెంకటాచలం, హెచ్వీడీ కన్వీనర్ డాక్టర్ పి.చక్రధర్, కోకన్వీనర్లు జీవన్కుమార్, సునీత, బి.నవీన్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సృజన, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హామీలు మరిపించటానికే తప్పుడు కేసులు

- కేటీఆర్‌పై చిల్లర కేసు.. విచారణలో అన్ని తేలుతాయ్ : జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 20 (జనంసాక్షి) : ప్రజలకు ఇచ్చిన హామీలను మరిపించడానికే కాంగ్రెస్ ప్రభుత్వం కేటీఆర్‌పై తప్పుడు కేసు పెట్టిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీష్‌రెడ్డి ఆరోపించారు. తమ నాయకులపై తప్పుడు కేసులు పెట్టేందుకు ఎన్నో ఎంక్వయిరీలు చేయించారని, అయినా కొండను తవ్వి కనీసం ఎలుకను కూడా పట్టలేదని విమర్శించారు. కేటీఆర్‌పై ఒక చిల్లర కేసు పెట్టారని, తప్పు చేసినట్లయితే శాసనసభలో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. ఫార్ములా వన్ రేసుపై సమాధానం చెప్పడానికి కేటీఆర్ సిద్ధంగా ఉన్నారని జగదీష్ రెడ్డి చెప్పారు. చర్చ పెట్టకుండా ఎందుకు పారిపోతున్నారని, దమ్ము లేదా..? అని ఆయన ప్రశ్నించారు. రైతు రుణ మాఫీ, మహిళా సమస్యలపై అసెంబ్లీలో చర్చనే లేదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం ఏడు లక్షల కోట్ల అప్పు చేసిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అప్పు నాలుగు లక్షల కోట్లేనని ఆర్బీఐ స్పష్టం చేసిందని అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ఫార్ములా వన్‌పై చర్చ కచ్చితంగా జరగాల్సిందేనని మాజీ మంత్రి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా వాస్తవాలు ప్రజలకు తెలుసని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంలో 1.2 లక్షల కోట్ల రూపాయల అప్పు చేసిందని, దీన్నిబట్టి వాళ్ళు ఐదేళ్లలో ఏడు లక్షల కోట్ల అప్పు చేస్తారని అన్నారు. అసత్యాలతో బీఆర్ఎస్ పార్టీని బయపెట్టలేరని వ్యాఖ్యానిం చారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ని కుట్రలు చేసినా, వెధవ వేషాలు వేసినా ప్రజాక్షేత్రంలో, శాసనసభలో నిలదీస్తామని జగదీష్ రెడ్డి అన్నారు. ఫార్ములా వన్‌పై తప్పక అసెంబ్లీలో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటేనని, బడే భాయ్, చోటే భాయ్ ఒకే లైన్‌లో ఉన్నారని ఆరోపించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370